జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | మంగళవారం 11 ఆగస్టు 2026 | సంపుటి: 19 | సంచిక: 157 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: తృతీయ - 23:09:45 వరకు నక్షత్రంశతభిష - 20:46:16 వరకు కరణంవణిజ - 10:55:14 వరకు, విష్టి - 23:09:45 వరకు పక్షంకృష్ణ యోగంశోభన - 23:22:39 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ

**రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు**

హైదరాబాద్,ఆగస్ట్10(ప్రజాజ్యోతి): తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ..సర్ పక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగాణలో 73,95,954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం.

మిగతా 2లో..

## తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

**రైతులకు సాగునీటి సమస్యను తీర్చండి**

**మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు లేఖ**

హైదరాబాద్,ఆగస్ట్10(ప్రజాజ్యోతి): తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్

మిగతా 2లో..

# మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

**కామన్‌వెల్త్ క్రీడాకారులకు ప్రధాని మోడీ అభినందనలు**



న్యూఢిల్లీ,ఆగస్ట్10(ప్రజాజ్యోతి): దేశ కీర్తిపతాకను అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన క్రీడాకారులను ప్రధాని మోడీ అభినందించారు. మీ గెలుపు...మీకే కాదు..దేశానికి గర్వకారణమని వారిని ప్రశంసించారు. భారత బాక్సర్ లవ్లీనాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లు ఆదివారం ప్రధానిని కలిసిన సంగతి తెలిసిందే. వారితో సరదాగా మాట్లాడిన మోదీ అథ్లెట్లకు లడ్డూలు తినిపించారు. ఈ సందర్భంగా బాక్సర్ లవ్లీనా.. గ్లాస్గోలో చేసిన పనిని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ఆ రెస్టరెంట్‌లో ఏం జరిగిందని మో ప్రశ్నించగా...అదేమీ చిన్న విషయం కాదని.. దేశమంతా సుదీర్ఘకాలం గుర్తు పెట్టుకుంటుందని లవ్లీనా తెలిపారు. కామన్వెల్త్ గేమ్స్‌లో మంచి ప్రదర్శన

మిగతా 2 లో..

## హర్ ఘర్ తిరంగాలో ఉత్సాహంగా పాల్గొనాలి

- ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు
- 14న ట్యాంక్ బండ్ దగ్గర భారీ 'తిరంగా యాత్ర'
- ఇంటిపై జాతాయ జెండాను ఆవిష్కరించిన రాంచందర్ రావు

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ప్రజాజ్యోతి): మన జాతీయ పతాకం దేశానికి గర్వకారణమని, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని అన్నారు. త్రివర్ణ పతాకం మనకు నిరంతర ప్రేరణ శక్తి అని పేర్కొన్నారు. ఏటా స్వాతంత్య దినోత్సవం నాడు కోట్ల మంది ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని

మిగతా 12 లో..

# అతలాకుతలం

## కొలంబియాలో భారీ భూకంపం

## 7.4 తీవ్రతతో సంభవించిన భూకంపం

## • 47 మంది మృతి, కుప్పకూలిన ఇండ్లు



న్యూఢిల్లీ,ఆగస్ట్10(ప్రజాజ్యోతి): దక్షిణ అమెరికా దేశమైన కొలంబియాలో భారీ భూకంపం సంభవించింది. సోమవారం రోజు పశ్చిమ కొలంబియా ప్రాంతంలో భూమి తీవ్రంగా కంపించింది. రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రత నమోదైంది. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు కనీసం 47 మంది ప్రాణాలు కోల్పోయారు. పలు నగరాల్లో అనేక భవనాలు కుప్పకూలిపోయాయి. దీంతో శిథిలాల కింద కూడా ఇంకా చాలా మందే చిక్కుకున్నట్లు సమాచారం. వీరి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రకంపనలతో ఇళ్ల నుంచి జనం ఒక్కసారిగా సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. చొకో రీజియన్‌లోని శాన్ జోస్ డెల్ పాల్మర్ ప్రాంతంలో ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే ), కొలంబియా భూకంప పరిశీలన సంస్థ గుర్తించాయి. ఇది కొలంబియా రాజధాని బొగోటాకు దాదాపు 400 కిలోమీటర్ల దూరంలో ఉంది.

మిగతా 2 లో..



**తెలంగాణకు కీలకమైన పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ ప్రాజెక్టు హోదాపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించే ప్రతిపాదన తమ పరిశీలనలో లేదని రాజ్యసభలో కేంద్ర జలశక్తి శాఖ స్పష్టం చేసింది. మరోవైపు కృష్ణా జలాల వినియోగం, అంతర్రాష్ట్ర అంశాలు కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్--2 పరిధిలో ఉండటంతో ఈ వ్యవహారం న్యాయ విచారణలో ఉందని కేంద్రం తెలిపింది.**

# మళ్లీ నిరాశే

- పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేం
- కేంద్రం మరోమారు తెలంగాణకు మొండిచేయి
- రాజ్యసభలో రేణుకాచౌదరి ప్రశ్నకు కేంద్రం సమాధానం
- పోలవరం తొలిదశ నిర్మాణానికి కేంద్రం ఆమోదం
- సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లు

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ప్రజాజ్యోతి): కేంద్రంలోని మోడీ సర్కార్ తెలంగాణకు మరోసారి మొండిచేయి చూపింది. తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వలేమని చెప్పింది. ఆ ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని తేల్చిచెప్పింది. ప్రాజెక్టు టెక్నో ఎకనామిక్ అప్రైజల్‌ను

మిగతా 2 లో..

## రిఫార్మ్ ఉత్సవ్‌పై కార్యాచరణ

**ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్**

హైదరాబాద్,ఆగస్ట్10(ప్రజాజ్యోతి): భారత ప్రభుత్వ కేబినెట్ కార్యదర్శి డా. టి.వి. సోమనాథన్ సోమవారం అన్ని రాష్ట్రాలప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'రిఫార్మ్ ఉత్సవ్ కార్యక్రమం అమలు, కార్యాచరణపై రాష్ట్రాలకు వివరించారు. అక్టోబర్ 2026 నుంచి రిఫార్మ్ ఉత్సవ్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు కేబినెట్ కార్యదర్శి తెలిపారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలను సేకరించి, వాటిని

మిగతా 12 లో..



# సాగర్ వేదికగా 'మహా వరుణ యాగం'

## పూర్ణాహుతిలో పాల్గొన్న రేవంత్ దంపతులు

**వేకువజామునే క్రతువు ప్రారంభించిన ఉత్తమ్ దంపతులు**



నాగార్జునసాగర్,ఆగస్ట్10(ప్రజాజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు నిండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం నాగార్జునసాగర్ వేదికగా 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ విశిష్ట ఆధ్యాత్మిక క్రతువును చేపట్టారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు , వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులు 11 హోమగుండాలతో ఈ మహా యాగాన్ని శాస్త్రోక్తంగా పూజలు జరిపి పూర్తి చేశారు. ఈ వరుణ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని హోమగుండంలో పూర్ణాహుతి సామాగ్రిని

మిగతా 2 లో..

# అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

## అప్పటి వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన తప్పదు

**హెచ్చరించిన ప్రియాంక, రాహుల్ గాంధీ**





న్యూఢిల్లీ,ఆగస్ట్10(ప్రజాజ్యోతి): పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వివరణ ఇవ్వాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ పట్టుబడుతోంది. ప్రకటన వచ్చేవరకు పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా తేల్చి చెప్పారు. సోమవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రియాంక గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. 'కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటన ఇచ్చే వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన కొనసాగుతుంది' అని

మిగతా 2 లో..

## గ్లోబల్ హబ్‌గా తెలంగాణలో ఇంధన రంగం అభివృద్ధి

**2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యం లక్ష్యం**

**అమెరికా పర్యటనలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**



హైదరాబాద్,ఆగస్ట్10(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్లీలోని గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలోని 'ఇండియా ఎనర్జీ ,క్లైమేట్ సెంటర్' ను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో భారతదేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనతో

మిగతా 12 లో..

# తెలంగాణ కోసమే బతికిన పెద్ది

**ప్రజల అభిమానం చూరగొన్న నేత**

## నర్సంపేట కాలేజీకి పెద్ది పేరు పెడతాం

## పెద్ది సంతాపసభలో కేటీఆర్ వెల్లడి



నర్సంపేట,ఆగస్ట్10(ప్రజాజ్యోతి): ఎంతకాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవితమే అందుకు ఉదాహరణ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు

మిగతా 12 లో..

# సంపాదకీయం

## జార్ఖండ్ ఆందోళనపై దృష్టి సారించాలి!

పరీక్ష ఏదైనా లీకులు సర్వ సాధారణం అవుతున్నాయి. పరీక్షలు రాసిన విద్యార్థులు నష్టపోతున్నారు. ఏడాదంతా కష్టపడి పరీక్ష రాసిన విద్యార్థుల భవిష్యత్ దెబ్బతింటోంది. కొందరు దగుల్బాజీలు కాసులకు కక్కుర్తి పడడంతో ఉజ్వల జీవితాన్ని విద్యార్థులు కోల్పోతున్నారు. మొన్నటి వరకు నీట్ గొడవ ముగిసిందనుకుంటే.. ఇప్పుడు జార్ఖండ గొడవ మొదలయ్యింది. ఇక్కడ ఉన్నది ఇండియా కూటమి ప్రభుత్వమే. సిఎం హేమంత్ సోరెన్ ప్రభుత్వం కూడా ఇందుకు బాధ్యత వహించాలి. అలాగే రాహుల్ కూడా దీనిపై సమాధానం చెప్పాలి. కేంద్రంలో హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని అంటున్న రాహుల్ ముందు జార్ఖం÷–డ్ వెళ్లి అక్కడి విద్యార్థులకు సమాధానం చెబితే బాగుండేది. పరీక్షలు ఏవైనా, ఎక్కడ లీకైనా పాలకులు బాధ్యత వహించాల్సిందే. కేంద్రంలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనీమా చేసిన తరవాత, పరీక్షల సంస్కరణలకు ఎన్‌డిఎ సర్కార్ నడుం బిగించింది. నందన్ నీలేకన్ నేతృత్వంలొ నిపుణుల కమిటీని వేసింది. లీకేజ్ వీరులపై చర్యలు తీసుకునేలా చట్టం తెచ్చింది. పదికోట్ల వరకు జరిమానా, పదేళ్ల వరకు జైలు శిక్ష విధించనున్నారు. ఇప్పుడు దీనిని ఉపయోగించి జార్ఖండ్ దోషులపై తొలి చర్యకు ఉపక్రమించాలి. ఇందుకోసం రాహుల్ కూడా పట్టుబట్టాలి. కేవలం అమిత్ షా రాజీనామా చేయాలన్న రాజకీయ డిమాండ్‌తో పార్లమెంట్‌ను అడ్డుకుంటూ విలువైన ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారు. పార్లమెంట్ నడవకుండా చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే కేంద్రం చర్యలు తీసుకున్నందున, ఇక జార్ఖండ్‌పై రాహుల్ దృష్టిసారిస్తే మంచిది.మరోవైపు జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 14వ ప్రిలిమినరీ పరీక్షలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు ప్రారంభించింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర సిఐడి నమోదు చేసిన కేసు ఆధారంగా గత వారం ఇది ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ నమోదు చేసింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. విద్యార్థులతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం, హేమంత్ సోరెన్ నేతృత్వంలోని జార్ఖండ్ ప్రభుత్వం నియామకాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై సిఐడి, ఇడి దర్యాప్తులకు అంగీకరించింది. విద్యార్థులతో జరిగిన సమావేశం అనంతరం మంత్రి సుదివ్య కుమార్ సోను మాట్లాడుతూ.. విద్యార్థులు లేవనెత్తిన డిమాండ్లలో దాదాపు 98 శాతం అంశాలను ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. 2023, 2025 సంవత్సరాలకు సంబంధించిన బ్యాక్‌లాగ్ నియామక పరీక్షలతో పాటు 14వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షను రద్దు చేయడానికి ప్రభుత్వం అంగీకరించిందని చెప్పారు. అయితే సర్వీస్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్షను రద్దు చేయడం, అలాగే నియామక పరీక్షల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై సిబిఐ దర్యాప్తు జరిపించాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించలేదు. మంత్రి సుదివ్య కుమార్ సోను ప్రకారం.. సిజిఎల్ పరీక్షను రద్దు చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం ఏకపక్షంగా అంగీకరించలేదని తెలిపారు. ఈ పరీక్ష హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాల పరిధిలో నిర్వహించబడినందున, ప్రభుత్వం స్వయంగా దానిని రద్దు చేయలేదని వివరించారు. అయితే ప్రభుత్వం తమ డిమాండ్లలో 98 శాతం అంగీకరించిందన్న వాదనను నిరసన చేస్తున్న విద్యార్థులు తిరస్కరించారు. విద్యార్థులు ప్రభుత్వ ప్రతిపాదనపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సోమవారం 'విధానసభ ఘెరావ్' నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తమ ప్రధాన డిమాండ్ అయిన సిబిఐ దర్యాప్తును ప్రభుత్వం అంగీకరించలేదని విద్యార్థి నాయకులు పేర్కొన్నారు. తమ డిమాండ్ల లో 98 శాతం నెరవేర్చామని ప్రభుత్వం చెప్పడం వాస్తవానికి విరుద్ధమని వారు ఆరోపించారు. 13 పరీక్షలను రద్దు చేయాలని తాము డిమాండ్ చేయగా, ప్రభుత్వం కేవలం మూడు పరీక్షలను మాత్రమే రద్దు చేసిందని ఓ విద్యార్థి నాయకుడు పేర్కొన్నారు. అవకతవకలపై కేవలం సిఐడి దర్యాప్తుపైనే ఆధారపడటాన్ని కూడా విద్యార్థి నాయకులు విమర్శించారు. గతంలో సిఐడిపై పలు విషయాల్లో 'కప్పిపుచ్చే ప్రయత్నాలు' చేసిందనే ఆరోపణలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. నియామక పరీక్షల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై నిజాలను వెలుగులోకి తీసుకురావడానికి, బాధ్యులను గుర్తించడానికి స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ అవసరమని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వానికి తమ డిమాండ్లను శాంతి యుతంగా వివరించాలని విద్యార్థి నాయకులు సూచించారు.సర్వీస్ కమిషన్ 14వ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకల ఆరోపణలపై ఇడి రంగంలోకి దిగడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు ప్రభుత్వం ఇడి, సిఐడి దర్యాప్తులకు అంగీకరించగా, మరోవైపు విద్యార్థులు మాత్రం సిబిఐ వంటి స్వతంత్ర దర్యాప్తు కోరుతూ తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు న్యాయం జరిగేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అవకతవకు కారకులైన వారిని ఊచలు లెక్క బెట్టేలా చేయాలి. అప్పుడే వారికి న్యాయం జరుగుతుంది. అలాగే ఇతరులకు తగిన గుణపాఠం కలిగేలా కొత్త చట్టం ద్వారా చర్యలు తీసుకోవాలి.

# మళ్లీ నిరాశే

మొదటిపేజీ తరువాయి..

ప్రస్తుతం చేపట్టలేమని.. కృష్ణా జలాల వినియోగం, అంతర్రాష్ట్ర అంశాలు ట్రిబ్యునల్ పరిధిలో ఉందని స్పష్టం చేసింది. తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో రావాలంటూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ డీపీఆర్‌ను కేంద్రం తిరిగిన వెనక్కి పంపింది. ప్రాజెక్టుకు కేంద్ర సాయం విషయంలోనూ తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. ప్రస్తుతం జరుగుతోన్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి రాజ్యసభలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ జాతీయ హోదా గురించి ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎంపీ రేణుకా చౌదరి ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం కేంద్రం పరిశీలనలో లేదని స్పష్టం చేశారు. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ 2 పరిధిలో అంతర్రాష్ట్ర అంశాలు ఉండటంతో టెక్నో-ఎకనామిక్ అప్రైజల్ సాధ్యం కాదని, సమగ్ర ప్రణాళికతో డీపీఆర్‌ను మళ్లీ సమర్పించాలని సూచించారు. ప్రాజెక్టుకు సాయం విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు. అంతేకాకుండా, ప్రాజెక్టుకు కేంద్ర నిధుల సాయం అందించే విషయంలోనూ ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. జాతీయ ప్రాజెక్టు హోదా అనేది ప్రధానంగా జాతీయ ప్రాధాన్యం, అంతర్రాష్ట్ర లేదా అంతర్జాతీయ జల వివాదాలు లేకపోవడం , గణనీయమైన సాగునీటి సామర్థ్యం ఆధారంగా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారమే ఇస్తామని కేంద్రం పునరుద్ఘాటించింది. కృష్ణా జలాలపై క్లియరెన్సులు, ట్రిబ్యునల్ పరిధిలోని అంశాలు తేలితే తప్ప ఈ ప్రాజెక్టు హోదాపై తదుపరి నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదని కేంద్రం తేల్చిచెప్పింది.

పోలవరం ప్రాజెక్టు తొలి దశ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లని కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది. తొలి దశలో 41.15 మీటర్ల వరకు ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపింది. గత ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.12,620.53 కోట్ల నిధులు విడుదల చేసిందని పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.5,512.40 కోట్లు కేటాయించినట్లు వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టు పురోగతిపై రాజ్యసభలో బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. ఈ సందర్భంగా స్పిల్‌వే నిర్మాణంలో ఇప్పటివరకు 96.87 శాతం మట్టి పనులు పూర్తయ్యాయని కేంద్ర జలశక్తి శాఖ తెలిపింది. కాంక్రీట్ పనులు 98.84 శాతం, స్టీల్ పనులు 92.9 శాతం మేర పూర్తయ్యాయని వెల్లడించింది. అలాగే ఎర్త్-కమ్-రాక్‌ఫిల్ డ్యామ్‌కు సంబంధించి కాంక్రీట్ పనులు 81.99 శాతం పూర్తయ్యాయని పేర్కొంది. ప్రధాన కాలువల తవ్వకం పనులు 98.96 శాతం పూర్తయ్యాయని వివరించింది. ప్రాజెక్టు తొలి దశలో మిగిలిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది. పోలవరం తొలి దశలో నిర్వాసిత కుటుంబాల పునరావాసం, పునరావాస ప్యాకేజీల అమలుపైనా కేంద్రం వివరాలు వెల్లడించింది. ఇప్పటివరకు 17,892 నిర్వాసిత కుటుంబాలను తరలించినట్లు తెలిపింది. ఆర్‌అండ్‌ఆర్ పరిహారం కింద రూ.1,373.01 కోట్లు పంపిణీ చేసినట్లు కేంద్రం పేర్కొంది. పునరావాసం, పునరావాస పనులకు అదనంగా రూ.1,581.08 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టు తొలి దశను మార్చి 2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్రం తెలిపింది. అవసరమైతే మరో ఏడాది గడువు పొడిగించే వెసులుబాటు కూడా ఉందని స్పష్టం చేసింది. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు నిర్వాసితుల పునరావాసం, పునరావాస పనులను సమాంతరంగా ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు కొనసాగుతున్నాయని రాజ్యసభకు ఇచ్చిన సమాధానంలో కేంద్ర జలశక్తి శాఖ పేర్కొంది.

## తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ

మొదటిపేజీ తరువాయి..

ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తై చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్



ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. కాగా, తెలంగాణలో సర్ ప్రక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

# అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

మొదటిపేజీ తరువాయి..

అన్నారు. ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు. పోలీసుల దాడిలో యువతులు, మైనర్లు గాయపడ్డారని అన్నారు. కాల్పులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన దాడిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ 'నేరం'పై ఆయన సమాధానం చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రయాగ్‌రాజ్‌లో శనివారం జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో ఓ విద్యార్థి నీట్‌కు సన్నద్ధమైన తాను సర్వం కోల్పోయానని, తనకు ఏ అవకాశాలు మిగల్లేదని ఆవేదనతో తెలిపాడని రాహుల్ వెల్లడించారు. దిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద విద్యార్థుల ఆందోళన ముగిసి చాలా రోజులవుతునప్పటికీ ఇప్పటి వరకూ వారిపై పోలీసుల దాడికి సంబంధించి అమిత్ షా నోటి నుంచి ఒక్క మాట కూడా పెగల్లేదని రాహుల్ విమర్శించారు. మరోవైపు విద్యార్థులకు క్షమాపణ చెప్పడానికి బదులు వారిని క్షమిస్తున్నానంటూ ప్రధాని మోదీ తీరిక లేకుండా ఉన్నారని ఆక్షేపించారు.




## తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

మొదటిపేజీ తరువాయి..

చేశారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాశారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల పంటలు సాగు కాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాల్లో ఉన్న అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి, సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందాలని, దానికోసం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుంచి మోటర్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎల్‌నినో వల్ల తక్కువ వర్షపాతం, మరోవైపు ప్రాజెక్టుల్లో నీళ్లు లేక రైతులు ఆందోళనలో ఉన్నారు. వానాకాలం పంట సాగుకు సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా లోయర్ మానేరు డ్యామ్ పూర్తి నీటి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 6.9 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందన్నారు.

మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరుకు నీటిని నింపి ఙాఖాఖ ఙండఇ-2లోని ఆయకట్టుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని లేఖలో కోరారు. గత యాసంగి పంటలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4 లక్షల ఎకరాలు సాగైన విషయం గుర్తించి, ఈ వానాకాలం పంటకు, అదేవిధంగా వచ్చే యాసంగి పంటకు కూడా సాగునీరు అందేలా కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు.



# అతలాకుతలం

మొదటిపేజీ తరువాయి..

భూకంపం భూమి లోపల 107 కిలో మీటర్ల లోతున సంభవించిందని అధికారులు తెలిపారు. ఈ భూకంపం ప్రభావం పొరుగున ఉన్న ఈక్వెడార్ దేశంలో కూడా కనిపించింది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 7.34 గంటల సమయంలో భూకంపం వచ్చిందని ఉటంకిస్తూ 'ది న్యూయార్క్ టైమ్స్' పేర్కొంది. భారత్‌కు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ కొలంబియా భూకంప తీవ్రతను 7.3 గా నమోదు చేసింది. భారత కాలమానం ప్రకారం ఆగస్ట్ 10న సాయంత్రం 6:04:25 గంటలకు భూకంపం నమోదైంది. పెరీరా నగరం ఈ భూకంపం ధాటికి అత్యంత ప్రభావితమైంది. ఈ ఒక్క ప్రాంతంలోనే ఎక్కువ మంది చనిపోయినట్లు అధికారులు తెలిపారు. పశ్చిమ కొలంబియాలోని పలు ప్రాంతాల్లో అనేక పెద్ద పెద్ద భవనాలు, ఇళ్లు కూలిపోవడంతో భారీ ఆస్తి నష్టం సంభవించింది. కాఫీ సాగుకు ప్రసిద్ధి చెందిన పర్వత ప్రాంతం మానిజాలెస్ నగరంలోనూ ప్రాణ నష్టం వాటిల్లింది. ఇక్కడ నియో- గోతిక్ కేథడ్రల్ చర్చి పైభాగం (టవర్) కూలి ప్రధాన ప్రార్థనా మందిరంపై పడింది. ఈ ఘటనలో ఇద్దరు చనిపోయినట్లు నగర మేయర్ జార్జ్ ఎడ్వార్డో తెలిపారు.



కొలంబియాలోని మూడో అతిపెద్ద నగరమైన కాలీలోనూ భూకంపం తీవ్ర ప్రభావం చూపించింది. నగరంలో కనీసం 19 కూలిపోయిన భవనాల్లో ప్రజలు చిక్కుకున్నట్లు కాలీ మేయర్ అలెజాండ్రో ఎడర్ తెలిపారు. కాలీకి చెందిన 64 ఏళ్ల ఒక టాక్సీ డ్రైవర్ జార్జ్ మోన్‌కాయో తన అనుభవాన్ని వివరించాడు. పలు ప్రాంతాల్లో భవనాలు కూలిపోవడంతో ఆకాశంలోకి భారీగా దుమ్ము ఎగసినట్లు చెప్పుకొచ్చాడు. 'నా ఇల్లు మొత్తం కంపించింది. ఇంత శక్తిమంతమైన భూకంపాన్ని నేనెప్పుడూ చూడలేదు.' అని వివరించాడు. చోకో గవర్నర్ నుబియా కార్డోబా సోషల్ మీడియాలో స్పందిస్తూ క్విబ్డో ప్రాంతంలోనూ భవనాలకు తీవ్ర నష్టం జరిగినట్లు తెలిపారు. ఇక పెరీరా, కాలీ, క్విబ్డో నగరాల్లో ఇళ్లు భవనాలు కూలిన దృశ్యాల్ని స్థానిక మీడియా ప్రసారం చేసింది. మళ్లీ ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు ఇళ్లలోకి వెళ్లకుండా బయటకు వచ్చి ఉండాలని పలు ప్రాంతాల్లో అధికారులు ముందస్తు హెచ్చరికలు చేస్తున్నారు. కూలిన భవనాలు, ఇళ్ల శిథిలాల కింద చాలా మంది చిక్కుకున్నట్లు భావిస్తుండగా, వీరిని వెలికి తీసేందుకు అధికారులు సహాయక చర్యల్ని వేగవంతం చేశారు. ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన కొలంబియా అధ్యక్షుడు అబెలార్డో డి లా ఎస్ప్రియెల్లా ఘటనపై వెంటనే స్పందించారు. సహాయక చర్యల్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. 'ప్రజలు ఒంటరిగా లేరు. ప్రభుత్వం మీతో ఉంది. చర్యలు వేగవంతం చేస్తోంది' అని పేర్కొన్నారు.

# మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

మొదటిపేజీ తరువాయి..

చేశాం. అది చివరి రోజు. చాలా సంతోషంగా గడపాల్సిన సందర్భం. అందుకోసం ఓ రెస్టరంట్‌కు వెళ్లాం. అయితే, మన మ్యాప్ సరిగా లేదని అనిపించింది. ఇదే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లా. మార్పులు చేస్తామని చెప్పారు. సంబరాలు చేసుకుంటున్న సమయంలో మీరు మ్యాప్ ప్రాముఖ్యతను గుర్తించడం నిజంగా అభినందనీయం అని మోదీ అన్నారు.. ఆ వీడియో సాధారణమైంది కాదు. దేశ ప్రజలు సుదీర్ఘకాలం గుర్తుంచుకుంటారన్నారు. అసలేం జరిగిందంటే...గ్లాస్గోలోని ఓ రెస్టరెంట్‌కు లవ్లీనా తోపాటు కొందరు భారత అథ్లెట్లు డిన్నర్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న హ్యాండ్ టవల్స్ పై భారత్ మ్యాప్ అసంపూర్తిగా ఉండటం లవ్లీనా గమనించింది. ఈశాన్య రాష్ట్రాలతోపాటు కశ్మీర్ పూర్తి భూభాగాలను ఆ చిత్రపటంలో చూపించకపోవడంతో సోషల్ మీడియా వేదికగా లవ్లీనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత రెస్టరంట్ క్షమాపణలు చెబుతూ ఓ ప్రకటనను జారీ చేసింది. అయితే, ఇది కావాలనే చేసిందని.. పొరపాటు కాదని అభిమానులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మరో బాక్సర్ నరేంద్ర బేర్వాల్ గతంలో తనకు పాక్ బాక్సర్‌తో ఎదురైన అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. 'పాకిస్థాన్ గురించి ఏ మాట్లాడినా నాకొక స్టోరీ గుర్తుకొస్తుంది సర్. అది 2015 మిలిటరీ గేమ్స్. నా ఫస్ట్ ఫైట్ పాకిస్థాన్ బాక్సర్‌తోనే. అప్పుడు ఉన్నతాధికారులు, సహచరులు ఒకటే చెప్పేవారు. పాక్ బాక్సర్ చేతిలో మాత్రం ఓడిపోవద్దని అనేవారు. ఆ మ్యాచ్‌లో వరుసగా రెండు రౌండ్లలో నేనే గెలిచా. మీరు 2014లో ప్రధానిగా వచ్చారు. మా ఆర్మీ కోచ్ పేరు కూడా నరేందర్ రాణా. దానిని ఉద్దేశిస్తూ సదరు పాక్ బాక్సర్ 'బ్రదర్ నీతో ఓ విషయం చెప్పాలను కుంటున్నా' అని అన్నాడు. సరే చెప్పు అని బదులిచ్చా. 'నీ పేరు నరేందర్. మీ కోచ్ పేరు నరేందర్. మీ ప్రధాని నరేంద్ర. నాకు ఇప్పట్నుంచి ఈ పేరు అంటేనే ఇష్టం ఉండదు ఇక' అని అన్నాడు' అని బాక్సర్ చెప్పాడు. ఆ మాటలకు ప్రధాని మోదీ గట్టిగా నవ్వేశారు.



# సాగర్ వేదికగా 'మహా వరుణ యాగం'

మొదటిపేజీ తరువాయి..

సమర్పించారు. కృష్ణా, గోదావరి నదులు జలకళను సంతరించుకోవాలని, రాష్ట్రంలోని చెరువులు , రిజర్వాయర్లు నిండి పంటలు సమృద్ధిగా పండాలని సీఎం దంపతులు వరుణ దేవుడిని ప్రార్థించారు. ఈ క్రతువులో పలువురు ప్రజాప్రతినిధులు , అధికారులు పాల్గొనగా, శాస్త్రోక్తంగా నిర్వహించిన మహాపూర్ణాహుతితో ఈ వరుణ యాగం ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి రాష్ట్రం పాడిపంటలతో విలసిల్లాలని కాంక్షిస్తూ.. ప్రభుత్వం వరుణయాగం నిర్వహిస్తోంది. సోమవారం తెల్లవారుజామున ఆదిపూజ నిర్వహించి యాగ క్రతువును ప్రారంభించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దంపతులు ఈ యాగంలో పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మాజీమంత్రి జానారెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు యాగ క్రతువులో పాల్గొన్నారు.



# ఉత్తరాఖండ్‌లో భారీ వర్ష బీభత్సం

## చమోలీలో కొట్టుకు పోయిన వంతెన

డెహ్రాడూన్,ఆగస్ట్10(ప్రజాజ్యోతి): ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చమోలీ జిల్లాలోని నీతి వ్యాలీ ప్రాంతాన్ని సోమవారం వరదనీరు ముంచెత్తింది. వరద ధాటికి ఓ వంతెన క్షణాల్లో కొట్టుకుపోగా.. పలువురు ప్రాణాలతో బయటపడ్డారు. దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. భారీ వర్షాల కారణంగా నీతి వ్యాలీ ప్రాంతంలో ఉన్న నదిలో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగింది. లోతట్టు ప్రాంతాల వైపు ఆ వరదనీరు దూసుకొచ్చింది. నీటితో పాటు మట్టి, బురద, పెద్దపెద్ద బండరాళు కొట్టుకువచ్చాయి. ఈ క్రమంలో వరద ప్రవాహం బలంగా ఢీకొట్టడంతో ఓ ఇనుప వంతెన కొట్టుకుపోయింది. వంతెనకు ఓ వైపున ఉన్న పలు వాహనాలు కొట్టుకుపోగా.. మరోవైపు ఉన్న ఓ ట్రక్కు, ఎస్‌యూవీ వాహనాదారులు అప్రమత్తమై ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ ప్రకృతి వైపరిత్యాన్ని అక్కడే ఉన్న కొంత మంది వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా నిమిషాల వ్యవధిలోనే వైరల్‌గా మారాయి. కాగా, వంతెన కొట్టుకుపోవడంతో నీతి వ్యాలీ ప్రాంతానికి ప్రధాన పట్టణంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఉత్తరాఖండ్‌లో ఆదివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని రాష్ట్ర విపత్తు నిర్వహణ, పునరావాస శాఖ కార్యదర్శి వినోద్ కుమార్ సుమన్ తెలిపారు. డెహ్రాడూన్, బాగేశ్వర్, నైనిటాల్, చంపావత్ జిల్లాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలతో రహదారులు దెబ్బతినడం, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని పేర్కొన్నారు. అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.



## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకోవాలి

– సీపీఐఎం ఆధ్వర్యంలో రాస్తారోకో



**జన్నారం, ఆగస్ట్ 10 (ప్రజాజ్యోతి) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని నిరసిస్తూ 'జైల్ భరో' కార్యక్రమంలో భాగంగా సోమవారం సీపీఐఎం ఆధ్వర్యంలో జన్నారం బస్టాండ్ ఆవరణలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల నాయకుడు కొండ గుర్ల లింగన్న మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని యధాతథంగా కొనసాగించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లు 2025ను అమలు చేయవద్దని, విద్యుత్ రంగాన్ని ప్రైవేటు చేయవద్దని, మధ్యాహ్న భోజన పథకం ప్రైవేటు వారి చేతిలో పెట్టవద్దని, మహిళా కార్మికుల రక్షణకు వారి హక్కులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో చేస్తున్న విషయం తెలుసుకున్న ఎస్ఐ ఉదయ్ కిరణ్ అక్కడికి చేరుకొని రాస్తారోకో చేస్తున్న కార్యకర్తలను, కార్మికులను అరెస్టు చేసి స్టేషన్ తీసుకెళ్లి సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కామ్రేడ్ అంబటి లక్ష్మణ్, దాసండ్ల రాజన్న, సీనియర్ సిఐటియు నాయకులు కూకటికారు బుచ్చయ్య, మధ్యాహ్న భోజన పథకం సంఘం నాయకులు సేపూరి లక్ష్మి, మంజుల, రాజేశ్వరి, రైతు సంఘం నాయకులు దుర్గం దుర్గ ప్రసాద్, కోరుట్ల శంకరయ్య, అన్నారపు తిరుపతి, ఒడిపల్లి చంద్రయ్య, ఐద్వా మండల నాయకులు పోతు విజయ, ఒడిపల్లి ప్రమీల, ఆదివాసి సంఘం మండల నాయకులు ఆత్రం రాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో సాగాలి.. పార్టీని బలోపేతం చేయాలి

కాంగ్రెస్ నూతన కమిటీకి ముండే దీపక్ సన్మానం.. శుభాకాంక్షలు



**ఆసిఫాబాద్, ఆగస్టు 10 ప్రజాజ్యోతి :** కాంగ్రెస్ పార్టీ నూతన మండల కమిటీ సభ్యులు నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్, ఉపసర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముండే దీపక్ సూచించారు. ఇటీవల నూతనంగా నియమితులైన వాంకిడి మండల కాంగ్రెస్ కమిటీ సభ్యులను ఆయన ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ముండే దీపక్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని అన్నారు. గ్రామస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సెండే హనుమంతు, టౌన్ అధ్యక్షుడు కాంలేష్ (బంటి), ఉపాధ్యక్షులు సెల్వత్కర్ పేంటు, సామెల రమేష్, కోడప మారుతి, జనరల్ సెక్రటరీ కొట్రేంగే మెంగజీ, ఉప్రే ధర్ము, సీనియర్ నాయకులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ దాదాజీ, గుండయ్య, బొట్టుపెల్లి జైరాం, జాడి సోమా, దోదిగూడ ఉపసర్పంచ్ దుర్గం భీంరావుతో పాటు నూతన మండల కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బొగ్గు పెన్షనర్లకు సంబంధించిన వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

– ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ ఫెడరేషన్ ప్రతినిధి బృందం

– కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతి



**మంచిర్యాల, 10, ఆగస్టు (ప్రజాజ్యోతి) :** బొగ్గు పెన్షనర్లకు సంబంధించిన వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ ఫెడరేషన్ ప్రతినిధి బృందం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు . ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు పులి రాజా రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ రాజమ్ బల్లేవార్, కార్యాధ్యక్షుడు ఆర్.ఎస్. సింగ్ నేతృత్వంలో ప్రతినిధి బృందం కేంద్ర మంత్రిని కలిసి, ఫెడరేషన్ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించిన పలు తీర్మానాల ప్రతులను ఆయనకు అందజేశారు . ఈ సందర్భంగా బొగ్గు పెన్షనర్లు ఎదుర్కొంటున్న పలు తీవ్రమైన సమస్యలను ప్రతినిధి బృందం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు . ముఖ్యంగా పెన్షన్ల చెల్లింపులో జరుగుతున్న జాప్యం వల్ల వేలాది మంది పదవీ విరమణ పొందిన బొగ్గు కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రతి నెలా పెన్షన్ నిర్ణీత సమయానికి పెన్షనర్ల ఖాతాల్లో జమ అయ్యేలా ప్రస్తుత పెన్షన్ చెల్లింపు వ్యవస్థను మెరుగుపరచాలని కేంద్ర మంత్రి ని కోరారు . అదేవిధంగా ఫెడరేషన్ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించిన ఇతర ముఖ్యమైన తీర్మానాలు, బొగ్గు పెన్షనర్లకు సంబంధించిన దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని, సంబంధిత శాఖలు మరియు అధికారులతో సమన్వయం చేసి చర్యలు చేపట్టాలని ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. బొగ్గు పరిశ్రమకు తమ జీవితాలను అంకితం చేసి పదవీ విరమణ పొందిన కార్మికులు వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కోసం పెన్షన్‌పై ఆధారపడుతున్నారని, అలాంటి సమయంలో పెన్షన్ చెల్లింపుల్లో జాప్యం జరగడం వల్ల వారి జీవనం ఇబ్బందికరంగా మారుతోందని ఫెడరేషన్ నాయకులు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పెన్షనర్ల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. ఫెడరేషన్ ప్రతినిధులు వివరించిన సమస్యలు, డిమాండ్లను కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి సీరియస్‌గా విని, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఫెడరేషన్ నాయకులు తెలిపారు. బొగ్గు పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ ఫెడరేషన్ (భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు పులి రాజా రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ రాజమ్ బల్లేవార్, కార్యాధ్యక్షుడు ఆర్.ఎస్. సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో శతాయుష్షు..!





- రిటైర్డ్ కార్మికులకు ఆరోగ్యమే అసలైన సంపద
- సింగరేణి జీఎం ఎన్. రాధాకృష్ణ
- మూడు నెలల యోగా శిక్షణతోలిరిటైర్డ్ కార్మికుల్లో చక్కటి మార్పు
- యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి

**మందమర్రి టౌన్ ఆగస్టు 10 ప్రజా జ్యోతి :** యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా, ఆనందంగా జీవించవచ్చని మందమరి సింగరేణి జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అన్నారు. సీనియర్ సిటిజన్స్ (రిటైర్డ్ కార్మికులు)కు మూడు నెలలపాటు నిర్వహించిన యోగా శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ.. మూడు నెలల యోగా శిక్షణలో పాల్గొన్న రిటైర్డ్ కార్మికులు చక్కటి ప్రదర్శన ఇచ్చారని, వారిలో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయని తెలిపారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. నిత్యం యోగా సాధన చేస్తే దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించడంతో పాటు వృద్ధాప్యంలో ఇతరులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. యోగా ద్వారా పొందిన జ్ఞానం తమకే పరిమితం కాకుండా తోటి వారికి కూడా అందించాలని కోరారు. మందమరి ప్రాంతంలో తన దృష్టికి వచ్చిన అవసరమైన చోట గేట్లు, ఇతర సదుపాయాలను ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో కూడా సాధ్యమైనంత మేరకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. యోగా గురువు ఎం. శంకర్, యోగా మాస్టర్లు కొంపల్లి రమేష్, బర్ల సదానందం మాట్లాడుతూ.. మన ఋషులు ప్రపంచానికి అందించిన అపారమైన యోగా విజ్ఞానం సమాజానికి ఎంతో మేలు చేస్తోందన్నారు. వయసుతో సంబంధం లేకుండా యువత, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు సైతం నిపుణుల సూచనలతో యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ కార్మిక సంఘం అధ్యక్షుడు వాసాల శంకర్, టీబీజీకేఎస్ నాయకులు ఓ. రాజశేఖర్, సూర్య నమస్కారాల రికార్డు హోల్డర్ మద్ది శంకర్, గవర్నర్ అవార్డు గ్రహీత వెంకటేష్, ఆయుష్ యోగా టీచర్ శైలజ, సాంబమూర్తి, సీనియర్ యోగా సభ్యులు, మహిళా యోగా సభ్యులు, సీనియర్ సిటిజన్ యోగా సాధకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల వేతనాలను కూడా పెంచాలి





– కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో క్విట్ ఇండియా స్ఫూర్తితో కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై రాస్తారోకో

**మంచిర్యాల, 10, ఆగస్టు (ప్రజాజ్యోతి) :** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జి సమీపంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏ. ఏలాల్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు టి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల వేతనాలను కూడా పెంచాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా దేశ ప్రజలు ఏకమై పోరాడిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, ప్రజలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మికుల హక్కులను హరించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలను రూపొందించడం దుర్మార్గమన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయ ఉత్పత్తులకు సరైన మార్కెట్, రుణ విముక్తి వంటి సమస్యలను పరిష్కరించకుండా కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను కొనసాగిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, ప్రజా ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం, నిత్యావసర వస్తువుల ధరలను పెంచడం ద్వారా సామాన్య ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారని అన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, పాత 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని, రైతులకు పంటలకు గిట్టుబాటు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని వారు డిమాండ్ చేశారు. దేశ సంపదను సృష్టిస్తున్న కార్మికులు, దేశానికి అన్నం పెడుతున్న రైతులు, కష్టజీవి ప్రజల ప్రయోజనాలను పక్కన పెట్టి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న పాలకుల విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా "కార్పొరేట్లను కాపాడే విధానాలు క్విట్ ఇండియా.. ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు క్విట్ ఇండియా" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎం.డి. అక్బర్ అలీ, జిల్లా గౌరవ అధ్యక్షులు ఖలీందర్ అలీ ఖాన్, మిట్టపల్లి పౌలు, బోయపోతుల కొమురయ్య, మండల శ్రీనివాస్, రామన్న, దేవి పోచన్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గోమాస ప్రకాష్, పద్మావతి, రఫియా, శ్రీనివాస్, రజక సంఘం జిల్లా కార్యదర్శి పైరాల రాములు, రైస్ మిల్ హమాలీ యూనియన్ అధ్యక్షులు సురేందర్, రమేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. బ్రహ్మానందం, పీఓడబ్ల్యూకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దొండ ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి, ఐఎఫ్‌టీయూ నాయకులు తిరుపతిరెడ్డి, జాఫర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మన్న, ఏఐకేకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగర్ల శంకర్, జిల్లా నాయకులు గంగయ్య, రాకేష్‌తో పాటు పలువురు కార్మికులు, రైతులు పాల్గొన్నారు.

# పుంజాల శివశంకర్ సేవలు చిరస్మరణీయం





– బీసీలకు రిజర్వేషన్లు సాధించిన సామాజిక విప్లవకారుడు

– మున్నూరు కాపు సంఘం నాయకులు

– మంచిర్యాల లో ఘనంగా స్వర్గీయ పుంజాల శివశంకర్ 97వ జయంతి

**మంచిర్యాల, 10, ఆగస్టు (ప్రజా జ్యోతి) :** మున్నూరు కాపుల ముద్దుబిడ్డ, కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా, న్యాయవాదిగా, న్యాయమూర్తిగా వివిధ హోదాల్లో సేవలందిస్తూ బీసీలు, ఇతర వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి స్వర్గీయ పుంజాల శివశంకర్ విశేషంగా కృషి చేశారని మున్నూరు కాపు సంఘం నాయకులు కొనియాడారు . స్వర్గీయ పుంజాల శివశంకర్ 97వ జయంతిని సోమవారం మంచిర్యాల లో ఘనంగా నిర్వహించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ మున్నూరు కాపు సంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తంరావు పటేల్ ఆదేశాల మేరకు జిల్లా ఇన్‌చార్జి గాదె సత్యం, జిల్లా అధ్యక్షులు పెద్దపల్లి కిషన్‌రావు ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుంజాల శివశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబిలపు శ్రీనివాస్, గజ్జి రామయ్య, కార్యవర్గ సభ్యులు, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాదె సత్యం, పెద్దపల్లి కిషన్‌రావు లు మాట్లాడుతూ, మున్నూరు కాపుల ఆణిముత్యంగా నిలిచిన పుంజాల శివశంకర్ బీసీలకు రిజర్వేషన్లు సాధించేందుకు కృషి చేసిన సామాజిక విప్లవకారుడని కొనియాడారు. బీసీలు, ఇతర వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ తరానికి ఆయన ఆదర్శవంతుడిగా, మార్గదర్శకుడిగా నిలిచారని పేర్కొన్నారు. బీసీ వర్గాలు ఆయన సేవలను ఎప్పటికీ మరువబోవని తెలిపారు. అదేవిధంగా కోకాపేటలోని మున్నూరు కాపు ఆత్మగౌరవ భవన ప్రాంగణంలో నిర్వహించిన పుంజాల శివశంకర్ 97వ జయంతి సభలో మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తంరావు పటేల్ మాట్లాడుతూ దేశ అత్యున్నత రాజకీయాల్లో కీలక భూమిక పోషించిన స్వర్గీయ పుంజాల శివశంకర్ బీసీలకు రిజర్వేషన్లు సాధించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. బీసీలు, వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవం కోసం ఆయన నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. బీసీలకు, వెనుకబడిన వర్గాలకు అన్యాయం జరుగుతున్నప్పటికీ ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పుంజాల శివశంకర్ సేవలకు తగిన గుర్తింపుగా ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు నల్సార్ విశ్వవిద్యాలయానికి పుంజాల శివశంకర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వాల తీరుపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. సీనియర్ జర్నలిస్ట్, ట్రస్ట్ బోర్డు సభ్యులు రమేష్ హజారి మాట్లాడుతూ ఏది సాధించాలన్నా ఐకమత్యమే బలమని అన్నారు. మున్నూరు కాపులు ఏకతాటిపైకి వచ్చి తమ హక్కులు, ఆత్మగౌరవం కోసం కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు, అధికార ప్రతినిధి మంగళారపు లక్ష్మణ్ మాట్లాడుతూ పుంజాల శివశంకర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం శివశంకర్ ఎన్నో త్యాగాలు చేశారని తెలిపారు. ప్రతి బిడ్డ ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఎప్పుడూ ఆకాంక్షించేవారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య పటేల్, ట్రస్ట్ బోర్డు సభ్యులు పన్నాల విష్ణువర్ధన్ పటేల్, గోపాల గణేష్ పటేల్, ఆవుల రామారావు పటేల్, ఇందూరి తిరుపతి పటేల్, చేవెళ్ల ప్రసాద్ పటేల్, ఆత్మగౌరవ సేన అధ్యక్షులు ఉగ్గే శ్రీనివాస్ పటేల్, కంటే సాయన్న పటేల్, స్వామి వివేక్ పటేల్, మాలి కరుణాకర్ పటేల్, మీరంపల్లి ప్రభాకర్ పటేల్, మీరంపల్లి సత్యం పటేల్, అనంతుల నవీన్ పటేల్, అరె క్రాంతి పటేల్, తోట రాజు పటేల్, చక్రం నాగరాజు పటేల్, అనికేత్ పటేల్, ప్రవీణ్ పటేల్, గోపాల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లా సర్పంచ్‌ల సంఘం గౌరవ అధ్యక్షులకు ఉపాధ్యక్షులకు ఘన సన్మానం



**కుంటాల ఆగస్టు10 (ప్రజాజ్యోతి) :** నిర్మల్ జిల్లా సర్పంచ్‌ల సంఘం గౌరవ అధ్యక్షులుగా నియమితులైన కుంటాల సర్పంచ్ జక్కుల గజేందర్, మరియు కల్లూర్ సర్పంచ్ పెంటవార్ దశరథ్ జిల్లా సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా కుంటాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నాలం శ్రీనివాస్ వరిని ఘనంఘ,సన్మానించారు. అనంతరం అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు అంబకంటి సర్పంచ్ రాణి ప్రవీణ్, సబ్బిడి రాకేష్, ఎగ్గం సాయిబాబా, బిడుదూల, గజేందర్, ఒడ్నాం అనిల్, నాలం సాయన్న,నిమ్మల మహేష్, తదితరులు ఉన్నారు.

## 13న జరిగే బిజెపి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ విజయవంతం చేయాలి



**ఖానాపూర్ ఆగస్టు 10(ప్రజా జ్యోతి) :** దేశభక్తి జాతీయ సమైక్యతను చాటిచెప్పే త్రివర్ణ పతాక ర్యాలీ ఈనెల 13న జరగనుందని ఖానాపూర్ పట్టణ బిజెపి అధ్యక్షులు కీర్తి మనోజ్ తెలిపారు. హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఈనెల 13న ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా తెలంగాణ చౌక్ వరక నిర్వహించనున్నామన్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో సోమవారం త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించారు. ఈ ర్యాలీలో పార్టీలకు అతీతంగా ప్రజలు, యువత, వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, దేశభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి, "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్ కుమార్ అన్నారు ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్ జిల్లా కార్యదర్శి మాదిరే శ్రీను జిల్లా కౌన్సిల్ సభ్యులు పడిగేల అశోక్ కౌన్సిలర్ లు బొప్పరపు సత్యవతి గుమ్మల అశోక్ నాయకులు బండిపెల్లి ప్రకాష్ గౌడ్ ప్రధానకార్యదర్శి కొండవేని రమేష్ పట్టణ ఉపాధ్యక్షులు దానిపెల్లి సుధాకర్, సీనియర్ నాయకులు, ఏనుగందుల రవి,బత్తుల నారాయణ గోడ పురం సందీప్,మెకానిక్ నవీన్, కొండజి ప్రశాంత్,సురేష్,శంకర్ తదితరులు పాల్గొన్నారు

## బీసీ సంఘం ఆధ్వర్యంలో మాజీ కేంద్రమంత్రి శివశంకర్ జయంతి వేడుకలు



**జన్నారం, ఆగస్ట్ 10 (ప్రజాజ్యోతి) :** జన్నారం మండల బీసీ సంఘం ఆధ్వర్యంలో మున్నూరు కాపు ముద్దుబిడ్డ మాజీ కేంద్రమంత్రి, మాజీ గవర్నర్ పుంజాల శివశంకర్ 97వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం కరీంనగర్ జోన్ కన్వీనర్ కాసెట్టి లక్ష్మణ్ మాట్లాడుతూ మాజీ కేంద్రమంత్రి శివశంకర్ ఆశయాలు నెరవేరాలంటే గ్రామీణ స్థాయిలో బీసీ ఉద్యమాన్ని విస్తరింపజేయాలని కోరారు. వెనుకబడిన వర్గాలు, షెడ్యూల్డు కులాల అభ్యున్నతికి వారు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య, కొంతం శంకరయ్య, కడార్ల నరసయ్య ,మూల భాస్కర్ గౌడ్, ఆడేపు లక్ష్మీనారాయణ, గోపి సత్యనారాయణ, పిల్లి మల్లయ్య, గూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ట్రేడ్ యూనియన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా వాస్తవ గమ్యం' ఎడిటర్ కొమ్ము రాజేష్



**మంచిర్యాల ప్రతినిధి. ఆగస్టు 10 ప్రజాజ్యోతి :** జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ట్రేడ్ యూనియన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్‌గా 'వాస్తవ గమ్యం' ఎడిటర్ కొమ్ము రాజేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ సంక్షేమ సంఘం నాయకులు, ప్రతినిధులు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. జర్నలిజం రంగంలో తనదైన ముద్ర వేస్తూనే, జర్నలిస్టులా సంక్షేమం కోసం ముందుకు రావడం అభినందనీయమని జర్నలిస్ట్ సంక్షేమ సంఘం నాయకులు కొనియాడారు. కొమ్ము రాజేష్ నాయకత్వంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా (జె,స్,స్) ట్రేడ్ యూనియన్ మరింత బలోపేతం కావాలని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో యూనియన్ నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కొమ్ము రాజేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహ కారంతో యూనియన్ విస్తరణకు, జర్నలిస్టులు కార్మికుల హక్కుల సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం

సివరేజ్ ప్రాజెక్టులకు రూ.29 కోట్లు

వనపర్తికి రూ.20 కోట్లు.. పెబ్బేరుకు రూ.9.20 కోట్లు

మేఘారెడ్డి విజ్ఞప్తికి సీఎం రేవంత్‌రెడ్డి సానుకూల స్పందన

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 10 (ప్రజాజ్యోతి): వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీల్లో మురుగునీటి నిర్వహణ వ్యవస్థను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం రూ.29.20 కోట్లను మంజూరు చేసింది. ఇందులో వనపర్తి మున్సిపాలి



టీకి రూ.20 కోట్లు, పెబ్బేరుకు రూ.9.20 కోట్లు కేటాయించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేసిన విజ్ఞప్తికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి ఈ ప్రాజెక్టులకు ఆమోదం కల్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

త్వరలో టెండర్లు: స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 కింద హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో ఎల్ఎస్ కాంట్రాక్ట్ సిస్టమ్ ద్వారా పనులు చేపట్టనున్నారు. త్వరలో టెండర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ఇళ్లు, వాణిజ్య సముదాయాల నుంచి వెలువడే మురుగునీటిని శాస్త్రీయంగా సేకరించి, సివరేజ్ వ్యవస్థ ద్వారా తరలించి, శుద్ధి చేసి సురక్షితంగా నిర్వహించే సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో పట్టణ పారిశుధ్యం మెరుగుపడటంతో పాటు ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు మేలు చేకూరుతుందని తెలిపారు. వనపర్తి పట్టణంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు పట్టణాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రాజెక్టులకు ఆమోదం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహ, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలి

మల్దకల్ ఆగస్టు 10(ప్రజా జ్యోతి): సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆదిశిలా క్షేత్రం మల్దకల్‌లోని శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సప్తాహ భజన కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం మూడో రోజు సంకాపురం,బిజ్వారం,పార్చర్ల,ఆరగిద్ద,శంకర్‌నగర్,ఈదుల,



గార్లపాడు గ్రామాలకు చెందిన భజన భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆలయ వ్యవస్థాపక వంశీయులు శ్రీ కృష్ణమాన్య పట్వారి ప్రహ్లాదరావు,ఈవో సత్యచంద్రారెడ్డి, పూజారుల ఆధ్వర్యంలో సప్తాహ భజన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.వరుణదేవుని కరుణ ప్రతి ఒక్కరిపై ఉండాలని,శ్రీ తిమ్మప్ప స్వామివారి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.అనంతరం ఆలయ అన్నదాన సత్రంలో భజన భక్తులకు ఐజ పట్టణానికి చెందిన బొజ్జయ్య శెట్టి అన్నదానం చేశారు.ప్రతి సంవత్సరం ఆషాఢ మాసం చివర్లో ప్రారంభమయ్యే ఈ సప్తాహ భజన కార్యక్రమం శ్రావణ మాసం మొదటి వారంలో ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌రావు, రామసుబ్బారెడ్డి,కొంకల ప్రసాదాచారి,వెంకోబ్రావు,సోమన్న,బూడిదపాడు తిమ్మప్పతో పాటు భజన మండలి సభ్యులు,వాల్మీకి పూజారులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ మియాకు నిరంజన్‌రెడ్డి పరామర్శ

– వైద్య సేవలు తీసుకోవాలని సూచన.. ధైర్యం చెప్పిన మాజీ మంత్రి

వనపర్తి, ఆగస్టు 10 (ప్రజాజ్యోతి): కల్వరాల గ్రామానికి చెందిన సర్దార్ మియా ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సోమవారం పెబ్బేరు పట్టణంలోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి



తెలుసుకుని, మెరుగైన వైద్య సేవలు పొందాలని సూచించారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ కర్రెస్వామి, విశ్వరూపం, రాజశేఖర్, సాయినాథ్, ఎల్లారెడ్డి, వడ్డె రమేష్, సాయిరెడ్డి, సంబురాము, వేణు, మూర్తి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతుల్లేకుండా ఇసుక తరలింపు

చిలకటోనిపల్లి వాగులో పట్టుబడ్డ ఐదు ట్రాక్టర్లు.. కేసులు నమోదు

వనపర్తి, ఆగస్టు 10 (ప్రజాజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పెద్దమందడి పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి చిలకటోనిపల్లి గ్రామ శివారులోని వాగు నుంచి కనిమెట్ట గ్రామానికి చెందిన ఐదుగురు ట్రాక్టర్ డ్రైవర్లు ఇసుకను తరలిస్తుండగా పోలీసులు గుర్తించి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి. జలంధర్‌రెడ్డి తెలిపారు.



# 'శతశాతం'తో విద్యలో విప్లవం

వంద ప్రభుత్వ పాఠశాలలకు విస్తరణ.. 16 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఆగస్టు 10 ( ప్రజా జ్యోతి బ్యూరో ): గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచి, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా చేపట్టిన 'శతశాతం' కార్యక్రమాన్ని ఈ ఏడాది 100 ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తున్నట్లు ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో వందేమాతరం ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన మూడు రోజుల ప్రత్యేక శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచి సంకల్పంతో ప్రారంభించిన 'శతశాతం' కార్యక్రమం జిల్లా, రాష్ట్ర స్థాయిని దాటి ఖండాంతర స్థాయిలో గుర్తింపు పొందడం, అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆట) కమ్యూనిటీ సర్వీస్ అవార్డు అందుకోవడం గర్వకారణమన్నారు. ఇది ఏ ఒక్కరి విజయమూ కాదని, సమిష్టి కృషికి దక్కిన గుర్తింపు అని పేర్కొన్నారు.

100 మంది వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, ఎలాంటి లాభాపేక్ష లేకుండా చేపట్టిన ఈ కార్యక్రమానికి సమాజంలోని అనేక మంది స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. తన సొంత నిధులతో, విద్యాశాఖ సహకారంతో ఎంపిక చేసిన 100 మంది విద్యా వాలంటీర్లకు మూడు రోజులపాటు సమగ్ర శిక్షణ అందించినట్లు తెలిపారు. వాలంటీర్ల బాధ్యతలు, విద్యా వ్యవస్థతో సమన్వయం, విద్యార్థులు–ఉపాధ్యాయులకు అవసరమైన సహకారం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. సబ్జెక్ట్ నిపుణులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను రిసోర్స్‌పర్సన్లుగా నియమించడంతో పాటు సైకాలజిస్టుల సహకారంతో విద్యార్థుల మనోభావాలను అర్థం చేసుకునే విధంగా శిక్షణ అందించినట్లు వివరించారు. శిక్షణ పూర్తిచేసుకున్న వాలంటీర్లు తమకు కేటాయించిన పాఠశాలల్లో 'శతశాతం' కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు.



30 పాఠశాలల్లో సత్ఫలితాలు: గత ఏడాది 30 ప్రభుత్వ పాఠశాలల్లో 'శతశాతం' కార్యక్రమాన్ని అమలు చేసి అద్భుత ఫలితాలు సాధించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఉత్తీర్ణతపై సందేహం ఉన్న విద్యార్థులు సైతం ఫస్ట్‌క్లాస్ మార్కులు సాధించడం, పలువురు 500కు పైగా మార్కులు సాధించడం, 16 మండలాల్లో 16 మంది టాపర్లు నిలవడం కార్యక్రమం విజయానికి నిదర్శనమన్నారు. గత ఏడాది ఫలితాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి కార్యక్రమాన్ని 100 పాఠశాలలకు విస్తరించామని, తద్వారా దాదాపు 16 వేల మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారని వెల్లడించారు.

ఉపాధ్యాయుల కొరతను అధిగమించడంలో వాలంటీర్ల పాత్ర : కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్న నేపథ్యంలో విద్యా వాలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ఏడాది అనుభవం దీనిని నిరూపించిందన్నారు. వందేమాతరం ఫౌండేషన్, విద్యాశాఖ అధికారులు, డీఈఓ, ఇతర అధికారులు, ముఖ్యంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కార్యక్రమానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అందరూ ఒక టీమ్‌గా పనిచేస్తున్నామని, లాభాపేక్ష లేకుండా పిల్లల భవిష్యత్తు కోసం చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమవుతుందనే నమ్మకం ఉందన్నారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

'విద్యా యజ్ఞ రూపశిల్పి యెన్నం': వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్ మాట్లాడుతూ.. రేపటి తరాన్ని తీర్చిదిద్దేందుకు నిరంతరం పరితపిస్తున్న నాయకుడిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని అభివర్ణించారు. తల్లిదండ్రుల బాధ్యతను తన భుజాలపై వేసుకుని విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే 'విద్యా యజ్ఞ రూపశిల్పి' అని కొనియాడారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గ విద్యా వ్యవస్థను మెరుగుపరిచే బాధ్యతను



ఎమ్మెల్యే తన భుజస్కంధాలపై వేసుకున్నారని, ఆయనతో కలిసి 'శతశాతం' కార్యక్రమంలో భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానని రవీందర్ తెలిపారు.

అనంతరం మూడు రోజుల శిక్షణ తరగతులను నిర్వహించిన రిసోర్స్‌పర్సన్లను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ సమన్వయకర్త రవీందర్‌రెడ్డి, పీఆర్టీయూ అధ్యక్షులు మదన్‌మోహన్ యాదవ్, నాయకులు సుధాకర్‌రెడ్డి, బుచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నల్లకుంట శివాలయ ప్రారంభోత్సవానికి ఆహ్వాన పత్రికలు,బ్రోచర్ల ఆవిష్కరణ

గద్వాల, ఆగస్టు 10(ప్రజా జ్యోతి ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని గద్వాల పట్టణం నల్లకుంటలో శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవాలయ నిర్మాణం పూర్తయింది.ఈ సందర్భంగా ఆలయ ప్రారంభోత్సవంతో పాటు శివపార్వతులు, వినాయకుడు,కుమారస్వామి,నవగ్రహాలు,ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ నెల 19వ,తేదీ నుంచి 23వ,తేదీ వరకు ఐదు రోజుల పాటు ప్రతిష్ఠా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లు,ఆహ్వాన పత్రికలను పూజారి శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నల్లకుంట శివాలయ కమిటీ అధ్యక్షులు,కౌన్సిలర్



పులిపాటి వెంకటేష్ మాట్లాడుతూ,నల్లకుంట శివాలయ పునర్నిర్మాణ పనులు రాతి కట్టడంతో పునాది స్థాయి నుంచి ప్రారంభమై ఈ ఏడాదికి ఐదేళ్లు పూర్తవుతున్నాయని తెలిపారు.భక్తులు,దాతలు అందించిన ఆర్థిక సహకారంతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు.ఆలయ నిర్మాణానికి నల్లకుంట శివాలయ కమిటీ సభ్యులతో పాటు ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా ఎంతో సహకరించాయని ఆయన పేర్కొన్నారు.ఆలయ నిర్మాణానికి పునాది వేసినప్పటి నుంచి ఇప్పటివరకు నిర్మాణ పురోగతిని ప్రజలకు తెలియజేస్తూ మీడియా తన వంతు సహకారం అందించిందని తెలిపారు.ఆలయ నిర్మాణానికి ఆర్థిక,ఇతర సహాయ సహకారాలు అందించిన దాతలు,భక్తులు,మీడియా ప్రతినిధులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.ఈ నెల 19 నుంచి 23వ,తేదీ వరకు జరగనున్న ప్రతిష్ఠా పూజా కార్యక్రమాలు,ఆలయ ప్రారంభోత్సవానికి దాతలు,భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఐదు రోజుల కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ కోరింది.భక్తులందరూ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు గుమ్మడం గోపాల్,వెంకట్రావు (టీచర్),పరమాల రామ్‌రెడ్డి,నల్లారెడ్డి,అర్జున్‌రావు,కోశాధికారి శేషలూరు నాగరాజ్‌శెట్టి, కార్యదర్శులు కురువ భాస్కర్,బంగారు సురేష్,రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## హిందూ యువ సమ్మేళనంను విజయవంతం చేయండి

మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 10 (ప్రజా జ్యోతి): రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించనున్న "హిందూ యువ సమ్మేళనం" నిర్వహించడం జరుగుతుందని, ఈ సమ్మేళనంలో సమాజానికి సేవ చేయాలనే స్ఫూర్తి,దేశభక్తి భావన,యువత బాధ్యతల పై




ముఖ్య వక్త శ్రీ రాక సుధాకర్ ప్రసంగం ఉంటుందని యువ సమ్మేళన సమితి అధ్యక్షులు వన్నవాడ శ్రీకాంత్ తెలిపారు. మక్తల్ పట్టణ కేంద్రంలో నిర్వహించే హిందూ యువ సమ్మేళనం కార్యక్రమంలో యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటికే కార్యక్రమంలో భాగంగా సంఘ్ పరివార్ నాయకులు వివిధ ప్రాంతాల యువతతో సమావేశాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా యువ సమ్మేళన సమితి అధ్యక్షులు శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల భాగంగా యువతలో దేశభక్తి, ధర్మరక్షణ, కర్తవ్యనిష్ఠ, సామాజిక సేవాభావం జాతీయ చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో "హిందూ యువ సమ్మేళనం" నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నేటి యువత దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర, మహనీయుల త్యాగాల గురించి ప్రతి యువకుడు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సమాజ సేవ, జాతీయ సమైక్యత, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం వంటి విలువలను యువతలో పెంపొందించేందుకు ఈ సమ్మేళనం వేదికగా నిలుస్తుందని చెప్పారు. ఆగస్టు 12న బుధవారం ఉదయం 10 గంటలకు మక్తల్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ హిందూ యువ సమ్మేళనానికి 15 నుండి 35 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు, యువకులు, మేధావులు హిందూ సమాజంలోని ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పీకే నరసింహ, మహేష్ సాగర్, కురవలింగం, నరేందర్, బ్యాటరీ రాజు, మంజునాథ్, రాజా గౌడ్, అంజన్ ప్రసాద్, కల్లూరి అంజి, నాగరాజ్, కోల్పూర్ రాము మేస్త్రి, రాహుల్, నరేష్ పాల్గొన్నారు.

## పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయంలో 12న,భీమన అమావాస్య ప్రత్యేక పూజలు

ధరూర్ ఆగస్టు 10(ప్రజా జ్యోతి ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవుల గ్రామంలో 18వ,శతాబ్దం నాటి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 12వ తేదీన భీమన (అత్తి) అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు,హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు.అమావాస్య సందర్భంగా బుధవారం బ్రహ్మముహూర్తంలో శ్రీ ఆంజనేయ స్వామివారికి పంచామృతాభిషేకం,విశేష సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, పుష్పాలంకరణ,తమలపాకుల పూజ,అష్టోత్తర నామావళి పూజలు,అర్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఉత్తరాది మఠం,ఉడిపి పాలిమార్ పీఠాధిపతులు శ్రీ 1008 విద్యాధీశ తీర్థ శ్రీపాదుల వారు,శ్రీ 1008 విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదుల వారు ఉదయం 6 గంటలకు కృష్ణానది దండోదక స్నానం అనంతరం స్వామివారికి సంస్థాన ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఉదయం 9 గంటలకు తులసీ పూజ, అర్చనలు,అనంతరం ఉదయం 10.30 గంటల నుంచి రామాయణ ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.అలాగే ఆలయంలో పవమాన హోమం,నవగ్రహ హోమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు.హోమాలు,ఇతర ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొనదలచిన వారు 94408 07109,99592 51123,94499 34567,94407 70020 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.స్వామివారిని దర్శించుకునే ప్రతి భక్తుడికి పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి అన్నప్రసాద కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదం,తాగునీరు,అల్పా



హారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఉదయం, మధ్యాహ్నం,రాత్రి మూడు పూటలా భక్తులకు అన్నప్రసాద వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు.ప్రాంతంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ ఆంజనేయ స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ ప్రధాన అర్చకులు కేశవాచార్యులు కోరారు.

## మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుని సేవలు అభినందనీయం

కౌన్సిలర్ అస్మిత చంద్రకాంత్ రెడ్డి

కల్వకుర్తి, ఆగస్ట్ 10 (ప్రజా జ్యోతి) పారిశుద్ధ్య కార్మికుడు జోగు లక్ష్మయ్య సేవలు అభినందనీయమని కౌన్సిలర్ అస్మిత చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 15వ వార్డులో మున్సిపల్ కార్మికునికి కౌన్సిలర్ ఒక నెల జీతాన్ని



బహుమతిగా అందజేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ వార్డులో పరిశుద్యంపై పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న జోగు లక్ష్మయ్య ను గుర్తించి ఘనంగా సన్మానించారు.వార్డు సమస్యలను మా దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కరిస్తానని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల జిల్లా అధ్యక్షుడిగా బాబు నాయుడు ఏకగ్రీవ ఎన్నిక

గద్వాల ఆగస్టు 10(ప్రజా జ్యోతి ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షుడిగా శ్రీ శారద విద్యాసంస్థల అధినేత బాబు నాయుడు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.జిల్లా కేంద్రంలో శ్రీ సరస్వతి విద్యామందిర్ ప్రైవేట్ స్కూల్ వ్యవస్థాపకుల సమావేశం నిర్వహించగా,ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది.ఇందులో బాబు నాయుడిని ప్రైవేట్ పాఠశాలల జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా పలువురు ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు బాబు నాయుడికి అభినందనలు,శుభాకాంక్షలు తెలిపారు.ఆయన నాయకత్వంలో జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల అభివృద్ధికి,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి,విద్యారంగ పురోగతికి మరింత కృషి జరగాలని ఆకాంక్షించారు.భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి విద్యారంగానికి సేవలందించాలని కోరారు.

## ఘనంగా నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి జన్మదిన వేడుకలు



**నెక్కొండ ఆగస్టు 10 (ప్రజా జ్యోతి) :** స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావుల హరీష్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి హాజరై హరీష్ రెడ్డికి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో నెక్కొండ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, మండల అధ్యక్షుడు లావుడ్యా తిరుమల్, ప్రాథమిక సొసైటీ సంఘ అధ్యక్షుడు చల్ల శ్రీపాల్ రెడ్డి, సూరిపల్లి సొసైటీ చైర్మన్ మాదాటి శ్రీనివాస్, రెడ్లవాడ సొసైటీ చైర్మన్ ఆవుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొనిజేటి బిక్షపతి, నెక్కొండ రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గరికపాటి హనుమంతరావు పాల్గొన్నారు.

అలాగే మాజీ నెక్కొండ సొసైటీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, మార్కెట్ డైరెక్టర్ రావుల మైపాల్ రెడ్డి, రామాలయం కమిటీ డైరెక్టర్ గుంటుపల్లి ప్రభాకర్ రావు, రావుల భాస్కర్ రెడ్డి, బంజరుపల్లి సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్, మాజీ విద్యా కమిటీ చైర్మన్ గరికపాటి కృష్ణారావు, నెక్కొండ గ్రామ వార్డు సభ్యులు ముద్రబోయిన శ్రీకాంత్, అమీన్ పేట మాజీ సర్పంచ్ చిలుపూరి యాకయ్య, నెక్కొండ తండా గ్రామ పార్టీ అధ్యక్షుడు బానోత్ శ్రీకాంత్, నాదేండ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేటలో ఉద్రిక్త వాతావరణం

పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణ గద్దె కూల్చివేయడం దుర్మార్గం...




**నర్సంపేట ఆగస్టు 10 (ప్రజా జ్యోతి) :** నర్సంపేటలో పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాటు చేసిన గద్దె కూల్చివేసిన ప్రదేశాన్ని సందర్శించిన మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు విగ్రహ ఆవిష్కరణను అడ్డుకోవడం దుర్మార్గపు చర్య ఈ కుట్ర వెనక కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఎన్ని ఆటంకాలు సృష్టించినా కచ్చితంగా పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం ఆవిష్కరించి తీరుతాం.

ఈ కుట్రలు చూస్తుంటే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పై కూడా మాకు అనుమానాలు వస్తున్నాయి తనను మానసికంగా ఎంత ఇబ్బంది పెట్టారో అర్థం అవుతుంది. విగ్రహం గద్దెను ఎలాంటి సమాచారం లేకుండా కూల్చివేయడం దారుణం.. నర్సంపేట పట్టణంలో ఎన్ని విగ్రహాలు అనుమతితో పెట్టారు. పెద్ది సుదర్శన్ రెడ్డి దశదిన కార్యక్రమం ఉన్నందున తాత్కాలిక ఈ ధర్నాను విరామించుకున్నాం. 2 రోజుల సమయం ఇస్తున్నాం ఆలోపు ఈ విగ్రహ గద్దెను కూల్చిన వారినీ శిక్షించకపోతే రాష్ట్రవ్యాప్తముగా,ఉమ్మడి వరంగల్ జిల్లా గ్రామ గ్రామన పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చెప్పడతాం.

## శివరామపురం గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే నా లక్ష్యం

- శివరామాపురం గ్రామంలో మారెమ్మ ముత్యాలమ్మ గుడు లలోఅభివృద్ధి పనులు ప్రారంభం
- బోనాల పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి
- సర్పంచ్ షీలా హేమలత రత్నాకర్ రెడ్డి



**రాయపర్తి ఆగస్టు 10 ప్రజాజ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం శివరామాపురం గ్రామంలోని గ్రామ దేవతలు ముత్యాలమ్మ-మారెమ్మ గుడి ఆవరణలో బోనాల పండుగను దృష్టిలో ఉంచుకుని సోమవారం అభివృద్ధి పనులలో భాగంగా గుడి ఆవరణలో సీసీ ప్లాట్ ఫామ్ వేయించడం జరిగింది. మరియు గ్రానైట్ బండలు వేయించడం జరుగుతుందనీ గ్రామ సర్పంచ్ షీలా హేమలత రత్నాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలు బోనాల పండుగ పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భూక్యా లచ్చు , వార్డు సభ్యులు చెడుపాక లత యాకయ్య, చెడుపాక అనిత రవి, చెడుపాక భరత్, కాయితోజు శ్వేత సాంబయ్య మరియు కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు కాయితోజు ఉపేంద్ర చారి, పసునూరి ప్రభాకర్ రెడ్డి, నాగపూరి శ్రీను, తాళ్లపల్లి మల్లేష్ నాగపూరి బిక్షపతి, రావు రాజి రెడ్డి, నాగపూరి శ్రీను, పంగ రవి, కాయితోజు శోభన్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రజాభిమానాన్ని ఏ అధికారం కూల్చలేదు

- గటిక అజయ్ కుమార్ నిప్పులు
- పెద్ది సుదర్శన్ రెడ్డి గద్దె కూల్చివేత తీవ్ర దిగ్భ్రాంతికరం



**నెక్కొండ ఆగస్టు 10 (ప్రజా జ్యోతి) :** దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం కోసం ఏర్పాటు చేసిన గద్దెను కూల్చివేయడాన్ని తెలంగాణ పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు, మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ ఇచ్చినా, ప్రత్యేకంగా పట్టుబట్టి నర్సంపేట నియోజకవర్గానికి మెడికల్ కాలేజీ సాధించిన ప్రజా నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అని, ఆయనకు విగ్రహం ఏర్పాటు చేయడం ప్రజలు ఇచ్చే కనీస గౌరవమని స్పష్టం చేశారు. ఒక్క మెడికల్ కాలేజీ వద్దనే కాకుండా ప్రతి ఊరిలో, ప్రతి సెంటర్‌లో పెద్దన్న విగ్రహాలు ఏర్పాటు చేస్తామని, వాటిని ఎవరు అడ్డుకుంటారో చూస్తామని హెచ్చరించారు. సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు తరలివచ్చిన అశేష జనసందోహాన్ని, ప్రజల అభిమానాన్ని చూసి ఓర్వలేకే కాంగ్రెస్ పార్టీ ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నీచ రాజకీయాలు మానుకోవాలని, ప్రజా మనోభావాలను దెబ్బతీస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిస్తూ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శవ రాజకీయాలు చేయడం, ప్రజల భావోద్వేగాలతో ఆడుకోవడం తగదని స్పష్టం చేశారు. పెద్దన్నపై ప్రజలకు ఉన్న అభిమానం గద్దెలతోనో, విగ్రహాలతోనో ఆగిపోయేది కాదని, అది ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

## సంగెం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా వేల్పుల అనిల్ యాదవ్ ఏకగ్రీవ ఎన్నిక..

- “జర్నలిస్టుల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారమే నా ధ్యేయం”
- నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేల్పుల అనిల్ యాదవ్





**సంగెం, ఆగస్టు 10 (ప్రజాజ్యోతి) :** మండల కేంద్రంలో సోమవారం రోజున ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నికను ఏకగ్రీవంగా నిర్వహించారు. టీడబ్ల్యూజేఎఫ్ మండల అధ్యక్షుడు సధిరం కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మచ్చిక వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా, జిల్లా కోశాధికారి గాయపు రాజిరెడ్డి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని నాయకులు అధికారికంగా ప్రకటించారు. సంగెం మండల ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా వేల్పుల అనిల్ యాదవ్ (ప్రజాజ్యోతి), ఉపాధ్యక్షుడిగా రాములు, ప్రధాన కార్యదర్శిగా వీరస్వామి (సూర్య) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అనంతరం మచ్చిక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జర్నలిస్టు యూనియన్లకు అతీతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా మరియు సామరస్య వాతావరణంలో ఈ ఎన్నికలు జరగడం అభినందనీయమన్నారు.

నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు వేల్పుల అనిల్ యాదవ్ మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో అధ్యక్షుడిగా నన్ను ఏకగ్రీవం చేసిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు మరియు తోటి విలేకరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో జర్నలిస్టుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని, పత్రికా విలువలను కాపాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ముందుంటామని హామీ ఇచ్చారు.

నూతన కమిటీకి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేకరులు సిద్ధ నాగరాజు (నిఘా), మందపూరి బలరామ్ (తెలంగాణ గళం), హరి (ఏబీ న్యూస్), ఏలీయా (ప్రభంజన పదం), విజయ్ (సామాజిక తెలంగాణ), ఐతే కుమార్ (టైమ్ టివి న్యూస్), మంద వేణు (ప్రజాపక్షం), వేల్పుల నాగరాజు (ప్రజాదర్బార్), పుల్ల సతీష్ (అక్షర విజేత) తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం..

- విద్యకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్న ప్రజా ప్రభుత్వం..
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్





**హనుమకొండ జిల్లా/ఎల్కతుర్తి/కమలాపూర్, ఆగస్టు 10 (ప్రజాజ్యోతి) :** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని అందించి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన 394 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే దశలవారీగా సుమారు 8 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. రానున్న మూడో, నాలుగో దశల్లోనూ అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని దశలవారీగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా నిధులు నేరుగా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇళ్లతో పాటు కాలనీల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా ఇళ్ల కేటాయింపులు చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన ఎజెండా అన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రాజకీయాలకు అతీతంగా సమష్టిగా అమలు చేయాలని సూచించారు. 3.25 కోట్లతో నిర్మించిన కేజీబీవీ నూతన భవనమును మంత్రులు ప్రారంభించారు. పేద పిల్లలకు నాణ్యమైన అందించడం రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం అని అన్నారు. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ కమలాపూర్ మండలంలో 394 కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. లబ్ధిదారులకు తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర వసతులను త్వరితగతిన కల్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ 394 ఇళ్లకు లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎంపిక చేశామని తెలిపారు. తప్పుడు సమాచారం ద్వారా అనర్హులు ఎంపికైనట్లు తేలితే కేటాయింపులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారులు వారం రోజుల్లో ఇళ్లను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కూడా చైర్మన్ ఇనగల వెంకట్రాంరెడ్డి, డీఈవో గిరి రాజ్ గౌడ్, ప్రిన్సిపల్ అనితాదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ, ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఉద్రిక్తతల నడుమ పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ప్రతిష్ఠ





**నర్సంపేట ఆగస్టు 10 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట మెడికల్ కాలేజీ ముందు సొంత భూమిలో ఏర్పాటుచేసిన దివంగత మాజీ ఎమ్మెల్యే ప్రజా నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ గద్దెను అనుమతి లేదని కుంటి సాకులతో అక్రమంగా కూల్చివేయడాన్ని ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పెద్ది సుదర్శన్ రెడ్డి గుర్తుగా విగ్రహ గద్దెను కూల్చివేయడం ప్రజల మనోభావాలను దెబ్బతీయటమే, పెద్ది ఆశయాలను ప్రజల అభిమానాన్ని ఎవరు కూల్చలేరు. ఉద్రిక్తతల నడుమ దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం,జరిగింది. అనంతరం, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కొబ్బరికాయ కొట్టి, విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.ప్రజా సేవ చేసిన దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి స్మారకంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్మించినం పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణ గద్దె కూల్చివేయడం దుర్మార్గం,విగ్రహ ఆవిష్కరణను అడ్డుకోవడం ప్రయత్నించిన చివరికి గద్దెను కట్టి పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, వివిధ మండలాల నుండి వచ్చిన కార్యకర్తలు పెద్ది అభిమానులు పాల్గొన్నారు.

## ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో సమగ్ర సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టాలి



**లింగాల గణపురం, ఆగస్టు,10 (ప్రజా జ్యోతి) :** సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ మరియు రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్ జాతీయ ఉపాధ్యక్షులు ఆంజనేయులు ఆదేశాలమేరకు రాష్ట్ర కార్యదర్శి గోపాల్ దాస్ ఉపేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో నకిలీ ధ్రువపత్రాల వ్యవహారాలకు తావులేకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి గోపాల్ దాస్ ఉపేందర్ డిమాండ్ చేశారు.

ఇటీవల జూనియర్ లెక్చరర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు సంబంధించిన అంశాలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, కేవలం ఒక శాఖకు మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖలు, అన్ని ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో సర్టిఫికెట్లను సమగ్రంగా పునఃపరిశీలించాలని ఆయన కోరారు. ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత అవసరం ప్రభుత్వ ఉద్యోగం అనేది వేలాది మంది నిరుద్యోగ యువత కల. ఎంతో మంది అభ్యర్థులు సంవత్సరాల తరబడి కష్టపడి చదివి పోటీ పరీక్షలు రాసి ఉద్యోగాలు సాధిస్తున్నారని, అలాంటి పరిస్థితుల్లో నకిలీ లేదా తప్పుడు ధ్రువపత్రాలతో ఎవరైనా ఉద్యోగం పొందితే అది నిజాయితీగా పోటీ పడుతున్న నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం అవుతుందని అందువల్ల ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి విద్యార్హతలు, కులం, స్థానికత, అనుభవం, ఇతర అర్హతలకు సంబంధించిన ధ్రువపత్రా లను సంబంధిత బోర్డులు, విశ్వవిద్యాలయాలు, సంస్థల ద్వారా నేరుగా ధృవీకరించే విధంగా ప్రత్యేక ప్రక్రియను చేపట్టాలని ఆయన సూచించారు.

ఫేక్ సర్టిఫికెట్లు తేలితే ఉద్యోగం రద్దు చేయాలి : వెరిఫికేషన్‌లో నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగం పొందినట్లు నిర్ధారణ అయితే, చట్ట ప్రకారం ఉద్యోగం రద్దు చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఇప్పటివరకు పొందిన ప్రభుత్వ ప్రయోజనాలు, వేతనాలు తదితర అంశాలపై కూడా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ ధ్రువపత్రాలను తయారు చేసిన వ్యక్తులు, సంస్థలు లేదా వాటి వెనుక ఉన్న వ్యవస్థపై కూడా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారుల పాత్రపైనా విచారణ జరపాలి నకిలీ ధ్రువపత్రాల ఆధారంగా ఎవరైనా ఉద్యోగం పొందినట్లు నిర్ధారణ అయితే, వాటిని పరిశీలించిన సమయంలో అధికారుల నిర్లక్ష్యం, అవకతవకలు లేదా ఉద్దేశపూర్వకంగా ధ్రువపత్రాల పరిశీలనలో లోపాలు జరిగాయా అనే అంశాన్ని కూడా విచారించాలని నియామక ప్రక్రియలో ఎక్కడైనా అక్రమాలు జరిగినట్లు తేలితే సంబంధిత అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించాలని ఆయన అన్నారు.

**నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలి :** నిజాయితీగా చదివి, అర్హత సాధించి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు న్యాయం చేయాలంటే ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో 100 శాతం పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సర్టిఫికెట్లను దశలవారీగా వెరిఫికేషన్ చేయించాలని, అనుమానాస్పదంగా ఉన్న ధ్రువపత్రాలను సంబంధిత విద్యాసంస్థలు, బోర్డులు, విశ్వవిద్యాలయాల ద్వారా నేరుగా నిర్ధారించాలని ఆయన కోరారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఒక్కరు కూడా ప్రభుత్వ ఉద్యోగంలో కొనసాగకూడదు. అదే సమయంలో నిజాయితీగా అర్హత సాధించిన ఒక్క నిరుద్యోగ యువకుడికి కూడా అన్యాయం జరగకూడదు. ప్రభుత్వం సమగ్ర సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలి. నకిలీ సర్టిఫికెట్లు ఉపయోగించినట్లు నిర్ధారణ అయితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి” అని గోపాల్ దాస్ ఉపేందర్ ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు.ప్రధాన డిమాండ్లు అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల సర్టిఫికెట్ల సమగ్ర వెరిఫికేషన్ చేపట్టాలి.అనుమానాస్పద ధ్రువపత్రాలను సంబంధిత విద్యాసంస్థలు/బోర్డుల ద్వారా నేరుగా ధృవీకరించాలి.నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందినట్లు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసిన ముఠాలు, సంస్థలపై సమగ్ర విచారణ జరపాలి.నియామక ప్రక్రియలో నిర్లక్ష్యం లేదా అక్రమాలకు పాల్పడిన అధికారుల పాత్రపై విచారణ చేయాలి.అర్హత ఉన్న నిరుద్యోగులకు న్యాయం జరిగేలా పారదర్శక నియామక వ్యవస్థను బలోపేతం చేయాలి అని గోపాల్ దాస్ ఉపేందర్ అన్నారు.

## రాత్రికి రాత్రే అక్రమ కూల్చివేతలా

- కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డ సంగని సూరయ్య



**నెక్కొండ ఆగస్టు 10 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట మెడికల్ కాలేజీ ముందు సొంత స్థలంలో ఏర్పాటు చేసిన దివంగత మాజీ ఎమ్మెల్యే, ప్రజానేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ గద్దెను అనుమతి లేదనే సాకుతో అక్రమంగా కూల్చివేయడం స్థానికంగా తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపుతోంది. ఈ కక్షపూరిత చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని నెక్కొండ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంగని సూరన్న నిప్పులు చెరిగారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడి జ్ఞాపకార్థం నిర్మించిన గద్దెను ధ్వంసం చేయడం ప్రజల అభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రజా మనోభావాలను గౌరవించకుండా ఇటువంటి అరాచక వైఖరితో వ్యవహరిస్తే త్వరలోనే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆశయాలను, ప్రజల అభిమానాన్ని ఎవరూ అణచివేయలేరని స్పష్టం చేసిన ఆయన, ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## నీరుకుళ్లలో కోతుల బీభత్సం

వ్యక్తిపై దాడి, తీవ్ర గాయాలు



**ఆత్మకూరు, ఆగస్టు 10 (ప్రజాజ్యోతి) :** హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామంలో కోతులు ఒక్కసారిగా దాడికి తెగబడటంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ మితి మీరి పోతుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నీరుకుళ్ల గ్రామానికి చెందిన భూసాలి శ్రీను అనే వ్యక్తి ఇంటి వద్దకు కోతుల మంద వచ్చింది. వాటిని గమనించిన శ్రీను కర్ర పట్టుకుని తరిమేందుకు ప్రయత్నించాడు. అయితే, ఆ కోతులు భయపడకుండా ఒక్కసారిగా శ్రీనుపై తిరగబడ్డాయి. తీవ్ర ఆగ్రహంతో శ్రీను మెడపై పంటితో కొరికి, గోళ్లతో గీరడంతో ఆయనకు తీవ్ర రక్తస్రావమైంది. బాధితుడి అరుపులు విన్న చుట్టుపక్కల వారు వెంటనే అక్కడికి చేరుకుని కోతులను తరిమికొట్టారు. తీవ్రంగా గాయపడిన శ్రీనును చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో కోతుల దాడులు ఎక్కువవుతున్నాయని, అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి కోతులను పట్టుకోవాలని నీరుకుళ్ల గ్రామస్థులు కోరుతున్నారు.

## పెండెల రవీందర్‌ను పరామర్శించిన చల్లా..



**పరకాల ఆగస్టు 10 (ప్రజాజ్యోతి) :** పరకాల మండలం వెల్లంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పెండెల రవీందర్ కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా రవీందర్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.


## పరకాలలో సీఎం సభను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**పరకాల ఆగస్టు 10 ప్రజా జ్యోతి :** ఈ నెల 16వ తేదీన పరకాల పట్టణ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

సోమవారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల టౌన్‌తో పాటు పరకాల, నడికూడ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. బూత్ స్థాయి నుంచి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి, ప్రజలను పెద్ద ఎత్తున సభకు తరలించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. కమిట్‌మెంట్‌తో కూడిన బలమైన పార్టీ వ్యవస్థతో ప్రతి గ్రామం, ప్రతి బూత్‌లో సమన్వయంతో పనిచేస్తే సభ చారిత్రాత్మక విజయాన్ని సాధిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సభకు సంబంధించిన ఏర్పాట్లు, ప్రజల రవాణా సౌకర్యాలు, ప్రచార కార్యక్రమాలు, నాయకులు మరియు కార్యకర్తలకు బాధ్యతల కేటాయింపు తదితర అంశాలపై సమావేశంలో నాయకులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు.



# పంట మార్పిడితో రైతులకు మేలు

## ఎంఈఓ ఛత్రు నాయక్

గరిడేపల్లి,ఆగస్టు 10(ప్రజా జ్యోతి): మండలంలోని రాయనిగూడెం గ్రామ పరిధిలో సోమవారం 'మాట–పంట మార్పిడికి బాట' కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు.గ్రామ స్పెషల్ ఆఫీసర్, మండల విద్యాధికారి పానుగోతు ఛత్రు నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారి రియాజ్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశమై పంట మార్పిడిపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలకు



ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు సూచించారు.వరికి ప్రత్యామ్నా యంగా మినుములు,కందులు, అలసంద,జొన్నలు,కూరగాయ లు వంటి పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు పంటల వైవిధ్యాన్ని పెంచుకోవచ్చని వివరించారు. పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంచుకోవడం ద్వారా రైతులకు సాగు ఖర్చులు తగ్గి, భవిష్యత్‌లో మెరుగైన ప్రయోజ నాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.రైతులు కూడా పంట మార్పిడిపై అధికారుల సూచనలను తెలుసుకుని,ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆసక్తి చూపారు.ఈ కార్యక్రమంలో రైతులు కొండా సైదులు, పగిల్ల సైదులు, గుండు వెంకటేశ్వర్లు, కొల్లి దేవధానం,బొమ్మకంటి వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి పరామర్శ..

## అనారోగ్యంతో ఉన్న మాజీ సర్పంచ్‌కు దైద రవీందర్ పరామర్శ

కేతేపల్లి: ఆగస్టు 10 ప్రజా జ్యోతి: తేపల్లి మండలంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని ఇప్పలగూడెం గ్రామ సర్పంచ్ వంటల చేతన్ తండ్రి, పాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంటల వెంకటేశ్వర్లు మృతి చెందడంతో ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం





కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా గుడివాడ గ్రామ మాజీ సర్పంచ్ ఎస్కే లతీఫ్ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆయన స్వగృహానికి వెళ్లిన దైద రవీందర్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో నకిరేకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్ రెడ్డి, గుడివాడ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు రాచకొండ లింగయ్య గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జగన్నాథం, వార్డు సభ్యులు నాగభూషణం గౌడ్, గోలి వెంకన్న, గౌడ సంఘం అధ్యక్షుడు రాచకొండ కృష్ణయ్య గౌడ్, చింత పున్నమయ్య, రామలింగం, శ్రీను, బిక్షం, రాజు, నాగయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 16న ముత్యాలమ్మ అమ్మవారి పండుగ

నకిరేకల్ ఆగస్టు 10 ప్రజా జ్యోతి: నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్యాలమ్మ అమ్మవారి పండుగను ఆగస్టు 16వ తేదీ, ఆదివారం ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు నగర ప్రముఖులు, అన్ని



కులాలకు చెందిన పెద్దలు, ప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు పాల్గొని పండుగ నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. అలాగే ముత్యాలమ్మ గుడి చైర్మన్ పన్నాల రాఘవరెడ్డి పాల్గొని పండుగ నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అందరి సమ్మతితో ఆగస్టు 16వ తేదీ, ఆదివారం ముత్యాలమ్మ అమ్మవారి పండుగను నిర్వహించాలని నిర్ణయించారు. కావున నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ, అన్ని వర్గాల వారు, పెద్దలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందాలని పండుగ కమిటీ కోరుతోంది.

# రైతులతో మాట-పంట మార్పిడి కి బాట

పాలకవీడు, ఆగష్టు 10(ప్రజా జ్యోతి ): పాలకీడు మండలం కేంద్రంలో స్పెషల్ ఆఫీసర్ పార్థసారథి , వ్యవసాయ అధికారులు రైతులతో మాట –పంట మార్పిడి బాట అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ స్పెషల్ ఆఫీసర్ పార్థసారథి మాట్లాడుతూ పంట మార్పిడి గురించి ఆరుతడి పంటలు వేసుకోవాలని, వరి పంటకు ప్రత్యామ్నాయ పంటలు అయినా మినుములు, కందులు, అలసంద,



జొన్న లు వేరుసెనగ మినువులు కూరగాయలు, వేసుకోవాలని ఎల్ లో నీ ప్రభావం వల్ల వర్షాలు పడక బావులలో నీరు బోర్లలో కూడా నీరు శాతం తగ్గి తక్కువగా పోస్తున్నాయి. అనవసరం గా వరి పంట వేసుకోవద్దని రైతులకు అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లి సుజాత ,ఏఈవో శ్రీకాంత్ కార్యదర్శి . రాజ్ కుమార్ , సభ్యులు,రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# స్వదేశీ సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్న మోడీ

## ఏఐకేఎస్ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

## జైల్ భరో ను అడ్డుకున్న పోలీసులు, జూలకంటి అరెస్టు

మిర్యాలగూడ, ఆగస్టు 10,( ప్రజాజ్యోతి ): దేశ సంపదనుకార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ విధానాలనువ్యతిరేకించి దేశ సంపదను కాపాడుకోవాలని ఏఐకేఎస్ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సోమవారం జైల్ భరో కార్యక్రమం సందర్భంగా మిర్యాలగూడ లోని స్థానిక బస్టాండ్ ఎదుట సిఐటియు,రైతుసంఘం, వ్యవసాయ,కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకోనిర్వహించారు.ఈ సందర్భంగా జూలకంటిమాట్లాడుతూ కేంద్రంలో అధి కారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలుఅనుసరిస్తుందన్నారు. నాటి బ్రిటిష్ ప్రభుత్వానికివ్యతిరేకంగా స్వాతంత్రం కొరకు సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్పెట్టుబడిదారులకు మతోన్మాదులకు వ్యతిరేకంగాఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి ప్రభుత్వం నయా ఉదారవాద



సంస్కరణ లను అమలు చేస్తూ ఉందని అందులో భాగంగానే లేబర్ కోడ్ ల అమలుకు ఫైనల్ రూల్స్ ను నోటిపై చేసిందన్నారు.సులభతర వ్యాపారం పేరుతో పెట్టుబడిదారుల గరిష్ట లాభాల కోసం కార్మిక చట్టాలను రద్దు చేసిందనివిమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాలను 12 గంటలకు పెంచుకునేందుకు



యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చిందని అన్నారు. అంతేకాక కార్మికుల ప్రాథమిక హక్కు అయినా సమ్మెను కాలరాస్తూ దానిపై ఆంక్షలు విధించడమే కాక కార్మిక సంఘాల గుర్తింపు, రిజిస్ట్రేషన్ కష్టతరం చేసిందన్నారు.వామపక్షాల పోరాట ఫలితంగా 2005లో వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ పథకాన్ని నీరు గార్చే విధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. జైలు పరో సందర్భంగా పెద్ద ఎత్తున ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడటంతో పోలీసులు జూలకంటి రంగారెడ్డి సహా నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మల్లేష్,రవి నాయక్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు రాగిరెడ్డి మంగారెడ్డి, వినోద్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమేష్,చేనేత కార్మిక సంఘం నాయకులు భావండ్ల పాండు, ఐద్వా నాయకురాలు గోవర్ధన, అరుణ,సైదమ్మ, అనసూర్య,వామపక్ష రైతు సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు,వసుక్కుల మట్టయ్య, టాప్రా నాయకులు జగదీష్ చంద్ర,సత్య నారాయణ రావు గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్ర నాయక్,ఎస్ఎఫ్ఐ నాయకులు జగన్ నాయక్,సైదా నాయక్ లు పాల్గొన్నారు.

# రైతన్నల సంక్షేమం కోసం కృష్ణమ్మ తీరాన వరుణ యాగం

## పాల్గొన్న మంత్రి ఉత్తమ్ దంపతులు, ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి

హాలియా,ఆగస్టు10(ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని సదుద్దేశంతో నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని కృష్ణా నది తీరాన వేకువ జామున 4:05 గంటలకు మహా "వరుణ యాగం"అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ ప్రారంభించారు.ఈ మహా క్రతువులో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల,పౌరసరఫరాల శాఖామంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి–పద్మావతి దంపతులతో పాటు స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి సాంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపూజ,విశ్వక్సేన పూజతో యాగాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించారు.108 మంది వేద రుత్వికుల మంత్రోచ్చారణలు, 11హోమ గుండాలు.. యాగశాల వేద పఠనాల మధ్య శాస్త్రోక్తంగా యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు.పంట పొలాలు సస్యశ్యామలం కావాలని, జలాశయాలు నిండి రైతన్నల కళ్ళల్లో ఆనందం చూడాలనే సంకల్పంతో ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.కృష్ణా తీరంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోగా,కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్,జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్,జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్,రాష్ట్ర దేవాదాయ



కమిషనర్ హనుమంతరావు, స్థానిక సంస్థల ఇన్చార్జి కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి,రెవిన్యూ పోలీస్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

నాంపల్లి, ఆగస్టు, 10(ప్రజా జ్యోతి ): నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు కార్పొరేట్ పెట్టుబడిదారులు, మతోన్మాద శక్తుల విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు, ప్రజాతంత్ర వాదులు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని మద్దతు తెలిపి



ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం పిలుపులో భాగంగా జైల్ భరో కార్యక్రమం బస్టాండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, తదనంతరం రెండు గంటల పాటు అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో, నిరసన తెలిపి వాహనదారులను ఆపి రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు వచ్చి అరెస్టు చేసి స్టేషన్ కి తరలించడం జరిగింది.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ అమలుకు ఫైనల్ రూల్స్‌ను నోటిఫై చేయడం, విద్యుత్ సవరణ బిల్లు–2025, విత్తన చట్టానికి సవరణలు వంటి చర్యలకు పూనుకోవడం ద్వారా పెట్టుబడిదారులకు అనుకూలంగా విధానాలను తీసుకొస్తోందని విమర్శించారు.కార్మికుల శ్రమను మరింతగా దోచుకునేందుకు పని దినాలను పెంచుతూ, రోజువారీ పని సమయాన్ని 8 గంటల నుంచి 12 గంటల వరకు పెంచుకునే విధంగా యజమాన్యాలకు స్వేచ్ఛ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్మికులు దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న 8 గంటల పని, సమ్మె హక్కు, కార్మిక సంఘాల హక్కులు, ఉద్యోగ భద్రత వంటి హక్కులను లేబర్ కోడ్స్ ద్వారా కాలరాస్తున్నారని అన్నారు. వివిధ విభాగాలలో స్కీమ్‌లలో పనిచేస్తున్న కోట్లాది మంది కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు.ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించి, గ్రామీణ పేదలకు ఏడాదికి కనీసం 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు.ఎదుళ్ళ సునీత సిఐటియు మండల ఏదుల్లా సునీత సిఐటియు మండల కన్వీనర్ మాట్లాడుతూ రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల్ కన్వీనర్ ఎదుళ్ల సునీత, కో కన్వీనర్ రేవెల్లి యాదయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి లింగం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము లక్ష్మయ్య, గ్రామ పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు అబ్బనబోయిన వెంకటయ్య, లక్ష్మణ్, గణేష్,కృష్ణయ్య అరుణ సులోచన రావులమ్మ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వట్టికోటి వెంకటయ్య, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు కోరె లలిత, కవిత అరుణ అలివేలు, రైతు సంఘం నాయకులు కాశయ్య యాదయ్య రాములు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈశ్వరయ్య జయప్రద,తదితరులు పాల్గొన్నారు.

# పాలకవీడు మండల పి ఆర్ టి యు -టి ఎస్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

పాలక వీడు, ఆగష్టు 10(ప్రజా జ్యోతి ): పాలకవీడు మండల పి ఆర్ టి యు –టి ఎస్ నూతన కమిటీ ఎన్నికలు సోమవారం రోజున ఎన్నికలు నిర్వహించగా మండల అధ్యక్షులుగా షేక్ యూసుఫ్, ప్రధాన కార్యదర్శిగా గోలి తిరుపతి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా కందరబోయిన నాగరాజు, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా స్వప్న సపావత్, ఉపాధ్యక్షులుగా





రాతికింది అంజయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా కరుణాబాయి, మండల కార్యదర్శులుగా పెరుమాళ్ల ప్రశాంత్, ఎర్రమళ్ల సైదమ్మ ఎంపికయ్యారు. ఈ ఎన్నికల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు తంగెళ్ల జితేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తీగల నరేష్ హాజరై నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పి ఆర్ టి యు –టి ఎస్ సంఘం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం అలుపెరుగని పోరాటం చేస్తోందని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అనేక జీవోలు సాధించడంతో పాటు విద్యార్థుల సంక్షేమానికి కూడా ప్రాధాన్యతనిస్తూ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అదేవిధంగా సెప్టెంబర్ 1న సీపీఎస్ రద్దు కోసం నిర్వహించనున్న మహాధర్నాలో ఉపాధ్యాయులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసి, సి పి ఎస్ రద్దుపై తమ ఆకాంక్షను ప్రభుత్వానికి బలంగా తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఇంజమూరి కాటయ్య, ఆడిట్ కమిటీ వైస్ చైర్మన్ చల్లా ప్రభాకర్ రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు కొణతం వెంకటరెడ్డి, మండల అధ్యక్షులు కొండ బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి గంధం ధర్మరాజు, రాష్ట్ర బాధ్యులు ప్రకట శేఖర్ జిల్లా బాధ్యులు రూపావత్ గోప, గుగులోతు బాలు, మొక్క రమేష్, వినోద్, గోపి, కిరణ్ కుమార్, నరేష్★ తదితరులు పాల్గొన్నారు.

# జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేసిన పాలకీడు మండల భవన నిర్మాణ కార్మికులు

పాలకవీడు, ఆగష్టు 10(ప్రజా జ్యోతి ): పాలకీడు భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హుజూర్‌నగర్ పట్టణంలోని ఇందిరా సెంటర్‌లో నిర్వహించిన జైల్ భరో కార్యక్రమానికి పాలకీడు మండలం నుంచి భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున తరలివెళ్లి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ సందర్భంగా పాలకీడు మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ధనవత్ నెహ్రూ మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం నిర్వహించిన జైల్ భరో కార్యక్రమంలో పాలకీడు



మండల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటారని అన్నారు. కార్మిక సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని, ప్రైవేట్ ఇన్సూరెన్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు ఐక్యంగా పోరాటాలను కొనసాగిస్తామని ధనవంతు నెహ్రూ స్పష్టం చేశారు. జైల్ భరోకో తరలి వెళ్లిన వారిలో మండల కోశాధికారి తురక వెంకన్న,మండల నాయకులు ఎస్.కె రషీద్, రూపవతి బాలు, మూడు గోపాల్,శంకర్, కోటేశ్వరరావు,మహిళా కన్వీనర్ ఆది విజయ, పార్వతి, లక్షి , శాంత తదితరులు పాల్గొన్నారు.

## ట్రంపు ముందు మోకరిల్లుతున్న ఇండియా

నార్కట్ పల్లి, ఆగస్టు 10 ( ప్రజా జ్యోతి ): నార్కట్ పల్లి మండల కేంద్రంలో సిఐటియు,వ్యవసాయ కార్మిక సంఘం,రైతు సంఘం,ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జైల్ బరో కార్యక్రమంలో భాగంగా బస్టాండ్ సెంటర్లో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ స్వాతంత్రాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెట్టడానికి నేడు మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అమెరికన్ సామ్రాజ్యవాదానికి మోకరిల్లుతూ లొంగిపోతున్నదని వారు అన్నారు క్విట్ ఇండియా స్ఫూర్తితో భారతదేశాన్ని కాపాడుకోవడానికి ఉద్యమించాలని అన్నారు బిజెపి 12 సంవత్సరాలలో నయా ఉదారవాద సంస్కరణలను దూకుడుగా అమలు చేస్తూ నాలుగు లేబర్ కోడ్స్ ను అమలుకు పూనుకున్నది విద్యుత్ సవరణ బిల్లు విత్తన చట్టానికి సవరణలు ప్రతిపాదించారు కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు అమెరికా బ్రిటన్ న్యూజిలాండ్తో ఒప్పందాలు కుదురుచుకున్నది దీనివలన భారతదేశ వ్యవసాయ రంగంలోకి 32 దేశాల నుండి దిగుమతులను ప్రోత్సహిస్తు



న్నారు జీరో సుంకంతో దిగుమతులు రావడం వలన దేశీయ వ్యవసాయ ఉత్పత్తులు భారీగా ధరలు తగ్గిపోయి రైతుల దివాలా తీయడానికి అవకాశం ఏర్పడింది పంటల మద్దతు ధర చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించకుండా రైతుల్ని మరోసారి మోసం చేస్తుంది పకృతి వైపరీత్యాల నష్టపరిహారం బీమా సౌకర్యం వంటివి ఇవ్వకుండా ఎగనాంభం పెడుతుంది వామపక్షాల పోరాట ఫలితంగా 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ చట్టం 100 రోజుల పనిని నేడు బిజెపి ప్రభుత్వం వి బి జి రామ్ జి చట్టం నూతనంగా తీసుకువచ్చి రాష్ట్రాల మీద భారాలను మోపుతూ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయి విద్యుత్ ఉత్పత్తి రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర జాబితాలో ఉన్నది దాన్ని గత పార్లమెంటు సమావేశాలలో 2025 విద్యుత్ సవరణ బిల్లుగా ఆమోదించి ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వ గుప్పిట్లోకి తీసుకొని విద్యుత్ చార్జీలు కేంద్రమే పెంచుతుందని స్మార్ట్ మీటర్లు పెట్టి టారిఫ్ ముందుగానే వసూలు చేస్తారు ఉచిత విద్యుత్తు రద్దు చేస్తారు క్రాస్ సబ్సిడీలు ఎత్తివేసి ఉత్పత్తి సరఫరా పంపిణీ ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్తున్నారు దీనివలన విద్యుత్ ప్రజల నుండి దూరం చేయడానికి కుట్రలు చేస్తున్నారని వారు అన్నారు హాయ్ రెండు ఫైర్ విధానాన్ని దేశంలో తీసుకువచ్చి కార్మికుల హక్కుల మీద దాడి చేస్తున్నారు మహిళల రక్షణకు వారి హక్కులకు ప్రాధాన్యతను ఇవ్వకుండా మరింత దోపిడీ చేసే విధంగా కార్పోరేట్ శక్తులకు ఉతమిస్తున్నారు లేబర్ కోడలను వెనక్కి తీసుకునేంత వరకు ప్రజా ఉద్యమాలు జైలు బరో వంటి కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని తుమ్మల వీరారెడ్డి తెలియజేశారు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు పంటలకు సమగ్ర మద్దతు సాగునీరు నాణ్యమైన విత్తనాలు,ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొని రైతుల ప్రయోజనాలు దెబ్బ తినే విధంగా ఉన్న చట్టాలను ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చింతపల్లి బయన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకు పెద్దులు, రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్, కెవిపిఎస్ జిల్లా నాయకులు దండు రవి, మెడికల్ యూనియన్ వర్కర్స్ అధ్యక్షుడు భాస్కర్, గీత కార్మిక సంఘం మండల కార్యదర్శి కొప్పు శ్రవణ్, ఆమనగంటి ఐలయ్య,బుల్లెదు సైదులు, అరుణ జ్యోతి,దండు నాగరాజు, నన్నే సాబ్, దండు శంకరయ్య, మంద గిరి, భగవంతు రెడ్డి, మేడి ఉపేందర్, షకీల్,నరసింహ,పద్మ,జానకి కొండా వాణి, శంకరమ్మ, నరసింహ, మిర్యాల రాములు, దామర యాదయ్య,కార్మికులు, రైతులు,వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన బంజారా విద్యార్థినికి ఎమ్మెల్యే భూపతి రెడ్డి అభినందనలు

- తాండాల్లో విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి
- మరిన్ని విజయాలు సాధించాలి: ఎమ్మెల్యే
- నీట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించి తాండాకు, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి మంచి పేరు తీసుకొచ్చిన బంజారా విద్యార్థిని సుష్మా స్వరాజ్‌ను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి అభినందించారు.



**ఇందల్వాయి(ప్రజాజ్యోతి) ఆగస్టు. 10** ఇందల్వాయి మండల కేంద్రంలోని దేవి తాండ గ్రామానికి చెందిన బాదావత్ మోహన్--సునీత దంపతుల కుమార్తె సుష్మా స్వరాజ్ ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 3406వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇందల్వాయి పర్యటనలో భాగంగా ఆ విద్యార్థినిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ, గిరిజన ప్రాంతాల నుంచి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదువులో రాణించడం అభినందనీయమన్నారు. సుష్మా స్వరాజ్ సాధించిన విజయం తాండాలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కష్టపడి చదివితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని సుష్మా స్వరాజ్ నిరూపించిందని ఎమ్మెల్యే అన్నారు. రాబోయే రోజుల్లో మరింత ఉన్నతంగా ఎదిగి వైద్య రంగంలో మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు సమాజానికి సేవ చేసే మంచి వైద్యురాలిగా ఎదగాలని ఆశీర్వదించారు. తాండాల్లో అక్షరాస్యత శాతాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని, ప్రతి కుటుంబం విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థులు ఉన్నత చదువుల వైపు అడుగులు వేస్తేనే గిరిజన ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. సుష్మా స్వరాజ్ వంటి ప్రతిభావంతులైన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని తాండాల్లోని మరింత మంది విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలని పిలుపునిచ్చారు.

## కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించుదాం

- ప్రజాసంఘాల నాయకుల పిలుపు

**నవీపేట్:** మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో సోమవారం కేంద్ర ప్రభుత్వ కార్మిక కర్షక రైతాంగ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ లేబర్ కార్డులను మరియు పాత విధానంలో ఉపాధి హామీ కొనసాగించాలని అలాగే విత్తన సవరణ బిల్లు సరిచేసి విద్యుత్ సంస్కరణలో భాగంగా మోటార్లకు మీటర్లు పెట్టే విధానాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘ నాయకులు నాయక్ వాడి శ్రీనివాస్ దేవేందర్ సింగ్ మండల సంఘ అధ్యక్షులు మేకల ఆంజనేయులు రైతు సంఘం నాయకులు చిన్న వడ్డెన్న కె.వి.పి.ఎస్ నాయకులు జి గౌతమ్ అధ్యక్షులు శివశంకర్ గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.





## వ్యాపారులపై టోల్గేట్ అధికారుల వేధింపులు ఆపకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదు. మాజీ సర్పంచ్ కుమార్ హెచ్చరిక

- పెట్టుబడులు పెట్టి జీవనం సాగిస్తుంటే మళ్లీ వేధింపులు: పాశం కుమార్



**ఇందల్వాయి:** ఇందల్వాయి మండల పరిధిలోని టోల్ ప్లాజా యాజమాన్యం తీరుపై ఇరుపక్కల గ్రామాలకు చెందిన షాపుల నిర్వాహకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చదువుకున్నప్పటికీ ఉద్యోగ అవకాశాలు లభించక, కుటుంబ పోషణ కోసం టోల్ ప్లాజా సమీపంలో షాపులు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నామని వారు వాపోతున్నారు. ఇప్పటికే తమ పెట్టుబడులతో షాపులు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్న తమపై టోల్ ప్లాజా యాజమాన్యం మరోసారి ఆంక్షలు, బెదిరింపులకు పాల్పడుతోందని షాపుల యజమానులు ఆరోపిస్తున్నారు. గతంలో పోలీసుల సమక్షంలో కొన్ని దుకాణాలను తొలగించినప్పటికీ, ప్రస్తుతం సరిహద్దు పరిధిని దాటకుండా ఉన్న షాపుల విషయంలోనూ యాజమాన్యం అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని వారు పేర్కొన్నారు. చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న తమను రోడ్డుపైకి తీసుకురావద్దని, ఇప్పటికే పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని షాపుల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమపై బెదిరింపులకు పాల్పడుతూ జీవనోపాధికి ఆటంకం కలిగిస్తున్న వారిపై అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ సందర్భంగా పాశం కుమార్ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు ఉద్యోగాలు లేక బతుకుదెరువు కోసం చిన్నచిన్న షాపులు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. సరిహద్దు నిబంధనలు పాటిస్తూ వ్యాపారం చేసుకుంటున్న వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. షాపుల యజమానులను బెదిరిస్తూ రోడ్డుపైకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్న వారిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని పాశం కుమార్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సుధాకర్. మాజీ ఉప సర్పంచ్ రాజేందర్. వి డి సి చైర్మన్ రియాజ్. చాకలి దాస్. సాయికుమార్ జ్ఞానేశ్వర్ రమేష్ హోటల్ యజమానులు పాల్గొన్నారు.

## మోషంపూర్‌లో వైద్య ఆరోగ్య శిబిరం



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 10 (ప్రజా జ్యోతి)** మోషంపూర్ గ్రామంలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రామారెడ్డి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ జారా లక్ష్మి రాజయ్య, ఉపసర్పంచ్ వి. సంతోష్ రెడ్డి, మరియు పాలకవర్గ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. ఎం. సురేష్, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ రామారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్స అందించారు. శిబిరంలో మొత్తం 65 మంది అవుట్ పేషెంట్లకు వైద్య సేవలు అందించారు. వీరిలో 5 మంది జ్వరంతో బాధపడుతున్న వారిని ప్రత్యేకంగా పరీక్షించి, అవసరమైన మందులను అందించి చికిత్స చేశారు. వర్షాకాలంలో వచ్చే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా,టైఫాయిడ్, తీవ్రమైన విరేచనాలు పై శ్వాసనాళ ఇన్ఫెక్షన్లు తదితర సీజనల్ వ్యాధులపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమ తెరలను క్రమం తప్పకుండా ఉపయోగించాలని, ముఖ్యంగా రాత్రి సమయంలో దోమల కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే తాగు నీటిని కాచి చల్లార్చుకుని ప్రతిరోజూ వినియోగించాలని, భోజనం ముందు మరియు మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాల పరిశుభ్రతను కూడా పాటించాలని వైద్య సిబ్బంది సూచించారు. ఈ వైద్య శిబిరంలో హెల్త్ ఎడ్యుకేటర్ భీమ్ మానేకర్,ఏఎన్ఎంలు పద్మ, మంజుల, ఆశా కార్యకర్తలు పాల్గొని గ్రామస్థులకు ఆరోగ్య అవగాహన కల్పించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమం



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 10 (ప్రజా జ్యోతి)** నసురుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం నిర్వహణపై ముఖ్య సమావేశం నిర్వహించడం జరిగింది. దేశభక్తి, జాతీయ ఐక్యతను ప్రజల్లో మరింతగా పెంపొందించాలనే ఉద్దేశంతో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని మండల ప్రజల సహకారంతో విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, కార్యక్రమ నిర్వహణ విధానం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజలను ప్రోత్సహించాలని, యువత, మహిళలు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కల్పించాలని నాయకులు సూచించారు. జాతీయ జెండా పట్ల గౌరవం, దేశభక్తి భావన ప్రతి ఒక్కరిలో పెంపొందేలా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు చందూరి హన్మండ్లు మండల ఇచ్చార్జ్ మోహన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పైడిమల్ లక్ష్మి నారాయణ, ఓబీసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సతీష్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ , మండల ఉపాధ్యక్షులు శేఖర్, ఓబీసీ మండల అధ్యక్షులు భాస్కల సాయిలు, దళిత మోర్చా మండల అధ్యక్షులు గంగాధర్, యువ మోర్చా మండల అధ్యక్షులు భీమరి భాస్కర్, గిరిజన మోర్చా మండల అధ్యక్షులు చౌహాన్ రాందాస్, మామిళ్ళ గంగారెడ్డి, బూత్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యస్వామి, కంది మల్లేష్, బతిని రాజు, సంతోష్, సాయి కుమార్,శివ కుమార్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా ఎస్పీ



**సంగారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి** :సంగారెడ్డి పట్టణంలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను వేగవంతం చేసింది. సీఎం పర్యటించనున్న సభా ప్రాంగణాలను, ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా ఎస్పీ కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీఎం పర్యటన సందర్భంగా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి పట్టణంలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. సీఎం సభలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్న స్థానిక అంబేద్కర్ స్టేడియం, తారా డిగ్రీ కళాశాల ప్రాంగణాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా ఎస్పీ ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ పర్యటనకు భారీ సంఖ్యలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యే అవకాశం ఉండటంతో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా భద్రతా ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్ మరియు సభా వేదిక నిర్మాణంపై ప్రత్యేకంగా చర్చించారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డిపార్ట్‌మెంట్ అధికారులు, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్ మరియు పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## దౌల్తాబాద్‌లో జైల్ భరో సందర్భంగా రాస్తారోకో



**హత్నూర 10ఆగస్టు** మండల పరిధిలో దౌల్తాబాద్ అంబేద్కర్ చెవురస్తా దగ్గర సోమవారం నాడు జైల్ బరో సందర్భంగా రాస్తారోకో నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు హత్నూర మండల నాయకులు కోనంపేట శేఖర్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి జిబి గ్రామ్ జి చట్టాలు రద్దు చేయాలని కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వం దేశాన్ని మొత్తం ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు ధారా దత్తం చేస్తుందని కార్మికులను కట్టు బానిసలుగా చేసి పని గంటల పెంపుతో గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా సవరించి మరోపక్క కార్మిక వర్గానికి నష్టం చేస్తున్న ఈ నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి అని విద్యుత్తు విత్తన సవరణ బిల్లులను రద్దు చేయాలి ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలి పెరుగుతున్న నిత్యవసర సరుకులు ధరలు మరియు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలి కనీస వేతనం కార్మికులకు ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు షబ్బీర్,మంగ మహిపాల్,విజయ వివిధ రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై నిరంతరం పోరాడుతాం

టిడబ్ల్యూజెయఫ్ కార్యదర్శి సత్యం



**జిన్నారం( ప్రజాజ్యోతి)** జర్నలిస్టుల సమస్యలపై యూనియన్లకు అతీతంగా నిరంతరం పోరాడతామని పటాన్ చెరు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కార్యదర్శి కొత్తకొండ సత్యం అన్నారు. సోమవారం నాడు జిన్నారం మున్సిపల్ కేంద్రంలోపలువురు సీనియర్ జర్నలిస్టులు ఇటీవల పటాన్ చెరు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మూడో మహాసభలో కార్యదర్శిగా తిరిగి కొత్తకొండ సత్యం ఎన్నికైన సందర్భంగా వారికి శాలువాతో ఘనంగా సత్కరించి శుభకాంక్షలు చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి సత్యం మాట్లాడుతూ మా యొక్క ఫెడరేషన్ సంఘంపై అభిమానంతో మమ్మల్ని సత్కరించిన జర్నలిస్టులకు పటాన్ చెరు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ డివిజన్ కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేఖర్ గౌడ్,మహేష్ గౌడ్,విజయ్, జింకల శ్రీనివాస్, మున్నీ శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు..

ఆగస్టు 15న ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో

## భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐఏఎస్., జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్



**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా ఈ నెల 15న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐఏఎస్.,జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్. సంబంధిత అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి పాల్గొనే సమావేశం నిర్వహించనున్న అంబేద్కర్ స్టేడియం, హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం తారా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతం, వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గంజీ మైదానం తదితర ప్రాంతాలను వారు సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. సమావేశ ప్రాంగణంలో ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, వీఐపీ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలు, అత్యవసర సేవల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ లు ఆదేశించారు.

### 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు చేసి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

- కేంద్ర ప్రభుత్వానికి ఆర్‌పీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలిగే జీవన్ డిమాండ్




**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 10:** దళిత క్రైస్తవుల హక్కులను హరిస్తున్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేసి, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని హైకోర్టు న్యాయవాది, ఆర్‌పీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలిగే జీవన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ ధర్నా చౌక్‌లో ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు.. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడంతో పాటు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, వారికి తగిన రక్షణ కల్పించాలని కోరారు. దళిత క్రైస్తవుల న్యాయమైన హక్కులను ప్రభుత్వం వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మహాధర్నాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు చెందిన దళిత క్రైస్తవులు, సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై

## భారీ గోతితో ప్రమాదం .?

మురుగు కాలువ నీరు రోడ్డుపైకి..

వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

**కల్హే ర్.10.ఆగస్టు. ప్రజా జ్యోతి** మండల కేంద్రం: కల్హేర్.మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గొయ్యి ఏర్పడటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు మురుగు కాలువ నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో రహదారి పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. ప్రధాన కాలువపై ఏర్పడిన పెద్ద గుంత కారణంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ రహదారి జిల్లా కేంద్రం, మండల కేంద్రం, , పొరుగు జిల్లా పిట్లం వెళ్లాలంటే ఇదే రహదారి స్టేట్ బ్యాంక్ తదితర ముఖ్య ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రధాన మార్గంగా ఉండటంతో నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు, వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి వేళల్లో గుంత స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరిగింది. ఇప్పటికే రహదారిపై మురుగు నీరు నిలిచి ఉండటంతో వాహనదారులు గుంతను గుర్తించడం కష్టంగా మారుతోంది. పెద్ద ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి, రహదారిపై ఏర్పడిన గుంతను వెంటనే పూడ్చడంతో పాటు మురుగు కాలువ నీరు రోడ్డుపైకి రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

# సీఐటీయూ అనుబంధ సంఘాల బైక్ ర్యాలీ

## – నంగునూరు నుంచి సిద్ధిపేటకు భారీగా తరలిన కార్మికులు





**నంగునూర్, ఆగస్టు 10(ప్రజా జ్యోతి):–** కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలనే డిమాండ్‌తో సీఐటీయూ అనుబంధాల సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు కదం తొక్కారు. సీఐటీయూ చేపట్టిన 'జైలు భరో' కార్యక్రమంలో భాగంగా నంగునూరు మండల కేంద్రం నుంచి సిద్దిపేటలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి జైల్ భరో బైక్ ర్యాలీ నిర్వహించి సిద్ధిపేటకు బయలు దేరారు. ఈ సందర్భంగా హమాలి కార్మికులు పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా తరలి వెళ్లారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, తమ న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని వారు నినాదాలు చేశారు. రోజువారీ కష్టంతో కుటుంబాలను పోషించుకుంటున్న హమాలీలకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.

**హమాలీల సమస్యలను పరిష్కరించాలి**

ఈ సందర్భంగా హమాలి యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. మార్కెట్లు, గోదాములు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు తదితర ప్రాంతాల్లో కష్టపడి పనిచేస్తున్న హమాలి కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. శారీరక శ్రమతో జీవనం సాగిస్తున్న హమాలీలకు మెరుగైన సంక్షేమం, పని భద్రత, తగిన పారితోషికం, సామాజిక భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్మికుల సమస్యలు కేవలం వ్యక్తిగత సమస్యలు కాదని, వారి కుటుంబాల జీవనోపాధితో ముడిపడి ఉన్న అంశాలని నాయకులు పేర్కొన్నారు. హమాలీల శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం లభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**ఐక్యతతో పోరాటం**

సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో హమాలి కార్మికులు ఉత్సాహంగా పాల్గొనడం ద్వారా తమ ఐక్యతను చాటుకున్నారు. నంగునూరు నుంచి సిద్ధిపేటకు బైక్‌లపై ర్యాలీగా బయలుదేరిన కార్మికులు అక్కడ నిర్వహించే నిరసన కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు. కార్మికుల హక్కుల కోసం నిర్వహించే ఉద్యమాల్లో హమాలి కార్మికులు ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. తమ సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఈ జైల్ భరో బైక్ ర్యాలీలో హమాలి యూనియన్ అధ్యక్షుడు అనరాజు ఎల్లయ్య, దేవులపల్లి బాలరాజు, అనరాజు తిరుపతి, దేవులపల్లి రాంబాబు, దేవులపల్లి యాదగిరి, దేవులపల్లి దేవేందర్, దేవులపల్లి కనకరాజు, గొడుగు హనుమంతు, గాడిచర్ల సంపత్ తదితర హమాలి కార్మికులు పాల్గొన్నారు. అన్ని గ్రామాల నుంచి సీఐటీయు అనుబంధ సంఘాల నాయకులు సిద్దిపేటకు తరలివెళ్లి సిద్దిపేటలో బైక్ ర్యాలీ నిర్వహించి పీఎఫ్ కార్యాలయం ముందు పికెటింగ్ నిర్వహించామని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి చిట్యాల కనకయ్య తెలియజేశారు.

## మెదక్ పట్టణంలో డబుల్ బెడ్ రూమ్‌ల వద్ద సిసిరోడ్ నిర్మాణం





**మెదక్ (ప్రజాజ్యోతి)** టిఆర్ఎస్ పార్టీ అధినేత తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు తలపెట్టినటువంటి డబుల్ బెడ్ రూమ్ వద్ద రోడ్ ఎంతో కాలంగా వర్షాలు పడితే బురదమయంగా మారుతుండే అయినటువంటి రోడ్డు కు ఇన్ని రోజులకు మార్దశ వచ్చింది. మెదక్ పట్టణంలో 12 వ వార్డు పిల్లికోటల ప్రాంతానికి చెందిన డబుల్ బెడ్ రూమ్ లకు చెందిన వ్యక్తి మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ ఉన్నప్పటికీ అక్కడ సిసి రోడ్ నిర్మానించలేని పరిస్థితి ఇప్పుడు మహర్దశ వచ్చింది సిసి రోడ్ నిర్మాణానికి ఒక కోటి 63 లక్షలతో నిర్మించాలని ప్రభుత్వం తలపెట్టింది.

# సొసైటీ డైరెక్టర్ లింగాల నర్సవ్వ మరణం బాధాకరం

## – సొసైటీ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి




**తొగుట, ఆగస్టు 10 (ప్రజాజ్యోతి):** తొగుట మండలం తుక్కాపూర్ గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ లింగాల నర్సవ్వ అకాల మరణం చాలా బాధాకరమని సొసైటీ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తుక్కాపూర్ స్వగృహంలో లింగాల నర్సవ్వ పార్థివ దేహానికి సోమవారం నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసినట్లు తెలిపారు. 2020 ఫిబ్రవరిలో జరిగిన సహకార సంఘం ఎన్నికలలో తుక్కాపూర్ గ్రామం నుండి లింగాల నరసవ్వ డైరెక్టర్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. లింగాల నరసవ్వ అకాల మరణం తీవ్రంగా కలచి వేసిందని ఆమె గత రాత్రి అనారోగ్యంతో మరణించడం జరిగిందన్నారు. లింగాల నర్సవ్వ కుటుంబానికి పాలకవర్గం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సొసైటీ డైరెక్టర్ గా తమ పాలకవర్గంలో అందరితో కలుపుగోలుగా ఉండేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కురుమ యాదగిరి, డైరెక్టర్ మహిపాల్ రెడ్డి, సీఈఓ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పవన్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన నర్సారెడ్డి



**కొండపాక, ఆగస్టు 10:** కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు సాధుపల్లి పవన్ గౌడ్ కుటుంబాన్ని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి సోమవారం పరామర్శించారు. పవన్ గౌడ్ తండ్రి సాధుపల్లి రవి, తాత మాజీ ఎంపీటీసీ సాధుపల్లి నర్సాగౌడ్‌లను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. అనంతరం పవన్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సారెడ్డి వెంట, మంగోల్ పీఏసీఎస్ డైరెక్టర్ నరసింహచారి, కుకునూరుపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం కరుణాకర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పవన్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన నర్సారెడ్డి



**కొండపాక, ఆగస్టు 10:** కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు సాధుపల్లి పవన్ గౌడ్ కుటుంబాన్ని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి సోమవారం పరామర్శించారు. పవన్ గౌడ్ తండ్రి సాధుపల్లి రవి, తాత మాజీ ఎంపీటీసీ సాధుపల్లి నర్సాగౌడ్‌లను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. అనంతరం పవన్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సారెడ్డి వెంట, మంగోల్ పీఏసీఎస్ డైరెక్టర్ నరసింహచారి, కుకునూరుపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం కరుణాకర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సమస్యలు కనిపిస్తే.. చర్యలు తప్పవు

## – సిద్దిపేటలో మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు





**సిద్దిపేట,ఆగస్టు 10 ,(ప్రజాజ్యోతి):** పట్టణంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యల పరిష్కారంపై మున్సిపల్ యంత్రాంగం దృష్టి సారించింది. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి పారిశుధ్యం, డ్రైనేజీ, నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ముందుగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రంతో కలిసి జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయం పరిసరాల్లోని పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి, పిచ్చి మొక్కలను తొలగించాలని, దోమల నియంత్రణకు పిచికారీ చేపట్టాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.అనంతరం 3వ వార్డు రంగధాంపల్లి బతుకమ్మ కుంటను పరిశీలించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నీరు కుంటలోకి చేరి నీరు కలుషితమవుతోందని స్థానికులు చేసిన ఫిర్యాదుపై కమిషనర్ స్పందించారు. డ్రైనేజీ నీరు కుంటలోకి చేరకుండా తక్షణ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఒకటవ వార్డు లింగారెడ్డిపల్లిలో మంజూరైన అనుమతులకు విరుద్ధంగా ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నారన్న ఫిర్యాదుపై కమిషనర్ నిర్మాణ స్థలాన్ని తనిఖీ చేశారు. అనుమతులను ఉల్లంఘిస్తూ చేపడుతున్న పనులను వెంటనే నిలిపివేయాలని ఇంటి యజమానులను ఆదేశించారు.ఈ సందర్భంగా కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ.. పట్టణ పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలు, ప్రజల ఫిర్యాదులు, అక్రమ నిర్మాణాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. మున్సిపల్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని తెలిపారు.



# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైల్ బరో

## – సిఐటియు తొగుట మండల కన్వీనర్ వసంత – తొగుటలో సీఐటీయూ నాయకులు, కార్మికులు రాస్తారోకో

## – కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకోవాలి



**తొగుట, ఆగస్టు10 (ప్రజాజ్యోతి):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూల విధానాలకు వ్యతిరేకంగా, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైల్ బరో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని సిఐటియు తొగుట మండల కన్వీనర్ ఏ. వసంత పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా తోగుట మండల కేంద్రంలో ర్యాలీ అనంతరం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు తొగుట మండల కన్వీనర్ ఏ. వసంత మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా ఆ రోజుల్లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈరోజు జైల్ భరో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్ లు తీసుకువచ్చి కార్మికులను కట్టు బానిసలుగా చేసి కార్పొరేట్ పరిశ్రమ అధిపతులకు మేలు చేస్తుందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న 29 రకాల కార్మిక చట్టాలను బీజేపీ కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. కార్మిక వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం చేసే విధంగా విత్తన చట్టాన్ని తీసుకువచ్చి కార్పొరేట్ బహుళజాతి సంస్థలకు అప్పగిస్తుందని దీనివల్ల రైతులు పూర్తిగా దివాలా తీసే ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 2025 విద్యుత్ సవరణ బిల్లు వలన రాష్ట్ర ప్రభుత్వాల హక్కులు కోల్పోయి విద్యుత్తు ప్రైవేటీకరణ జరుగుతుందని, దీనివల్ల రైతులకు ఉచిత విద్యుత్ కోల్పోయి విద్యుత్ బారాలతో ప్రజలు మోయలేని విధంగా తయారవుతుందని విమర్శించారు. విత్తన చట్టం మరియు విద్యుత్ సవరణ 2025 బిల్లులను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ పేరు తొలగిస్తూ విబి జిరామ్ జి చట్టంగా పేరు మార్పును వెనక్కు తీసుకొని ఉపాధి హామీ 2005 చట్టం యదావిధంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ విధానాలను వెనక్కు తీసుకొని కార్మికులు, రైతులు, ప్రజలకు మేలు చేసే విధంగా చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పుష్ప, శ్యామల, మాణిక్యం, నర్సింలు, రాణి, వరమ్మ, వినోద, భాగ్యలక్ష్మి, శాందుల, నాగరాజు, హేమలత, జాహ్నవి, పుష్పలత, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.



# క్విట్ ఇండియా స్ఫూర్తితో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

## – కార్మిక, కర్షక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా రాస్తారోకో – ప్రజా సంఘాల నాయకుల పిలుపు






**కొమురవెల్లి, ఆగస్టు 10 (ప్రజాజ్యోతి):–** క్విట్ ఇండియా స్ఫూర్తితో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక, కర్షక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త జైలు భరో కార్యక్రమంలో భాగంగా సోమవారం కొమురవెల్లి మండల కేంద్రంలోని పోలీస్ బొమ్మ చౌరస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, తాడూరి రవీందర్, బద్దిపడిగ కృష్ణారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల ప్రయోజనాలకు వ్యతిరేకంగా విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 రోజుల పని, కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600 కూలి చెల్లించాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, వి.బి.జి. రాంజీ చట్టాన్ని రద్దు చేసి పాత పద్ధతిలో ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. విత్తన సవరణ బిల్లును రద్దు చేయడంతో పాటు విద్యుత్ సంస్కరణలను ఉపసంహరించుకుని వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేసే విధానాన్ని నిలిపివేయాలని కోరారు.ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం ఆపాలని, పెరిగిన ధరలను తగ్గించాలని, రైతులకు పంటలకు తగిన గిట్టుబాటు ధర కల్పించాలని, అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులను పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి తొలగించారు. ఈ కార్యక్రమంలో తేలు ఇస్తారి, అత్తిని శారద, ఉల్లంపల్లి సాయిలు, బొక్కెల్లి బాలకిషన్, బుడిగం సురేందర్‌రెడ్డి, సార్ల యాదయ్య, వెంకటేష్, పాసిగంటి బాలరాజు, చింతల ఇంద్రుడు, తాడూరి పరమేశ్వర్, గాంధారి శ్రావణ్‌చారి, ఎం.డి. గోరెమియా, తాడూరి నరేష్, తాడూరి ప్రవీణ్, తాడూరి భరత్‌కుమార్, కర్రోళ్ల రాకేష్, నూకల శ్రీనివాస్ తదితరులతో పాటు గ్రామపంచాయతీ కార్మికులు రోడ్డ నరసింహులు, మల్లేశం, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# పుంజాల శివశంకర్ సేవలు చిరస్మరణీయం



**సిద్దిపేట అర్బన్ ,ఆగస్టు 10 ,(ప్రజాజ్యోతి):** బీసీలు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడి, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన స్వర్గీయ పుంజాల శివశంకర్ సేవలు చిరస్మరణీయమని మున్నూరు కాపు సంఘం నాయకులు అన్నారు. మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిద్దిపేట పట్టణ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పుంజాల శివశంకర్ 97వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.పట్టణ అధ్యక్షుడు నీలం యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకం తిరుపతి, జిల్లా అధ్యక్షుడు గుర్రప్పగారి రాజులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పుంజాల శివశంకర్ మున్నూరు కాపులకే కాకుండా బీసీలు, ఇతర వెనుకబడిన వర్గాల కోసం గళమెత్తిన గొప్ప సామాజికవేత్త అని అన్నారు. కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా, న్యాయవాదిగా వివిధ హోదాల్లో పనిచేస్తూనే సామాజిక న్యాయం కోసం కృషి చేశారని గుర్తుచేశారు.బీసీలకు రిజర్వేషన్లు, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందని పేర్కొన్నారు. అణగారిన, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు.పుంజాల శివశంకర్ ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు బీసీ వర్గాలన్నీ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆయన సేవలను స్మరించుకోవడమే కాకుండా, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు ఆకుల కిష్టయ్య, కార్యదర్శి నాయకం సత్యనారాయణ, పట్టణ కోశాధికారి కె.ఆర్. సురేందర్, సలహా మండలి సభ్యుడు ఆకుల మల్లేశం, కార్యవర్గ సభ్యులు రెండ్ల శ్రీనివాస్, జిల్లా కోశాధికారి చల్ల నారాయణ, గౌరవ సభ్యుడు నాయకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం

- గ్రామ సమస్యలను పరిష్కరిద్దాం.. అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్దాం
- మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి, సర్పంచ్ భీమప్ప



బషీరాబాద్, ఆగస్టు 10, ప్రజా జ్యోతి : తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి సహకారంతో మంతన్ గౌడ్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం మంతన్ గౌడ్ గ్రామంలో సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ భీమప్ప, వికారాబాద్ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు శంకరప్ప పర్యటించారు. గ్రామంలోని ఎస్సీ వాడలో తిరుగుతూ స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామానికి అవసరమైన మౌలిక వసతులను కల్పించి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులతో కలిసి పనిచేస్తామని అన్నారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకురావాలని, అందరి సహకారంతో మంతన్ గౌడ్ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా కోఆర్డినేటర్ శ్రీకాంత్, గ్రామస్తులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కన్వర్జెన్స్ సమావేశం

- ట్రాఫిక్, రహదారి మౌలిక వసతులపై కాలపరిమితితో చర్యలు



శేరిలింగంపల్లి, ఆగస్టు 09 (ప్రజాజ్యోతి) : సైబరాబాద్ వ్యాప్తంగా ట్రాఫిక్, రహదారి మౌలిక వసతులు, వర్షాకాలానికి సంబంధించిన కీలక సమస్యలపై సమీక్షించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. సీఎంసీ, సైబరాబాద్ పోలీస్, వివిధ సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సమావేశానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.రమేష్, ఐపీఎస్,సీఎంసీ కమిషనర్ సృజన, ఐఏఎస్, ఎఫ్ సిడిఎ కమిషనర్ శశాంక,ఐఏఎస్, మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, ఐఏఎస్, టీజీఎస్ పీడీసీఎల్ చైర్మన్ ఓ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్,జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్,ఐపీఎస్,అన్ని జోన్ల జోనల్ కమిషనర్లు,డిప్యూటీ కమిషనర్లు,ఇతర సంబంధిత శాఖల అధిపతులు,సీఎంసీ, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ,హైడ్రా,ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు.సమావేశంలో సైబరాబాద్ వ్యాప్తంగా ట్రాఫిక్,రహదారి మౌలిక వసతులు,వర్షాకాల సన్నద్ధతకు సంబంధించిన కీలక అంశాలను సమీక్షించారు. అన్ని సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో కాలపరిమితిలో చర్యలు చేపట్టడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.సమావేశంలో మొత్తం 334 రహదారి మౌలిక వసతుల పనులను సమీక్షించారు.

ముఖ్య అంశాలు... 334 రహదారి మౌలిక వసతుల పనుల సమీక్ష 245 దెబ్బతిన్న రహదారి ప్రాంతాల్లో రీకార్పెటింగ్/గుంతల పూడ్చివేతకు గుర్తింపు 25 ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు పెండింగ్, 65 సైన్‌బోర్డులు,ఇల్యూమినేషన్ పనులు,9 రహదారి ఆక్రమణ ప్రాంతాల్లో తక్షణ చర్యలకు గుర్తింపు, 53 ఫుట్‌పాత్,జంక్షన్ పనులు 13 రహదారి విస్తరణ ప్రతిపాదనలు,85 నీరు నిలిచే అవకాశం ఉన్న ప్రాంతాల సమీక్ష గుర్తించిన సమస్యలపై సంబంధిత శాఖలు వెంటనే క్షేత్రస్థాయిలో చర్యలు ప్రారంభించి,పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత కాలపరిమితిలో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాదచారుల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ,రహదారి మౌలిక వసతుల మెరుగుదల మరియు వర్షాకాల సన్నద్ధతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని,చేపట్టిన చర్యలు క్షేత్రస్థాయిలో స్పష్టమైన ఫలితాలను అందించేలా చూడాలని సూచించారు.సైబరాబాద్ వ్యాప్తంగా ట్రాఫిక్, రహదారి మౌలిక వసతులు, వర్షాకాలానికి సంబంధించిన సమస్యలను సమన్వయంతో, వేగంగా పరిష్కరించేందుకు సంబంధిత శాఖల మధ్య కన్వర్జెన్స్ విధానం కొనసాగుతుందని తెలిపారు.

## గ్రామానికి వెలుగు వస్తే ప్రజలకు భద్రత ఉంటుంది

- మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి
- ప్రజలకు ఉపయోగపడే పనులే నిజమైన అభివృద్ధి
- మల్లాపూర్ సర్పంచ్ చిట్టేడి నరసింహారెడ్డి
- సొంత నిధులతో మల్లాపూర్‌లో 04 ఐమాక్స్ లైట్స్ ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న వివిధ గ్రామాల ప్రజలు







కొత్తూరు ఆగస్టు 10 (ప్రజా జ్యోతి) : గ్రామానికి వెలుగు వస్తే ప్రజలకు భద్రత ఉంటుందని మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి అన్నారు. కొత్తూరు మండలంలోని మల్లాపూర్ గ్రామంలో సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 4 ఐమాక్స్ లైట్స్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాత్రి విధులు ముగించుకొని ఇళ్లకు వెళ్లే రైతులు,కార్మికులు, వ్యాపారులు అత్యవసర పనుల కోసం బయటకు వచ్చే ప్రజలకు కూడా ఈ లైటింగ్ ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మల్లాపూర్ సర్పంచ్ నరసింహ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిధుల కోసం ఎదురు చూడకుండా సొంత నిధులతో గ్రామానికి అవసరమైన లైటింగ్ సదుపాయం కల్పించడం అభినందనీయమని మల్లాపూర్ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి అన్నారు. ఐమాక్స్ లైట్స్ కేవలం విద్యుత్ దీపాలు మాత్రమే కాకుండా.. రాత్రి వేళల్లో ప్రజలకు భద్రతకు ప్రతికగా నిలుస్తాయని గ్రామస్తులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచులు రాములు గౌడ్,శంకర్ నాయక్, వార్డ్ సభ్యులు పవిత్ర జయేందర్ రెడ్డి,స్వాతి రాజేష్,జార్జ్ రెడ్డి,మాజీ సర్పంచులు రాజు,రవి నాయక్,నాయకులు పాపిరెడ్డి,దయానంద్ రెడ్డి, దామోదర్ రెడ్డి,పిన్నింటి సుభాష్ రెడ్డి,శేఖర్ రెడ్డి,కృష్ణ రెడ్డి,అంజి రెడ్డి,మురళీధర్ రెడ్డి, ఎస్ శేఖర్ రెడ్డి,నరేంద్ర రెడ్డి, జితేందర్ రెడ్డి,అక్బర్ పాషా, మహాత్మా రెడ్డి,పెంట రెడ్డి,చిర్రా రాజు,చిర్ర సుధాకర్,బోకుల రాజు,కాట్న శీను,సుధాకర్,చిర్ర దర్శన్,బైండ్ల దర్శన్, కృష్ణ,చిన్న,రఘు,చింటూ, సురేష్,శ్రీశైలం,శ్రీను,లింగం గౌడ్,పెండ్లిమడుగు రాజు గౌడ్, పీ మోహన్ నాయక్,ఆర్ మోహన్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా 30 పడకల ఆసుపత్రి పనులు

- స్లాబ్ దశకు చేరుకున్న నిర్మాణ పనులు సందర్శించిన కాంగ్రెస్ నాయకులు
- వైద్య సిబ్బంది కొరత లేకుండా చర్యలు.. - గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు
- ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు - మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజా వర్ధన్ రెడ్డి
- వికారాబాద్ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు శంకరప్ప



బషీరాబాద్, ఆగస్టు 10, ప్రజా జ్యోతి : బషీరాబాద్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న 30 పడకల ఆసుపత్రి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. నిర్మాణ పనులు స్లాబ్ దశకు చేరుకున్న నేపథ్యంలో సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి, వికారాబాద్ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు శంకరప్ప ఆసుపత్రి నిర్మాణ పనులను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రాజవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ 30 పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తే బషీరాబాద్ మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గి, స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఆసుపత్రి ప్రారంభం అనంతరం వైద్య సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకునేలా ప్రభుత్వం దృష్టి సారించిందని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి పనులు వేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు శంకరప్ప మాట్లాడుతూ ఆస్పత్రి త్వరగా ప్రారంభమై ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మీడియా కోఆర్డినేటర్ శ్రీకాంత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం శ్రమించాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్
- పాలకమండలిని అభినందించిన ఎమ్మెల్యే
- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్పిన చైర్మన్, వైస్ చైర్మన్, పాలకమండలి సభ్యులు





తాండూరు ఆగస్టు 10 ప్రజా జ్యోతి : తాండూరు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం చైర్మన్ వడ్డే శ్రీనివాస్, వైస్ చైర్మన్ సభ్యులను తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి అభినందించి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ వడ్డే శ్రీనివాస్,వైస్ చైర్మన్ షేక్ కాశీం,పాలకవర్గం సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్, వైస్ చైర్మన్ షేక్ కాశీం,నూతన డైరెక్టర్లను సన్మానించి అభినందించారు.

అనంతరం ఎమ్మెల్యే తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రైతుల కోసం శ్రమించాల్సిన అవసరం ఉందని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షాన నిలుస్తున్న విధంగానే తాండూర్ వ్యవసాయం మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల పక్షాన నిలవాలని గుర్తు చేశారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం సమర్థవంతంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు రైతులకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు రైతుల అవసరాల కోసం సహాయకులుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, మాజీ యం పి పి శరత్ బసప్ప,కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు హరీశ్వర్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సభ్యులు తదితరులు ఉన్నారు.

# కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న బీజేపీ ప్రభుత్వం - ప్రజలపై భారాలు





- కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం పోరాటం ఉధృతం
- పరిగిలో జైల్ భరో సందర్భంగా రాస్తారోకో

పరిగి, ఆగస్టు 10 (ప్రజాజ్యోతి) : కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను కట్టబెడుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసనగా వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పరిగి పట్టణంలోని బస్టాండ్ ముందు రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. వెంకటయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఈ. రామకృష్ణ, అంగన్వాడీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే. నర్సమ్మ, ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కే. మంగమ్మ మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ, రైతుల సమస్యలను పక్కనపెట్టి, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాలను అనుసరిస్తోందని తీవ్రంగా విమర్శించారు.

ప్రజలకు ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులను తగ్గించి గ్రామీణ పేదల ఉపాధిపై దాడి చేస్తోందని అన్నారు. వ్యవసాయ కార్మికులకు ఏడాది పొడవునా పని దొరికేలా చూడాలని, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్మికులు దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న హక్కులను నాలుగు లేబర్ కోడ్ల పేరుతో బలహీనపరిచి యజమానులకు అనుకూలంగా చట్టాలను మార్చారని అన్నారు. ఎనిమిది గంటల పని హక్కును, కనీస వేతనం, ఉద్యోగ భద్రత, కార్మిక సంఘాల హక్కులను దెబ్బతీసే చర్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందో చెప్పాలని ప్రశ్నించారు. రైతుల పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించాలని, రైతుల రుణభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడీ, ఆశా తదితర స్కీమ్ వర్కర్లతో కేంద్ర ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటోందని నాయకులు విమర్శించారు. వారికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పెన్షన్ తదితర సౌకర్యాలు కల్పించకుండా సంవత్సరాల తరబడి పనిచేయించుకోవడం అన్యాయమన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజల జీవనం భారంగా మారుతున్నా కేంద్ర ప్రభుత్వం ధరల నియంత్రణపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

ప్రజల జేబులపై భారాలు వేసి కార్పొరేట్లకు రాయితీలు ఇవ్వడం బీజేపీ ప్రభుత్వ విధానంగా మారిందని ఆరోపించారు.

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, దేశ సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం, ప్రజా సంక్షేమ రంగాల్లో పెట్టుబడులను తగ్గించడం వంటి విధానాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఐక్యంగా నిలబడితే ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడం సాధ్యమేనని నాయకులు అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎండి హబీబ్, సత్యయ్య, స్వరూప, విజయ, వరలక్ష్మి, పద్మ, రఘురాం, సత్యయ్య, మరియు అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్లు మధ్యాహ్న భోజన కార్మికులు గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 104వ సబ్జిమండి వార్షిక బోనాల మహోత్సవం





శేరిలింగంపల్లి,ఆగస్టు 10 (ప్రజాజ్యోతి) : కార్వాన్ నియోజకవర్గంలోని అతి ప్రాచీన మందిరాలైన నల్ల పోచమ్మ,మాత మహంకాళి దేవి అమ్మ వార్లకు భక్తి భావంతో బోనాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది ఇక్కడి 14 బస్తీల వాసులు ఒక కమిటీగా ఏర్పడి ప్రతి సంవత్సరం ఆషాఢ మాసం చివరి ఆదివారం అమ్మవారికి సామూహిక బోనాలు సమర్పించడం ఒక ఆనవాయితీగా పాటిస్తున్నారు. బోనాల పండుగను పురస్కరించుకుని సబ్జిమండిలోని నల్ల పోచమ్మ మహంకాళి దేవి మందిరం ఉమ్మడి ఆలయాల ఆధ్వర్యంలో 104 వ వార్షిక బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షులు కట్ట లింగం తెలిపారు. సభ్యులు మహంకాళి ఆలయం నుండి మహిళలు సామూహికంగా బయలుదేరి నటరాజ్ నగర్ లోని నల్ల పోచమ్మ ఆలయంలో బోనాలను సమర్పించారని తెలిపారు. ఈ సందర్భంగా ఏనుగు అంబారీపై అమ్మవారి ఘటాన్ని అతి సుందరంగా అలంకరణ చేసి జానపద కళాకారుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాల సందడి నడుమ వేషధారణ నడుమ మహిళలు, చిన్నారులు,యువకులు ఎంతో ఉత్సాహంగా వెంటరాగా ఊరేగింపును ఎంతో కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గడ్డం వివేక్ వెంకటస్వామి,బండి సంజయ్,పోచారం శ్రీనివాస్ రెడ్డి,కౌసర్ మొయినుద్దీన్ పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి అల్లె రాంకుమార్, కోశాధికారి చింత శ్రీకాంత్, కమిటీ సలహాదారులు కట్ట రాజయ్య,గూడబోయిన శివరత్నం, జలగం వేణు,కట్ట శివరాజ్, బుర్ర వేణు కుమార్,కట్ట నర్సింగరావు, ఆవుశెట్టి శ్యాంసుందర్, గుడుమాని అశోక్ కుమార్,గాండ్ల నిరంజన్ బాబు,ప్యాట సందీప్‌కుమార్, దొర్లుల శ్రీనివాస్, పూజ కమిటీ సభ్యులు మరియు భక్త మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమమును విజయవంతం గా నిర్వహించారు.

## యాలాల్‌లో కంజర్ల విజయలక్ష్మి యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



యాలాల్ (ఆగస్టు10) ప్రజా జ్యోతి : మండలం కంజర్ల విజయలక్ష్మి యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాలాల్ మండల కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఫౌండేషన్ చైర్‌పర్సన్ కంజర్ల విజయలక్ష్మి యాదవ్ విజయక్క శ్రీమంత కానుక కార్యక్రమంలో పాల్గొని గర్భిణీ మహిళలకు గడప గడపకు వెళ్లి శ్రీమంత కార్యక్రమం నిర్వహించారు, తదుపరి బాలింతలకు జనని కిట్స్ అంద జేశారు. అనంతరం యాలాల్ నుంచి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్లాస్టిక్ కవర్ల వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టాల్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ బ్యాగులను వాడటం మానేసి, పునర్వినియోగ బ్యాగులను ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ తరఫున తయారు చేయించిన బ్యాగులను యాలాల్ ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి యాదవ్ మాట్లాడుతూ,తాండూర్ నియోజకవర్గంలోని గ్రామ గ్రామానికి వెళ్లి గర్భిణీ మహిళలకు శ్రీమంతం కార్యక్రమాలు నిర్వహిస్తూ, జనని కిట్స్ అందించడంతో పాటు ప్రజలకు సిపిఆర్ శిక్షణ వంటి పలు సేవా కార్యక్రమాలను ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా మాజీ కో ఆప్షన్ సంఘం అధ్యక్షులు అక్బర్ బాబా, ప్రకాష్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ గొల్ల శ్రీనివాస్ కమ్మరి శేఖర్,అమ్రేష్ ముదిరాజ్, నర్సిములు మాలిగిరి,ఐల్ రాజ్,చిట్టపల్లి రవి,సురేష్ మంగలి అనంతమ్మ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## తాండూర్ ఏఎంసీ డైరెక్టర్‌గా సత్యనారాయణ రెడ్డి

తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి రుణపడి ఉంటా: సత్యనారాయణ రెడ్డి



యాలాల ఆగస్టు 10 ప్రజా జ్యోతి : తాండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంలో తనకు డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని యాలాల మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన సత్యనారాయణ రెడ్డి తెలిపారు. తాండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో తనకు చోటు కల్పించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

తనను ఏఎంసీ డైరెక్టర్‌గా ఎంపిక చేయడానికి సహకరించిన బుయ్యని శ్రీనివాస్ రెడ్డి,యాలాల మాజీ సొసైటీ చైర్మన్ సురేందర్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు నర్సిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహిపాల్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు,పెద్దలకు సత్యనారాయణ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ పాలకవర్గంలో తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

## అమ్మకు బోనాలు.. జగతికి భాగ్యాలు

- మల్లాపూర్ మాజీ ఉపసర్పంచ్ పిన్నింటి హరిత మధుసూదన్ రెడ్డి
- అమ్మవారికి బోనమెత్తిన పిన్నింటి హరిత



కొత్తూరు ఆగస్టు 10 (ప్రజా జ్యోతి) : ప్రకృతిని శక్తిస్వరూపిణిగా, జగన్మాతగా కొలవడం భారతీయ సంప్రదాయం అని ప్రకృతిశక్తులు వివిధ కళలే గ్రామదేవతలని దేవీ భాగవతం అని ఆమె పేర్కొన్నారు. కొత్తూరు మండలంలోని మల్లాపూర్ గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ పిన్నింటి హరిత మధుసూదన్ రెడ్డి అమ్మవారికి బోనం ఎత్తి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమ్మవారికి భక్తితో సమర్పించే పప్పు అన్నాన్ని బోనం అంటారు. ఇది భోజనం అనే మాట నుంచి వచ్చింది. 'భోజనం' ప్రకృతి కాగా, 'బోనం' వికృతి అని చెబుతారు. వేకువజామునే తలస్నానం చేసి పరిశుభ్రమైన దుస్తులు ధరించి కొత్తకుండలో బియ్యం,పాలు,నెయ్యి,చక్కెర కలిపి నైవేద్యం తయారు చేస్తారు. మట్టి లేక రాగి పాత్రలో వండుతారు. ఈ పదార్థాలతో కూడిన నైవేద్యంతో పాటు భక్తులు తమ మొక్కుబడులకు అనుగుణంగా కూడా ప్రసాదాలు తయారు చేసి అమ్మవారికి పెడుతారు అని ఆమె అన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో వరికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

## రైతులను ప్రోత్సహించాలి: జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ టౌన్ ఆగస్టు 10 (ప్రజా జ్యోతి ): ఎల్‌నినో ప్రభావంతో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తున్న నేపథ్యంలో, రైతులు నీరు ఎక్కువగా అవసరమయ్యే వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. ఈ మేరకు వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించి పంట మార్పిడిని ప్రోత్సహించాలని ఆదేశించారు.

జిల్లాలో 3.44 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణానికి గాను ఇప్పటివరకు 2.86 లక్షల ఎకరాల్లో సాగు ప్రారంభమైందని, అందులో 2.21 లక్షల ఎకరాల్లో వరి నాట్లు




పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. మిగిలిన భూముల్లో వరి సాగు చేయకుండా పప్పు దినుసులు, నూనె గింజలు, తృణధాన్యాలు, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కోరారు. భూగర్భ జలాలు ఆశాజనకంగా లేకపోవడంతో పాటు చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో వరి సాగు రైతులకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలు, నేల రకం, వాతావరణ పరిస్థితులపై రైతులకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామసభలు, రైతు వేదికల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

# మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికుల నిరసన

## కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేయాలి: ఏఐటీయూసీ

మెట్‌పల్లి, ఆగస్టు 10, ప్రజా జ్యోతి : మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు నిరసన చేపట్టారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని, తగ్గించిన వేతనాలను వెంటనే పునరు



ద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండీ ఉస్మాన్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో ఎంఎస్ నంబర్ 14 ప్రకారం వేతనాలు అమలు చేయాలని కోరారు. 11-06-2021న జారీ చేసిన జీవో ప్రకారం గత ప్రభుత్వం అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.16,600, స్కిల్డ్ కార్మికులకు రూ.20,500, హైస్కిల్డ్ కార్మికులకు రూ.22,750 వేతనాలు నిర్ణయించిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వేతనాలను తగ్గిస్తూ 12-07-2026న జీవో ఆర్టీ నంబర్ 1181ను విడుదల చేసిందని ఆరోపించారు. ఏ కార్మిక చట్టంలోనూ కార్మికుల వేతనాలను తగ్గించే నిబంధన లేదని, వెంటనే జీవో ఆర్టీ నంబర్ 1181ను ఉపసంహరించుకొని తగ్గించిన వేతనాలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరికీ శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షులు లంక శ్రీకాంత్, జిల్లా అధ్యక్షులు బర్ల లక్ష్మణ్, యమ నరసయ్య, మధురమ్మ, లక్ష్మి , బర్ల నరసయ్య, వాజిద్, గంగాధర్, నిజాం తదితర కార్మికులు పాల్గొన్నారు.

# కరాటే బెల్ట్ పరీక్షలో విద్యార్థులకు బెల్టులు, ప్రశంసా పత్రాలు

## ఆత్మరక్షణ విద్యతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది: కరాటే శిక్షకుడు ప్రవీణ్ కుమార్

మెట్‌పల్లి, ఆగస్టు 10, ప్రజా జ్యోతి : ఇటీవల నిర్వహించిన కరాటే బెల్ట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన మెట్‌పల్లి విద్యార్థులకు బెల్టులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. జె.కె.ఎ. ఇండియా షోటోకాన్ కరాటే అసోసియేషన్, జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఆధ్వర్యంలో ఆదివారం కుబ్సింగ్ కుంట పార్కులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన కరాటే శిక్షకులు ఎస్. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బెల్ట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 34 మంది



విద్యార్థులకు బెల్టులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే కరాటేలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, ఉత్తమ ప్రతిభ పురస్కారాలను ప్రవీణ్ కుమార్ మాస్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. కరాటే, ఆత్మరక్షణ వంటి విద్యలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంతో పాటు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు, యువత ఆసక్తితో కరాటేను నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కరాటే శిక్షకులు నవీన్ మాస్టర్, కరాటే మాస్టర్లు నిఖిల్, శ్రేయాన్ కార్తిక్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ హోదాపై మతం ముద్ర వద్దు

## చింతల్లపల్లిలో దళితుల రాస్తారోకో

కొడిమ్యాల, ఆగస్ట్ 10,(ప్రజాజ్యోతి): మతం ఆధారంగా ఎస్సీల హక్కులను పరిమితం చేయొద్దని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని చింతల్లపల్లి గ్రామంలో దళితులు రాస్తారోకో చేపట్టారు. మతం మారినంత మాత్రాన ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తులను ఎస్సీ జాబితా నుంచి తొలగించడం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు విరుద్ధమని వారు పేర్కొన్నారు. ఎస్సీలు ఏ మతాన్ని ఆచరించినా వారి సామాజిక హోదా, హక్కులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 17, 21, 25 ప్రకారం అందరికీ



సమాన హక్కులు, స్వేచ్ఛ కల్పించాలని షెడ్యూల్డ్ క్యాస్ట్ ఆర్డర్–1950లోని మతపరమైన నిబంధనలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఎస్సీలు బానిసలు కాదని, ద్వితీయ శ్రేణి పౌరులు అంతకన్నా కాదని స్పష్టం చేశారు. మతంతో సంబంధం లేకుండా ఎస్సీలకు సమాన హక్కులు కల్పించే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

# వెయ్యి ఈత మొక్కలు నాటిన ఎక్సైజ్ శాఖ

కొడిమ్యాల,ఆగస్ట్ 10,(ప్రజాజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కోనాపూర్,తిర్మలాపూర్ గ్రామాల్లో సోమవారం వెయ్యి ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.



నాటిన ఈత మొక్కలకు నీరు పోసి సంరక్షించే బాధ్యతను గౌడ సంఘం సభ్యులు తీసుకోవాలని కోరారు. స్థానిక జాతుల మొక్కలను విస్తృతంగా పెంచడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడడంతో పాటు భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది నారాయణ, ప్రవీణ్, గౌడ సంఘం అధ్యక్షుడు పరిసరాములు గౌడ్, తిర్మలాపూర్ సర్పంచ్ సైదల అంజయ్య, నాయకులు బుర్ర సంతోష్‌గౌడ్, శేఖర్, సంతోష్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని బి జే పి ధర్నా

ఇల్లంతకుంట ఆగస్టు 10(ప్రజా జ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని



పెద్దలింగపూర్ నుండి అనంతగిరి పోచమ్మ ఆలయం వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రోజు బి జే పి మండలశాక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రోడ్డు నిర్మాణం చేస్తామని హామీలు ఇచ్చి ప్రభుత్వం లోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా. నిర్మించలేదని పోచమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే హామీ ఇచ్చి తుంగలో తొక్కారని అన్నారు. ప్రస్తుత వర్షాలకు రోడ్డు అధ్వానంగా తయారయిందని రోడ్డు ఇబ్బంది కరంగా మరిందన్నారు. ఆర్టీసీ బస్సు ప్రయాణికులు విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆలయాభివృద్ధికి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు అండగా లచ్చయ్య మండల కార్యవర్గ సభ్యులు పయ్యావుల బాలయ్య, కునవేని అనిల్, పలుమారి రవి, సీనియర్ నాయకులు అమ్ముల అశోక్, రెడ్డి ముత్యం రెడ్డి నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు

# ఇల్లందకుంటలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

## దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటిన బీజేపీ శ్రేణులు

ఇల్లందకుంట, ఆగస్టు 10 (ప్రజాజ్యోతి): దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఇల్లందకుంట మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ



మండల ప్రధాన కార్యదర్శి గుత్తికొండ రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీలో 'భారత్ మాతాకీ జై', 'వందే మాతరం' అంటూ దేశభక్తి నినాదాలు మార్మోగాయి. జాతీయ జెండాలను చేతబూని బీజేపీ శ్రేణులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తికొండ రాంబాబు, మట్ట పవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావనను చాటాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. దేశ ఐక్యత, అఖండత, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లేలా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పుల రమేష్, ఇంగ్లే ప్రభాకర్, మట్ట పవన్ రెడ్డి, ఏనుగు సురేందర్ రెడ్డి, తుపాకుల సతీష్, ఉప్పు దుర్గయ్య, సోమిడి సురేందర్, చింతల ఐలయ్య, సామల కర్ణాకర్ రెడ్డి, జిల్లెల శ్రీపాల్ రెడ్డి, మద్దూరి మల్లేష్, అసోలా సుధాకర్, చదువు సాయి రెడ్డి, చిట్ల శ్రీనివాస్, మురహరి గోపాల్, రావుల అశోక్, ఎలేవెని శ్రీధర్, పిట్టల రాజు, బోయిని శివకృష్ణ, చిలుక రాజు తదితరులు పాల్గొన్నారు

# రాగినేడులో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' యాత్ర జెండా ఆవిష్కరణ

పెద్దపల్లి ప్రతినిధి ఆగస్టు 10 ప్రజా జ్యోతి: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు వేల్పుల



రమేష్, మండల కన్వీనర్ ఇల్లందు అంజి గారి ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా రాగినేడు గ్రామంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి మేకల విజయ్ కుమార్ రిటైర్డ్ ఆర్మీ గారు బిజెపి సీనియర్ పొన్నం మధురయ్య పాల్గొని జెండా ఆవిష్కరణ చేయడం జరిగినది బిజెపి స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాల మధ్య భారీ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ జాతీయ జెండా దేశభక్తిని పెంపొందించే దిశగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు తంగేడ రాజేశ్వర్ రావు, తాళ్ల లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి మామిడి ఉమేష్, ముంజ రాజేంద్రప్రసాద్, పడాల నరసయ్య, చింతపండు స్వామి, దండు చంద్రయ్య, గుంటుకు సది, మేడగొని శివయ్య, యువ మోర్చా అధ్యక్షులు రెడ్ల వేణు, ముత్యం సాగర్, ముసారి రవి బిజెపి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగినది

# ఉపసర్పంచ్ ల ఫోరం జిల్లా కార్యదర్శిగా జానా వెంకటేష్

కోరుట్ల రూరల్, ఆగస్టు 10 (ప్రజా జ్యోతి) జిల్లా కార్యవర్గ విస్తరణలో భాగంగా సోమవారం రోజున ఉప సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తిక్, జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో కోరుట్ల మండలంలోని మోహన్ రావు



పేట గ్రామ ఉపసర్పంచ్ జానా వెంకటేష్ ఉప సర్పంచ్ల ఫోరం జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా పైన నమ్మకంతో ఇట్టి బాధ్యతను తనకు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజా సేవే లక్ష్యంగా ప్రజాసేవలో తాను ఎప్పుడు ముందుంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గం, వివిధ గ్రామాల ఉపసర్పంచ్ లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొండాపూర్ లో విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

మేడిపల్లి: ఆగస్టు 10 ప్రజా జ్యోతి:



మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన తోపారపు శంకర్ తండ్రి చిన్ననర్సయ్యకు చెందిన ఆవు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. నిమ్మలొని బిల్క్ వద్ద ఆవు మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలినట్లు గ్రామస్థులు తెలిపారు. సుమారు రూ.80 వేల విలువైన ఆవు మృతి చెందడంతో రైతు తీవ్రంగా నష్టపోయాడు. ప్రభుత్వం స్పందించి బాధిత రైతుకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

# అర్హులందరికీ ఇళ్లు ఇప్పిస్తా

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల,ఆగస్ట్ 10,(ప్రజాజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఔదరి లక్ష్మి కి సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన ఇందిరమ్మ ఇంటి మంజూరును



ప్రత్యేక చొరవతో పూర్తి చేయించి సోమవారం ఆమె ఇంటికి వెళ్లి ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొదటి విడతలో మండలానికి 450 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. రెండో విడతలో మరిన్ని ఇళ్లు త్వరలో మంజూరు చేస్తామని, రానున్న మూడేళ్లలో చొప్పదండి నియోజకవర్గాన్ని గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం జీవన్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోగూరి నాగభూషణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చిలువేరి నారాయణగౌడ్, ఏయంసి వైస్ చైర్మన్ కొండూరి రాజేష్, సర్పంచ్ నేరెళ్ల మహేష్, నాయకులు ముత్యం శంకర్,గోల్కొండ రాజు, చింటు, పర్లపల్లి ప్రసాద్, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, రాపర్తి నర్సింగరావు, గుర్రం ప్రవీణ్, కవ్వం మధు, సోమ వెంకి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కొడిమ్యాల,ఆగస్ట్ 10,(ప్రజాజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నిమ్మల రాజిరెడ్డి, మారు రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు లింగాల అజయ్ తండ్రి లింగాల దుర్గయ్య ఇటీవల మృతి చెందారు. విషయం



తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం వారి కుటుంబాలను పరామర్శించడం జరిగింది.ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట వివిధ గ్రామాల సర్పంచులు, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

# కడుపునొప్పి బాధతో యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఆగస్టు 10, (ప్రజాజ్యోతి): కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తీగలగుట్టపల్లి చంద్రాపూర్ కాలనీ చెందిన గొర్రె మధు (35) కడుపునొప్పి బాధతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.సోమవారం ఉదయం అన్నతో కలిసి కూలి పనికి వెళ్లిన మధు ఆరోగ్యం బాగాలేదని చెప్పి ఇంటికి తిరిగి వచ్చాడు. మధ్యాహ్నం ఇంటి పక్కన నివసించే వారు తలుపు నెట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు.మధు కొంతకాలంగా మద్యానికి బానిసై, కడుపునొప్పితో చికిత్స పొందుతున్నప్పటికీ నొప్పి తగ్గకపోవడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు అతని అన్న మనోహర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.



# 12వ వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని సింగరేణిలో ధర్నా

**సత్తుపల్లి ఆగస్టు10(ప్రజా జ్యోతి)** సింగరేణి సత్తుపల్లి స్థానిక పట్టణం సింగరేణి లో 12 వేజ్ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని జే.వి.ఆర్ ఓసి, కిష్టారం ఓసి,జే.వి.ఆర్ సి.హెచ్.పి సింగరేణి ఉద్యోగులందరూ ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, సింగరేణిలో ఉన్న జాతీయ సంఘాల పిలుపుమేరకు సింగరేణి వ్యాప్తంగా చేసే ధర్నా కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి జనరల్ మేనేజర్





కార్యాలయం ముందు ఐ.ఎన్.టి.యు.సి, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, సిఐటియు,టీబీజీకేఎస్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించి సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కు సత్తుపల్లి జనరల్ మేనేజర్ సరికొండ వెంకటాచారి ద్వారా వినతి పత్రం అందించారు. సత్తుపల్లి సింగరేణి ఐక్య కార్మిక సంఘాల జే.ఏ.సీ నాయకులు తీగల క్రాంతి కుమార్,కోటేశ్వరరావు, సముద్రాల సుధాకర్,దార భీమయ్య ,ఆంజనేయులు, అస్గర్ ఖాన్, సంపత్, గిడ్డయ్య లు మాట్లాడుతూ కోల్ ఇండియా పరిధిలో ఉండే అన్ని బొగ్గు పరిశ్రమల్లో ఉద్యోగుల జీతభత్యాల పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం 12వ వేజ్ బోర్డు ఏర్పాటుకు కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 11 వేజ్ బోర్డ్ 2026 జూన్ నెల నాటికి ముగిసిందని, 11 వేజ్ బోర్డుపై ఆరు నెలల ముందే కమిటీని ఏర్పాటు చేసినటువంటి కేంద్ర ప్రభుత్వం 12 వ వేజ్ బోర్డ్ సమయం దాటినప్పటికీ ఎందుకు కమిటీని ఏర్పాటు చేయట్లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు 12 వ వేజ్ బోర్డుపై కమిటీని ఏర్పాటు చేయకుండా కలకత్తాలో జరిగిన సమావేశంలో కేవలం నాలుగు లేబర్ కోడ్ అమలుపై మాత్రమే ప్రస్తావన చేశారని పేర్కొన్నారు. సెప్టెంబర్ 12 వ తేదీన రాంచీ లో జరిగే సదస్సు లో వేజ్ బోర్డు విషయంపై స్పష్టత రాకుంటే కోల్ ఇండియా వ్యాప్తంగా కార్మిక వర్గం అంతా సమ్మె చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఐక్య కార్యముక సంఘాల నాయకులు,కార్యకర్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో మిస్ట్ విద్యార్థుల ప్రతిభ

**సత్తుపల్లి ఆగస్ట్10(ప్రజా జ్యోతి)** 2026 విద్యా సంవత్సరంలో గత జూన్ నెలలో మదర్ తెరిసా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అటానమస్ హోదాలో నిర్వహించిన, బీటెక్ ద్వితీయ సంవత్సరం రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలను సాధించారని,ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని. హరికృష్ణ తెలిపినారు. బ్రాంచులు వారీగా విద్యార్థులు సాధించిన సెమిస్టర్ గ్రేడ్ పాయింట్ యావరేజ్ (ఎస్. జి. పి .ఏ) ను ప్రిన్సిపల్ ఈ క్రింది విధంగా వివరించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల వివరములు బ్రాంచ్లు వారీగా.సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్ నుండి పులిందల శృతి 8.8, సయ్యద్. రహీల్ 8.04 ఎస్ జి పి ఏ లు సాధించారు. ఈ. ఈ. ఈ బ్రాంచ్ నుండిమహమ్మద్. సా్రమాహ మహేక్ 10.00 ,నిమ్మల. లింగేశ్వరి 9.9 ,అలవల. భావన శ్రీ 9.5. ఎస్ జి పి ఏ లు సాధించారు. మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్ నుండి. గొట్టపు.లోకేశ్వర సాయి నంద చిన్మయి 7.3, నల్లి. లోకేష్ 7.00 ఎస్ జి పి ఏ లు సాధించారు. ఈ. సి. ఈ బ్రాంచ్ నుండి. నాగుల.రమ్య 9.35, వేముల. హేమనీ 9.35, కోట. మల్లేశ్వరి 9.2, మాయర.నాగ జ్యోత్స్న 9.2, షేక్. ఇజాజ్ 9.2, సున్నం. అమృత వర్షిని 9.2, తోర్లపాటి.జ్యోతి 9.15 ఎస్ జి పి ఏ లు



సాధించారు. సిఎస్సి బ్రాంచ్ నుండి. అంబటి. సత్య శ్రీ 9.15, మేకల.ప్రవళిక 8.95, నందికొల. హర్షిత 8.95, భూక్య బాలాజీ 8.8 ,పూసల. సాయి హర్షిత 8.8, షేక్. అయుబ్ 8.8, ఎస్ జి పి ఏ లు సాధించారు. ఏఐ అండ్ ఎంఎల్ బ్రాంచ్ నుండి. పగిళ్ల. పల్లవి 9.15 ,సురనేని. అఖిల 9.00 షేక్. సల్మా 8.9 ఎస్ జి పిఏ లో సాధించారు. పైన పేర్కొన్న ఫలితాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం నుండి 8 గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులు: 02,ఈ. ఈ .ఈ విభాగం నుండి 10 గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులు: 01, 9 గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులు:03 8 గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులు:01 ఈ.సీ.ఈ విభాగం నుండి 9 గ్రేడ్ పాయింట్ సాధించిన విద్యార్థులు: 11, 8 గ్రేడ్ పాయింట్ సాధించిన విద్యార్థులు: 18.సిఎస్సి విభాగం నుండి 9 గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులు: 01, 8 గ్రేడ్ పాయింట్ సాధించిన విద్యార్థులు :29ఏఐఎంఎల్ విభాగం నుండి 9 గ్రేడ్ పాయింట్ సాధించిన విద్యార్థులు: 02 , 8 గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులు :20అన్ని విభాగాల నుండి 10 గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థుల సంఖ్య: 01, 9 గ్రేడ్ పాయింట్ సాధించిన విద్యార్థుల సంఖ్య: 17 , 8 గ్రేడ్ పాయింట్ సాధించిన విద్యార్థుల సంఖ్య :70ఈ అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ మదర్ తెరిసా విద్యాసంస్థల ప్రెసిడెంట్ చలసాని. సాంబశివరావు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. ఉదయ్ కిరణ్ భార్గవ్, ఐ క్యు ఎ సి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. వి .రామచంద్ర రావు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ యల్. సాయి ఇంద్రసేనారెడ్డి, వివిధ విభాగాలు అధిపతులు, అధ్యాపకులు మరియు బోధనేతర సిబ్బంది అభినందించారు.

# జైల్ భరో కార్యక్రమం విజయవంతం

లింగాల ఎక్స్ రోడ్ నందు

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైల్ భరో కార్యక్రమం విజయవంతం

సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో

**కామేపల్లి ప్రజాజ్యోతి ఆగస్టు 10** కామేపల్లి మండలం లోని లింగాల క్రాస్ రోడ్ సెంటర్ నందు జైల్ బరో కార్యక్రమం విజయవంతం సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన రాస్తారోకో కార్యక్రమంలో రైతు సంఘం వైరా డివిజన్ కార్యదర్శి దుగ్గి కృష్ణ సిఐటియు మండల కన్వీనర్ శ్రీను పాల్గొని మాట్లాడతు దేశంలో 29 చట్టాలను రూపకల్పన అయి ఉంటే ఆ చట్టాలను మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తొలగించి నాలుగు లేబర్ కోడ్ గా మార్చి వాటిని నల్ల





చట్టాలుగా మార్చి కార్మికులను కర్షకులకు రైతులకు ముంచే కోడుగా మార్చి సమస్త ప్రజా సమస్యలను నట్టేట ముంచిండు అందుకని కార్మికుల సంఘాల నాయకత్వం గుర్తిందియ ఉద్యమ స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలియజేయడం జరిగింది ఈరోజు దేశవ్యాప్తంగా క్విట్ ఇండియా ఉద్యమం జైల్ బరో కార్యక్రమం చేయడం జరిగింది. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లో గాంధీ పేరు తీసేయడం భారత్ రాంజీ అనే పేరు మార్చటానికి స్వామి నాథన్ కమిషన్ సిఫారసులను కనీసం పట్టించుకోనటువంటి మోడీ మొండి వైఖరి విధానాలకు వ్యతిరేకంగా ఈరోజు ఈ జైల్ భరో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాధావత్ శ్రీను రైతు సంఘం వైరా డివిజన్ కార్యదర్శి దుగ్గి కృష్ణ సిపిఎం మండల కార్యదర్శి అంబటి శ్రీనివాస్ రెడ్డి ఆశ వర్కర్ మండల అధ్యక్ష కార్యదర్శులు కుర్ర నీల హాత్కర్ బుజ్జి అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు పాపారాణి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అమాంచి అంజయ్య బిల్డింగ్ వర్కర్స్ మండల నాయకులు కొత్తపల్లి ఉపేందర్ బుక్య రమణ రైతు సంఘం మండల అధ్యక్షులు రాయల సత్యనారాయణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఒప్పుదల వెంకన్న కార్మిక నాయకులు ధరావత్ కోటయ్య ఎస్కే ఫరీద్ వీరభద్రం భాష ఉపేందర్ నరేష్ లక్ష్మీనారాయణ నాగయ్య స్వరూప ప్రమీల అన్ని రంగాల కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన

# రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

**నేలకొండపల్లి, ఆగస్టు 10 ప్రజా జ్యోతి:** ఇటీవల మండ్రాజుపల్లి గ్రామంలో అస్వస్థతకు గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు నెల్లూరి భద్రయ్యను సోమవారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పరామర్శించారు. అనంతరం, నేలకొండపల్లి పట్టణంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు గుడిబోయిన సైదులు చిత్ర పటానికి ఆయన పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే, గ్రామంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మోర పద్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజని,





నాయకులు సోమనబోయిన సాయినవీన్, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణకు బ్లీచింగ్ చెల్లిస్తున్న ముచ్చర్ల సర్పంచ్ జాటోత్ లూసి

**కామేపల్లి ప్రజాజ్యోతి ఆగస్టు 10** కామేపల్లి మండలంలోని ముచ్చర్ల గ్రామం నందు ఈరోజు దోమల నివారణకై గ్రామపంచాయతీ సిబ్బందిచే రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లించడం జరిగింది. రోడ్లకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్లను ముళ్లపదలను తొలగించడం జరిగింది విద్యుత్తు లైనుకు అడ్డంగా వచ్చిన చెట్లను తొలగించడం ఈ కార్యక్రమంలో ముచ్చర్ల సర్పంచ్ మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొనడం జరిగింది.



## మండలంలో పలు కుటుంబాలను

# పరామర్శించిన జిల్లా బిజెపి నాయకులు

**చింతకాని ఆగస్టు 10 ప్రజాజ్యోతి** :మండలం కోమట్ల గూడెం గ్రామానికి చెందిన ఆవులూరి ప్రతాపరెడ్డి మరియు పొద్దుటూరు గ్రామానికి చెందిన డాక్టర్ కట్ట వెంకటేశ్వర్లు గారు ఇటీవల కాలంలో అనారోగ్యం చేత మరణించడం జరిగింది. ఈరోజు వారి కుటుంబాలని పరామర్శించి వారి చిత్రపటాలకి పూల దండేసి సంఘీభావం తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా బిజెపి అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు,మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు,జిల్లా నాయకులు మరియు చింతకాని బీజేపీ మండల అధ్యక్షులు కొండా గోపి, కోరిపల్లి శ్రీను, చెన్నూరి నాగచారి,కొండా వెంకన్న, వేముల ఎల్లయ్య,ఉమ్మినేని లక్ష్మణరావు,రాయల వెంకటేశ్వర్లు,పెద్దిరాజు, కోయిన్ని నరసింహారావు తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# గుప్పుమంటున్న గుడుంబా

– నేలకొండపల్లి మండలంలో యథేచ్ఛగా నాటుసారా విక్రయాలు – ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం – ప్రజల ప్రాణాలతో చెలగాటం

**నేలకొండపల్లి, ఆగస్టు 10 ప్రజా జ్యోతి:** ప్రభుత్వం గుడుంబాపై నిషేధం విధించి కఠిన చర్యలు తీసుకుంటున్నామని ప్రకటనలు చేస్తున్నా, నేలకొండపల్లి మండలంలో మాత్రం నాటుసారా వ్యాపారం రెచ్చిపోతోంది. ఎక్సైజ్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా గుడుంబా తయారీ, విక్రయాలు మూడుపూలు ఆరుకాయలుగా సాగుతున్నాయి.

**ఇంటింటికి సరఫరా**

శంకర్ గిరి తండా నుండి, రాజేశ్వరపురం, చెన్నారంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో గుడుంబా వ్యాపారం విస్తరించింది. టూ-వీలర్లపై సీసాలతో నింపి ఇంటింటికి సరఫరా చేస్తున్నారు. కస్టమర్ ఫోన్ చేస్తే 10 నిమిషాల్లో ఇంటి దగ్గరికి డెలివరీ ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాత్రి వేళల్లో ఈ వ్యాపారం మరింత జోరుగా సాగుతోంది.

**ప్రాణాంతక కెమికల్స్ – కుటుంబాలు రోడ్డున**

పక్కా పద్ధతులు లేకుండా వివిధ రకాల కెమికల్స్, మందులు కలిపి నాటుసారాలిను తయారు చేస్తున్నారు. చౌకగా దొరుకుతుందనే కారణంతో కూలీలు, రోజువారీ కార్మికులు దీనికి బానిసలవుతున్నారు. నాటుసారా తాగి ఇప్పటికే అనేకమంది తీవ్ర అనారోగ్యాలకు గురై ఆస్పత్రుల పాలయ్యారు. కొన్ని కుటుంబాల్లో భర్తలు తాగి కొట్టడం, డబ్బులు దుర్వినియోగం చేయడంతో ఇళ్లు లూటీ అయిన ఘటనలు కూడా ఉన్నాయి. గ్రామాల్లో కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోతున్నాయి.

**ఎక్సైజ్ శాఖ నిద్ర**

ప్రభుత్వం ఒకపక్క గుడుంబాపై ఉక్కుపాదం మోపుతామని చెబుతుండగా, మరోపక్క ఎక్సైజ్ డిపార్ట్మెంట్ మాత్రం నిద్రపోతున్నట్లు కనిపిస్తోంది. ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడు లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, సిబ్బందికి ముడుపులు అందుతున్నాయనే ప్రచారం కూడా జరుగుతోంది.

**ప్రజల డిమాండ్**

ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. గుడుంబా తయారు చేసేవారిపై, సరఫరా చేసేవారిపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరిచి చర్యలు తీసుకుంటారా? లేక ఇలాగే గుడుంబా మాఫియా రెచ్చిపోనిస్తారా అనేది చూడాలి.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరుబాట

– కల్లూరులో విజయవంతమైన జైల్ భరో.. ఆందోళనకారుల అరెస్టు

**కల్లూరు ఆగస్టు 10: ప్రజాజ్యోతి** క్విట్ ఇండియా ఉద్యమాస్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక రైతు వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, అఖిల భారత రైతు సంఘం, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కల్లూరులో నిర్వహించిన జైల్ భరో కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు మహిళలు యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీగా ముందుకు సాగుతున్న ప్రజా సంఘాల నాయకులు రైతులు కార్మికులు వ్యవసాయ కార్మికులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి మాట్లాడుతూ ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాలను తగ్గించాలని నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించాలని నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులపై దాడులను నిలిపివేయడంతో పాటు రైతులు వ్యవసాయ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని నాయకులు డిమాండ్ చేశారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనులు విస్తరించి వేతనాలు పెంచాలని కోరారు పేదలకు ఇళ్ల స్థలాలు గృహ నిర్మాణానికి తగిన ఆర్థిక సహాయం అందించాలని ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలనే డిమాండ్ చేశారు. విద్యా వైద్యం రంగాలను కాపాడడం తో పాటు సామాజిక భద్రత పథకాలను విస్తరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పోరాటం ఎక్కడితో ఆగదని కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు తన్నీరు కృష్ణార్జున రావు, మండల అధ్యక్షులు దోమతోటి పుల్లయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి ముదిగొండ అంజయ్య అధ్యక్షులు సామినేని హనుమంతరావు, ఉపాధ్యక్షులు మాదాల వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు మనమంటి వెంకటి, ఆశ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి గద్దల సమాధానం, గొర్రెల మేకల సంఘం కార్యదర్శి బొట్టు నరసింహారావు తో సహా ప్రజా సంఘాల నాయకులు చింతలపూడి పురుషోత్తం, రాజులపాటి రాజారాములు, వల్ల బోయిన రామనాథం, తిగుళ్ల బాబు, అల్లి రాజేష్, వినుకొండ రాంబాబు, పాలకుర్తి వసంత, అమర్లపూడి నిర్మల, తదితరులు పాల్గొన్నారు.







# అంతర్రాష్ట్ర పోలీస్ అధికారుల సమన్వయ సమావేశం

**మధిర: ప్రజా జ్యోతి.** ఖమ్మం సిపి సునీల్ దత్ ఐపిఎస్ ఆదేశాల మేరకు సోమవారం మధిర పట్టణ పోలీస్ స్టేషన్ లో తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల పోలీస్ అధికారుల సమావేశం జరిగింది ఇందులో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ఇసుక అక్రమ రవాణా మరియు జూదం/గేమింగ్ కార్యకలాపాల అరికట్టేందుకు ఇరు రాష్ట్రాల పోలీస్ అధికారుల సమన్వయం గురించి చర్చించటం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా పోలీసు అధికారులు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా పోలీసు అధికారులు పాల్గొని, ఇరు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ఎదురవుతున్న వివిధ సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణా, దొంగతనాలు, జూదం మరియు అక్రమ గేమింగ్ కార్యకలాపాలు, నేరస్తుల కదలికలు, అంతర్రాష్ట్ర నేరాలకు సంబంధించిన కేసులు తదితర అంశాలపై ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పరం సమాచారాన్ని పంచుకోవాలని నిర్ణయించారు. సరిహద్దు ప్రాంతాల్లో నేరాలకు పాల్పడే వ్యక్తులు, గతంలో నేరాలకు సంబంధించిన వ్యక్తులు, దొంగతనాలకు పాల్పడే నేరస్తులు, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులు మరియు జూదం/గేమింగ్ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారాన్ని పరస్పరం షేర్ చేసుకుంటూ, సమన్వయంతో నిఘా మరియు తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే సరిహద్దు ప్రాంతాలను ఆసరాగా చేసుకొని నేరస్తులు ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి వెళ్లి నేరాలకు పాల్పడకుండా ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పర సహకారంతో చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.



అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెంచడంతో పాటు, అక్రమ రవాణా మరియు జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, నేరాలను నియంత్రిస్తూ ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు ఇరు రాష్ట్రాల పోలీసులు నిరంతరం పరస్పర సమాచార మార్పిడి చేసుకుంటూ సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో వైరా ఏసిపి సారంగపాణి మైలవరం ఏసిపి రామచంద్ర రావు మధిర రూరల్ సీఐ డి.మధు, తిరువూరు సీఐ కె.గిరి బాబు, మధిర టౌన్ ఇన్స్పెక్టర్ దోమల రమేష్, వైరా సీఐ వైవీ ప్రసాద్, వైరా సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్ఐలు మరియు మైలవరం సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు. ఇరు రాష్ట్రాల పోలీసుల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకొని, సరిహద్దు ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## హర్ ఘర్ తిరంగాలో ఉత్సాహంగా పాల్గొనాలి

మొదటిపేజీ తరువాయి..

2022 నుంచి ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా' నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈసారీ జాతీయ జెండాను ఎగురవేసి.. వికసిత భారత్‌కు మన ఉమ్మడి కట్టుబాటును చాటుదామని మోదీ కోరారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నవారు కనబరిచిన ధైర్యసాహసాలు భారతీయుల్లో ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ గుర్తుండిపోతాయని మోదీ కొనియాడారు. 1942 ఆగస్టు 9న మహాత్మా గాంధీ నేతృత్వంలో మొదలైన ఉద్యమం మన దేశ స్వాతంత్ర్య పోరాటానికి నిర్ణయాత్మక ప్రేరణను ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఇదిలావుంటే తమ రాష్ట్రంలో వందేమాతర గీతాన్ని పూర్తిగా పాడబోమని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి కె.మురళీధరన్, కాంగ్రెస్ ఎంపీ రాజ్‌మోహన్ ఉ



న్నిథాన్ స్పష్టం చేశారు. గతంలో మాదిరిగానే గీతంలోని మొదటి రెండు చరణాలనే పాడతామని తెలిపారు. 'హర్ ఘర్ తిరంగా'తో ప్రతి ఇంటా దేశభక్తి చాటాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పిలుపునిచ్చారు. సోమవారం తన ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ..14న ట్యాంక్ బండ్ దగ్గర భారీ 'తిరంగా యాత్ర'ను నిర్వహిస్తున్నామని.. పార్టీలకతీతంగా ప్రజలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. రాబోయే ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాంచందర్ రావు అన్నారు. అందులో భాగంగానే ఈరోజు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో పాల్గొని యువతతో కలిసి తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసినట్లు తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఇళ్లపై జెండాలు ఎగురవేయాలని కోరారు. లాగే ఆగస్టు 14న హైదరాబాద్ ట్యాంక్ బండ్ దగ్గర చాలా పెద్ద ఎత్తున 'తిరంగా యాత్ర' నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వెల్లడించారు. ఈ యాత్ర ఏ ఒక్క పార్టీకో, రాజకీయాలకో సంబంధించింది కాదని... భారతదేశ ఐక్యతను, శక్తిని ప్రపంచానికి చాటిచెప్పడానికి, 'వికసిత భారత్' సంకల్పంతో చేపడుతున్న యాత్ర అని చెప్పారు. హైదరాబాద్ ప్రజలందరూ కుల, మత, రాజకీయ విభేదాలను పక్కనబెట్టి, దేశం కోసం ఈ తిరంగా యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

## ఢిల్లీ కేంద్రంగా సైబర్ మోసాలు

### అమాయక ప్రజలను మోసం చేస్తున్న ముఠా గుట్టు రట్టు చేసిన సైబర్ సెక్యూరిటీ పోలీసులు

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ప్రజాజ్యోతి): తెలుగు మాట్లాడే మహిళలను టెలీకాలర్లుగా నియమించుకుని, తెలంగాణ లోని అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని భారీగా సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ముఠా గుట్టును తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రట్టు చేసింది. ఢిల్లీలోని శివ మార్కెట్‌లో నిర్వహిస్తున్న మూడు మోసపూరిత కాల్ సెంటర్లపై సమన్వయంతో దాడులు నిర్వహించిన అధికారులు, 21 మంది మహిళా టెలీకాలర్లు , ఒక పురుష బ్యాంకు ఖాతాదారుడిని అదుపులోకి తీసుకున్నారు. లలిత్ సింగ్, కుల్దీప్ సింగ్, అనిల్ అనే ముగ్గురు ప్రధాన నిర్వాహకుల నేతృత్వంలో వేర్వేరు బృందాలుగా ఈ కాల్ సెంటర్లు గత ఏడాదిన్నర కాలంగా పనిచేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. అయితే ఈ ప్రధాన నిర్వాహకులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. మోసగాళ్లు ప్రత్యేకంగా 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న, తెలుగు మాట్లాడే మహిళలను టెలీకాలర్లుగా నియమించుకున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల, హైదరాబాద్‌లోని సైదాబాద్, బోరబండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన మహిళలు ఈ కాల్ సెంటర్లలో పనిచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తమ సొంత భాషలో అనర్గళంగా మాట్లాడటంతో బాధితులు సులభంగా వీరిని నమ్మేవారు. తాము బజాజ్ ÷నాన్స్ ప్రతినిధులమని చెప్పి, ఆకర్షణీయమైన రుణ ఆఫర్లు ఉన్నాయంటూ వల వేసేవారు. రుణం మంజూరు కావాలంటే ప్రాసెసింగ్ ఫీజు, వెరిఫికేషన్, డాక్యుమెంటేషన్ ఛార్జీలు, బీమా ప్రీమియంల పేరుతో విడతలవారీగా డబ్బులు వసూలు చేసి, ఆ తర్వాత సంభాషణలు నిలిపివేసేవారు.

తాము మోసపోయామని గ్రహించిన బాధితులు డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరితే నిందితులు దారుణ బెదిరింపులకు దిగేవారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, వ్యక్తిగత సమాచారాన్ని, గుర్తింపు పత్రాలను దుర్వినియోగం చేసి పరువు తీస్తామని హెచ్చరిస్తూ భయభ్రాంతులకు గురిచేసేవారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా అధికారులు 23 మొబైల్ ఫోన్లు, రెండు బ్యాంకు పాస్‌బుక్కులను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ వ్యాప్తంగా నమోదైన 22 సైబర్ నేర కేసులతో ఈ ముఠాకు సంబంధాలు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారుల కోసం పోలీసులు గాలింపు చర్యలు వేగవంతం చేశారు.

## అమిత్ షా ఎందుకు ముఖం చాటేస్తున్నారు: ఎంపి వంశీకృష్ణ

న్యూఢిల్లీ,ఆగస్ట్10(ప్రజాజ్యోతి): పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై చర్చించేందుకు మోదీ సర్కార్ ఎందుకు వెనకంజ వేస్తోందని, సభకు రావడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎందుకు భయపడుతున్నారని అంటూ కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఎంపీ వంశీకృష్ణ.. కేంద్రం అనుసరిస్తున్న తీరుపై మండిపడ్డారు. చర్చించి పాలన చేయడం కంటే, నియంత్రించడం, శిక్షించడానికే మోదీ సర్కార్ ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. గూగుల్, సోషల్ మీడియా వేదికగా నిరసనలు తెలుపుతున్న యువత (జెన్-జీ) పై ఢిల్లీలో జరిగిన లాఠీచార్జి ఘటనపై అమిత్ షా వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

జూలై 20వ తేదీన అసలు ఏం జరిగిందో దేశ ప్రజలకు వివరించాలని, యువతపై దాడులకు అమిత్ షా క్షమాపణ చెప్పాలని వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ, కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు.

## కొంపముంచిన రైతు అతి జాగ్రత్త

### పొలంలో దాచిన నోట్లకట్టలకు చెద పనికిరాకుండా పోయిన 5లక్షల నగదు

జైపూర్,ఆగస్ట్10(ప్రజాజ్యోతి): రాజస్థాన్‌లో తాజాగా షాకింగ్ ఘటన వెలుగు చూసింది. ఇంట్లో వాళ్లకు తెలియకుండా డబ్బును దాచే ప్రయత్నంలో ఓ రైతు భారీ నష్టాన్ని మూటగట్టుకున్నాడు. ఇంటి నిర్మాణం కోసమని దాచిన సొమ్ము మట్టిపాలు కావడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో కూరుకుపోయాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, పచ్‌పాద్రాకు చెందిన రైతు మంగీలాల్ మేఘ్వాల్ ఏడాది క్రితం కొంత జాగాను విక్రయించగా రూ.5 లక్షలు వచ్చాయి. ఈ డబ్బుతో చిన్న ఇంటిని నిర్మించుకోవాలని మేఘ్వాల్ భావించాడు.

# రైతుకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

### రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు ఖర్చు చేస్తున్నాం: మంత్రి పొంగులేటి

హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10, (ప్రజా జ్యోతి): రైతును రాజుగా చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర



సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతగా అనుకూలంగా లేకపోయినా రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆత్మ సౌజన్యంతో నిర్వహించిన జిల్లా స్థాయి రైతు మేళాను ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లుగా అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. గత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు వివిధ రూపాల్లో ఖర్చు చేస్తోందని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. యాసంగి సీజన్‌లో రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం పూర్తి మద్దతు అందించిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు సమయంలో కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురైన విషయం వాస్తవమేనని, గతంలో తగిన గోదాములు, ధాన్యం నిల్వకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల సమస్యలు ఏర్పడ్డాయని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదాముల సామర్థ్యాన్ని దాదాపు రెట్టింపు చేసిందన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చిందని, రైతుల పక్షాన నిలబడే ప్రభుత్వం ఇదేనని స్పష్టం చేశారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. భూ రికార్డులను ప్రక్షాళన చేసి రైతులు, భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. భూభారతి విధానం ద్వారా భూములకు స్పష్టమైన హక్కులు, టైటిల్, భూ రికార్డులు, మ్యాప్ తదితర వివరాలను అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రైతులు, భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను అందించి సమగ్ర భూ సర్వేకు సహకరించాలని కోరారు. ప్రజల సహకారంతో భూ రికార్డులను క్రమబద్ధీకరించి భవిష్యత్తులో భూ వివాదాలు, ఆక్రమణలు, హక్కుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని అన్నారు. వర్షాభావ పరిస్థితులు, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో జాగ్రత్త వహించాలని మంత్రి సూచించారు. తక్కువ నీటితో అధిక ప్రయోజనం పొందే పంటలను ఎంచుకోవాలని, నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. శాస్త్రవేత్తల సూచనలను రైతుల అనుభవంతో సమన్వయం చేసుకుని ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. రైతు మేళాల్లో శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, ప్రగతిశీల రైతులు అందించే సూచనలు, నూతన సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మేళాలో నేర్చుకున్న కొత్త సాగు పద్ధతులను తోటి రైతులతో పంచుకోవాలని సూచించారు. ''శాస్త్రవేత్తలకంటే రైతులే గొప్ప శాస్త్రవేత్తలు. ఎన్నో ఏళ్లుగా నేలను, నీటిని, పంటలను, ప్రకృతిని



పరిశీలించిన అనుభవం రైతులకు ఉంది. ఆ అనుభవానికి శాస్త్రీయ పరిజ్ఞానం తోడైతే వ్యవసాయంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చు'' అని మంత్రి అన్నారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ జిల్లా స్థాయి రైతు మేళా ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతికతలు, శాస్త్రీయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించడం ఎంతో ఉపయోగకరమన్నారు. శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతుల సూచనలు, అనుభవాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో కొత్త విధానాలను అనుసరించి ఉత్పాదకత, ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. రైతు మేళాలో వ్యవసాయ, ఉద్యానవన, ఇతర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తుల స్టాళ్లను మంత్రి, ప్రజాప్రతినిధులు, రైతులు సందర్శించారు. నూతన సాగు పద్ధతులు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత, విత్తనాలు, పంటల సాగు విధానాలు, వివిధ ఉత్పత్తుల గురించి రైతులు నిపుణులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చంద్ర, ఏడీఏ ఆదిరెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి కమలాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, వివిధ శాఖల అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రగతిశీల రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వివిధ మండలాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

## వాత్సల్య హాస్పిటల్ పై దాడి అమానుషం

### బాధ్యులను కఠినంగా శిక్షించాలి – మెడికల్ అసోసియేషన్ డిమాండ్

ఖమ్మం (ప్రజాజ్యోతి): ఖమ్మం నగరంలోని ప్రముఖ వాత్సల్య హాస్పిటల్‌పై జరిగిన దాడిని మెడికల్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది.అహర్నిశలు



శ్రమించి రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులు,ఆస్పత్రి సిబ్బందిపై ఇటువంటి భౌతిక దాడులకు పాల్పడటం అత్యంత అమానుషమని అసోసియేషన్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన వైద్య సంఘాల నాయకులు, వెంటనే స్పందించి కేసు నమోదు చేసిన ఖమ్మం టూ టౌన్ పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. ఆస్పత్రి ఆస్తులను ధ్వంసం చేసి, వైద్య సిబ్బందిని భయాందోళనలకు గురిచేసిన నిందితులపై టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిందని,అయితే కేవలం కేసు నమోదుతో సరిపెట్టకుండా దాడికి పాల్పడిన వ్యక్తులని నిత్తక్షణమే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.వైద్యులు నిరంతరం రోగుల సంక్షేమం కోసమే పనిచేస్తారని, చికిత్స సమయంలో అనుకోని అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు చట్టబద్ధమైన మార్గాల ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అలా కాకుండా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఆస్పత్రులపై దాడులు చేయడం, వైద్యులపై భౌతిక దాడులకు దిగడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే,నిందితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, హాస్పిటల్ రక్షణ చట్టం (మెడికల్ సర్వీసెస్ పర్సన్స్ అండ్ మెడికల్ సర్వీస్ ఇన్స్టిట్యూషన్స్ యాక్ట్) కింద కేసులు నమోదు చేసి తగిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు.వైద్యులకు రక్షణ లేకపోతే అత్యవసర సమయాల్లో వైద్యం అందించడానికి భయపడాల్సి వస్తుందని, ఇది అంతిమంగా సమాజానికే నష్టమని పేర్కొన్నారు.బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని మెడికల్ అసోసియేషన్ హెచ్చరించింది.నగరంలోని వైద్యులందరూ వాత్సల్య హాస్పిటల్ యాజమాన్యానికి, సిబ్బందికి పూర్తి మద్దతుగా నిలుస్తారని ప్రకటిస్తూ,భవిష్యత్తులో ఆస్పత్రులకు సరైన పోలీస్ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా ప్రముఖ వైద్య నిపుణులు ముక్కపాటి కోటేశ్వరరావు ఐఎంఏ సెక్రటరీ, సాయి భార్గవ్ ఐఏపి ఖమ్మం, కూరపాటి ప్రదీప్ కుమార్, కూరపాటి హరిప్రసాద్, విజయ్,సిద్ధిక్, కంభంపాటి నారాయణ తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ కోసమే బతికిన పెద్ది



మొదటిపేజీ తరువాయి..

వేలాది మంది తరలివచ్చారు. లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన ఎలాంటి వ్యక్తే



తెలుపడానికి ఇదే నిదర్శమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ఒంటిచేత్తో నడిపిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అని బీఆర్ఎస్ కేటీఆర్ అన్నారు. ప్రజల్లో సుదర్శన్‌రెడ్డి పట్ల ఉన్న గౌరవం.. ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నవారి సంఖ్యను చూస్తే తెలుస్తోందని చెప్పారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన పెద్ది సుదర్శన్ సంస్మరణ సభలో కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా పెద్ది సుదర్శన్‌రెడ్డి భారీ ఎత్తున నిర్వహించేవారు. ఆయన్ను బతికించుకునేందుకు ఎంత ప్రయత్నం చేయాలో అంతా చేశాం. ఎవరైనా ఎంతకాలం బతికామన్నది ముఖ్యం కాదు.. ఎలా బతికామన్నదే ముఖ్యం. ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిచినా.. జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఆయన పనిచేశారు. నర్సంపేటలో నిర్మించే మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతాం. ఆయన కుటుంబాన్ని కాపాడుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని కేటీఆర్ అన్నారు.తెలంగాణ ఉద్యమంలో పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా సాగిన పోరాటం, తెలంగాణ అనంతరం నర్సంపేట ఎమ్మెల్యేగా పెద్ది చేసిన శాశ్వత పనులపై చేసిన డాక్యుమెంట్ ప్రదర్శన పలువురిని కంటతడి పెట్టించింది. డాక్యుమెంటరీ చూసి పెద్ది భార్య స్వప్న కన్నీరుమున్నీరైంది. కార్యక్రమంలో శాసన మండలి విపక్షనేత సిరికొండ, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మాజీ మంత్రి ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేష్, గండ్ర సహా పలువురు నేతలు హాజరయ్యారు.

## గ్లోబల్ హబ్‌గా తెలంగాణలో ఇంధన రంగం అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి..

పాటు తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగాన గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికలపై లోతుగా చర్చించారు. భారతదేశం నిర్దేశించుకున్న 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యాన్ని అందుకునేందుకు అవసరమైన వ్యూహాలు, తగ్గుతున్న శుద్ధ సాంకేతికత ఖర్చులు తెచ్చిపెడుతున్న నూతన అవకాశాలను ఈ సమావేశంలో పరిశీలించారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, ఆధునిక బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల సమన్వయం , సమాన అవకాశాలతో కూడిన శక్తి పరివర్తన మార్గాలపై పరిశోధకులు, అధికారులతో డిప్యూటీ సీఎం విస్తృతంగా ఆలోచనలు పంచుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన వినూత్న పునరుత్పాదక ఇంధన మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పారదర్శకమైన హరిత విధానం ద్వారా గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్రంలో సౌరశక్తి సహా ఇతర పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగవంతంగా విస్తరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టడం, పీఎం-కుసుమ్ పథకం ద్వారా అన్నదాతలకు స్వచ్ఛ ఇంధనాన్ని అందించడం వంటి ప్రజాకేంద్రిత నమూనాలు అంతర్జాతీయ ప్రతినిధుల ప్రశంసలు అందుకున్నాయి. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు క్లీన్-టెక్ పరికరాల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్న తీరును ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు.సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా రాష్ట్ర ఇంధన రంగానుభవాలను ఉపయోగించుకుని తెలంగాణలో సరికొత్త ఇంధన విప్లవానికి శ్రీకారం చుట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు. విద్యుత్, రవాణా, పారిశ్రామిక , వాతావరణ స్థిరత్వ రంగాలలో సంయుక్త అధ్యయనాలు చేపట్టడం, విధాన నిర్ణేతలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో ఇంధన భద్రతను, ఆర్థిక పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు యూసీ బర్క్లీ ప్రతినిధులతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

## రిఫార్మ్ ఉత్సవ్‌పై కార్యాచరణ

మొదటిపేజీ తరువాయి..

ఆచరణాత్మక సంస్కరణలుగా మార్చి, నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికతో అమలు చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రిఫార్మ్ ఉత్సవ్‌ను మూడు దశల్లో అమలు చేయనున్నారు. మొదటి దశగా ఆగస్టు-సెప్టెంబర్ 2026లో సన్నాహక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందులో పరిపాలనా వ్యవస్థ ఏర్పాటు, అధికారుల సెన్సిటైజేషన్, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు ఉంటాయి. రెండో దశ అక్టోబర్-డిసెంబర్ 2026లో రిఫార్మ్ ఉత్సవ్గా నిర్వహించనున్నారు. ఇందులో జన్ మంథన్ కార్యక్రమం అక్టోబర్ 1 నుంచి 31 వరకు, విమర్శ్ జన్ సమాధాన్ కార్యక్రమాలు అక్టోబర్ 10 నుంచి నవంబర్ 30 వరకు నిర్వహించి, త్వరితగతిన అమలు చేయగల సంస్కరణలు, మధ్యకాలిక సంస్కరణలపై దృష్టి సారించనున్నారు. సంకల్ప సిద్ధి కార్యక్రమం అక్టోబర్ 10 నుంచి డిసెంబర్ 20 వరకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నారు. మూడో దశగా డిసెంబర్ 28, 2026 నుంచి తదుపరి చర్యలు చేపట్టనున్నారు. ఇందులో నిర్మాణాత్మక సంస్కరణలపై నిరంతర పర్యవేక్షణ, తదుపరి చర్యలు మరియు సమర్పణ ఉంటాయి. రిఫార్మ్ ఉత్సవ్ అమలుకు ప్రతి రాష్ట్రంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన స్టేట్ కోఆర్డినేటివ్ కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు స్టేట్ నోడల్ ఆఫీసర్ ను, జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు నవీన్ మిట్టల్, స్టీఫెన్ రవీంద్ర, బి. పాపిరెడ్డి, లా సెక్రటరీ, అనుదీప్ దురిశెట్టి, అహ్మద్ నదీమ్, మహేష్ దత్ ఎక్కా, గౌరవ్ ఉప్పల్, స్వాతి లక్రా, దేవసేన, దివ్య దేవరాజన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967